RNI No. APTEL/2008/23088

తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA
TELUGU DAILY
నిజం మా విజన్
18వ వసంతంలోకి

EDITOR :BOORLA VENKATESHAM KARIMNAGAR VOLUME:18 ISSUE:161 SUNDAY,NOVEMBER 22,2026 PAGES:12 COST: 2 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :161 ఆదివారం, నవంబర్ 22, 2026, పేజీలు -12 వెల :2/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

విశ్వనగరం విస్తరణలో అగ్నిపర్వతాలు



ఆకాశమంత ఎత్తు.. అనుకుని నిర్మాణాలు.. ప్రమాదం జరిగితే తప్పించుకునేదెలా..?

ఒకే ప్రాంగణంలో 20 నుంచి 40 అంతస్తుల టవర్లు.. వేలాది మంది ప్రాణాలకు పొంచి ఉన్న పెను ముప్పు.. ఒక బ్లాక్‌లో మంటలు చెలరేగితే పక్క టవర్‌కూ వ్యాపించే ప్రమాదం.. భూకంపం వస్తే పెను విపత్తు తప్పదా.?

తెలంగాణ పత్రిక విశ్లేషణాత్మకమైన స్పెషల్ స్టోరీ:

విశ్వనగరంగా శరవేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగరంలో నిలువునా ఎదిగే ఆకాశహర్మ్యాలు ఇప్పుడు సరికొత్త ఆందోళనకు కేంద్రబిందువుగా మారుతున్నాయి. అభివృద్ధి పేరిట ఒకే గేటెడ్ కమ్యూనిటీ లేదా ఒకే ప్రాంగణంలో అతి దగ్గరగా 20 నుంచి 40 అంతస్తుల వరకు పదుల సంఖ్యలో భారీ టవర్లను నిర్మిస్తుండటం భద్రతా నిపుణులను మిగతా 2లో



రికార్డు స్థాయి నుంచి పడిపోయిన విద్యుత్ డిమాండ్

థర్మల్ ప్లాంట్లకు విశ్రాంతి డిస్కమ్‌లకు కొత్త సవాళ్లు..

తెలంగాణ పత్రిక ప్రతినిధి విశ్లేషణాత్మకమైన స్పెషల్ స్టోరీ :

హైదరాబాద్ అక్టోబర్‌లో రికార్డులు బద్దలు కొట్టిన విద్యుత్ డిమాండ్ నవంబర్‌లో ఒక్కసారిగా చల్లబడింది. రాష్ట్రవ్యాప్తంగా వినియోగం పడిపోవడం తో ఫ్యాన్లు తిరుగుతున్నా ఏసీలు ఆగిపోయాయి, పొలాల్లో మోటార్ల మోత తగ్గింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నూ ఇదే పరిస్థితి నెలకొంది. వినియోగదారు లకు ఇది ఊరట కలిగించే విషయమే అయినా, విద్యుత్ సంస్థల లెక్కలు మాత్రం కొత్త ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

ఒక్క నెలలో ఇంత తేడానా

అక్టోబర్ 15, 16 తేదీల్లో రాష్ట్ర గరిష్ఠ డిమాండ్ 20 వేల మెగావాట్లను దాటి, 20,018 మెగావాట్ల రికార్డు స్థాయికి చేరింది. అప్పటివరకు 15 వేల మెగావాట్లు దాటని పీక్ డిమాండ్ ఒక్కసారిగా పెరగడం ఆ నెల ప్రత్యేకత. అక్టోబర్ ఆరంభంలో రోజువారీ వినియోగం సుమారు 340 మిలియన్ యూనిట్లు ఉండగా, అక్టోబర్ 8న డిమాండ్ 344.94 మిలియన్ యూనిట్లు ఉంటే సరఫరా 320.90 మిలియన్ యూనిట్లకే పరిమితమై, 24 మిలియన్ యూనిట్ల కొరత ఏర్పడిందని నివేదికలు తెలిపాయి. నవంబర్ ఒకటో తేదీ నాటికి పరిస్థితి తలకిందులైంది. ఆ రోజు డిమాండ్ 13,932 మెగావాట్లకు పడిపోయింది. పది రోజుల్లోనే సుమారు ఏడు వేల మెగావాట్ల డిమాండ్ తగ్గిందని విద్యుత్ రంగ వర్గాల అంచనా. రోజువారీ వినియోగం నవంబర్ 15న 225.60 మిలియన్ యూనిట్లకు, 18న 235.48 మిలియన్ యూనిట్లకు చేరింది. అంటే గత నెలతో పోలిస్తే సుమారు మూడో వంతు తగ్గింది. ఎందుకీ తగ్గుదల మిగతా 2లో

ఇందిరమ్మ కుటుంబ బీమాకు మార్గదర్శకాలు విడుదల..



●ఒక రేషన్ కార్డుపై ఒక్కరికే రూ.5 లక్షల రక్షణ

●నెల రోజుల పాటు ప్రత్యేక నమోదు శిబిరాలు..

●చిన్న తప్పులున్నా దరఖాస్తులు తిరస్కరించవద్దని అధికారులకు ఆదేశం..

తెలంగాణ పత్రిక ప్రతినిధి హైదరాబాద్:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు సంబంధించి ప్రణాళికా శాఖ కీలక మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ పథకం కింద అర్హులైన ప్రతి కుటుంబానికి ఐదు లక్షల రూపాయల జీవిత బీమా సౌకర్యాన్ని కల్పించనున్నారు. ఒక రేషన్ కార్డుపై ఒక దరఖాస్తుకు మాత్రమే అనుమతి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. కుటుంబంలో ఒక్కరికి మాత్రమే ఈ బీమా 2లో

నలభై కోట్ల ధాన్యం గోల్‌మాల్‌పై ఈడీ ఆరా..



మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ ఇంట్లో సోదాలు.. మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు..!

తెలంగాణ పత్రిక ప్రతినిధి నిర్మల్ :

నలభై కోట్ల రూపాయల విలువైన ధాన్యం గోల్‌మాల్ వ్యవహారంపై ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు దృష్టి సారించారు. ఈ కేసుకు సంబంధించి ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ 2లో



హస్తిన పిలుపు.. 23న తేలనున్న లెక్క

●రాజగోపాల్ రెడ్డికి కొత్త ఇన్‌ఛార్జ్ బి.ఎం. సందీప్ ఫోన్..?

●హైదరాబాద్‌కు ఏఐసీసీ ఇన్‌ఛార్జ్..

●23న మునుగోడు ఎమ్మెల్యేతో భేటీ తగ్గేదేలే అంటున్న రాజగోపాల్..

●యూటర్న్ తీసుకున్న జడ్పర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

●పీఏసీ సమావేశంలో క్రమశిక్షణ ఉల్లంఘనలపై కీలక చర్చకు అవకాశం

తెలంగాణ పత్రిక ప్రతినిధి హైదరాబాద్:

తెలంగాణ కాంగ్రెస్‌లో ప్రకంపనలు సృష్టిస్తున్న అసమ్మతి వివాదం కీలక మలుపు తిరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, వీడియో క్లిప్పులు ఢిల్లీకి చేరిన నేపథ్యంలో ఆ్థానం రంగంలోకి దిగింది. తెలంగాణ మిగతా 2లో

ఢిల్లీని కమ్మేసిన విష వాయువులు..

ఎయిమ్స్ వద్ద డేంజర్' బెల్స్.. AQI 369 నమోదు..!



న్యూఢిల్లీ తెలంగాణ పత్రిక ప్రతినిధి: దేశ రాజధాని ఢిల్లీని మళ్లీ కాలుష్య మేఘాలు కమ్మేశాయి. దట్టమైన పొగమంచు, దుమ్ము ధూళి కారణంగా నగరవాసులు ఊపిరి పీల్చుకోవడానికే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఎయిమ్స్ పరిసర ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచీ369గా నమోదైంది. కేంద్ర మిగతా 2లో

లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కిన జీఎస్టీ సూపరింటెండెంట్

సోదాల్లో రూ.1.86 కోట్ల నగదు విదేశీ కరెన్సీ, బంగారం స్వాధీనం

హరియాణాలోని పంచకులలో సీబీఐ అధికారుల వల..



తెలంగాణ పత్రిక ప్రతినిధి ఢిల్లీ న్యూఢిల్లీ: లంచం తీసుకుంటూ కేంద్ర జీఎస్టీ (సీజీఎస్టీ) సూపరింటెండెంట్ సీబీఐ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. హరియాణాలోని పంచకులలో విధులు నిర్వహిస్తున్న ఈ అధికారి నివాసంలో సీబీఐ అధికారులు నిర్వహించిన సోదాల్లో రూ. 1.86 కోట్ల విలువైన మిగతా 2లో

ఓఎస్డీనంటూ నిరుద్యోగులకు టోకరా..

రూ.50.87 లక్షల వసూలు..

నకిలీ ఐడీ కార్డు, నకిలీ వెబ్‌సైట్లతో నమ్మించిన ఇద్దరు నిందితుల అరెస్ట్.. 2



బతికున్న భార్యను కాగితాలపై చంపేసి..

రూ.15 లక్షల ఆస్తి కొట్టేసిన భర్త

●గుండెపోటుతో మరణించినట్లు నకిలీ డెత్ సర్టిఫికెట్ సృష్టించి స్థలం విక్రయం.. ●నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలో వెలుగుచూసిన విస్తుపోయే మోసం



సందడిగా సాగిన 27వ అఖిల భారత పోలీస్ బ్యాండ్ పోటీలు



ఐదు రోజుల వేడుకలకు ఘనంగా ముగింపు.. బృందాలను అభినందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్..

తెలంగాణ పత్రిక ప్రతినిధి:

హైదరాబాద్ వేదికగా కేంద్ర రిజర్వ్ పోలీస్ బలగం (సీఆర్‌పీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన 27వ అఖిల భారత పోలీస్ బ్యాండ్ పోటీలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఈ నెల 16న ప్రారంభమైన ఈ వేడుకలు ఐదు రోజులపాటు ఎంతో సందడిగా సాగాయి. దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, కేంద్ర సాయుధ పోలీస్ బలగాలకు చెందిన సుమారు 30 బ్యాండ్ బృందాలు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నాయి మిగతా 12లో



రేవంత్‌రెడ్డి ఉద్యమంలో పాల్గొన్న వ్యక్తి కాదు ఎంపీ అర్వింద్

డిసెంబర్‌లో నిజామాబాద్‌కు అమిత్ షా.. భారీ పాదయాత్ర, బహిరంగ సభ..

ఈ నెల 23న జరగాల్సిన నితిన్ నబీన్ పాదయాత్ర రద్దు

తెలంగాణ పత్రిక ప్రతినిధి నిజామాబాద్ :

వచ్చే నెలలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్నారని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ వెల్లడించారు. ఆయన పర్యటనలో భాగంగా జిల్లాలో మహా పాదయాత్రతో పాటు భారీ బహిరంగ సభను మిగతా 12లో

విశ్వనగరం విస్తరణలో అగ్నిపర్వతాలు..

ఒక్కో టవర్‌లో వందలాది ఫ్లాట్లు, ఒకే ప్రాంగణంలో సుమారు వెయ్యి నుంచి పదిహేను వందల మందికి పైగా నివాసితులు ఉంటున్న నేపథ్యంలో ఏ చిన్న విపత్తు సంభవించినా ప్రాణనష్టం ఊహకందని స్థాయిలో ఉంటుందనే భయం నగరవాసులను వెంటాడుతోంది.

విశ్వనగరంలో నిలువునా పెరుగుతున్న జనసాంద్రత..

ప్రమాదం జరిగితే ఏంటి పరిస్థితి?

విశ్వనగర స్థాయి మౌలిక వసతులంటూ సాగుతున్న భారీ గేటెడ్ కమ్యూనిటీలు, హైరైజ్ ప్రాజెక్టులలో అనేక టవర్లు ఒకదానికొకటి అత్యంత సమీపంలో నిర్మితమవుతున్నాయి. ఒక టవర్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవిస్తే బలమైన గాలుల వల్ల మంటలు, దట్టమైన పొగ, వేడి అతి సమీపంలో ఉన్న పక్క టవర్‌కు కూడా వ్యాపించే ప్రమాదం పొంచి ఉంది. ఒకే ప్రాంతంలో వెయ్యి నుంచి పదిహేను వందల మందికి పైగా నివాసితులు ఒకేసారి ప్రాణభయంతో కిందకు పరుగులు తీస్తే తొక్కిసలాట జరిగే ప్రమాదంతో పాటు అగ్నిమాపక వాహనాలు, అంబులెన్స్‌లు లోపలికి వెళ్లడానికి కూడా దారి లేని పరిస్థితి ఏర్పడుతుంది. ప్రీ లాంచ్ ఆఫర్లు, భారీ లాభాల వేటలో బిల్డర్లు నిర్మాణ నాణ్యతలో ఏమాత్రం రాజీ పడినా, నాసిరకం ఎలక్ట్రికల్ వైర్లు లేదా ఫైర్ సేఫ్టీ పరికరాలు వాడినా అది వందలాది కుటుంబాలకు మృత్యుపాశంగా మారుతుంది.

భూకంపం వస్తే విశ్వనగరానికి పెను విపత్తు తప్పదా?

అగ్ని ప్రమాదాలతో పాటు ప్రకృతి వైపరీత్యాలైన భూకంపాల ముప్పు కూడా ఈ భారీ క్లస్టర్లపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఒకే జాగాలో, అతి తక్కువ గ్యాప్‌తో 30, 40 అంతస్తుల భవనాలు నిర్మించడం వల్ల భారీ భూకంపం సంభవిస్తే భవనాలు కదిలి ఒకదానికొకటి ఢీకొనే లేదా ఒకదానిపై ఒకటి కూలిపోయే ప్రమాదం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భూకంపాలను తట్టుకునేలా సీస్మిక్ జోన్ నిబంధనల ప్రకారం పునాదులు, పిల్లర్లు నిర్మించకపోతే ఒకే ప్రాంగణంలో నివసించే వేలాది మంది ప్రాణాలు గాలిలో దీపంలా మారతాయి.

నిబంధనలు కాగితాలకే పరిమితమా?

ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ పెంపుతో విశ్వనగరంలో ఆకాశహర్మ్యాల నిర్మాణం ఊపందుకున్నప్పటికీ వాటికి తగ్గట్టుగా భద్రతా ప్రమాణాలు అమలు కావడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి టవర్ మధ్య కనీస దూరం నిబంధనలను కచ్చితంగా పాటించకపోవడం వల్ల ప్రమాద తీవ్రత పెరుగుతోంది. అన్ని హైరైజ్ భవనాల్లో ఆటోమేటిక్ స్ప్రింక్లర్ సిస్టమ్స్, స్మోక్ డిటెక్టర్లు, అగ్ని నిరోధక గోడలు నూరు శాతం పనిచేసే స్థితిలో ఉండాలి. బిల్డర్లు నిర్మించే ప్రతి టవర్ నాణ్యతపై స్వతంత్ర నిపుణులతో థర్డ్ పార్టీ ఆడిట్ నిర్వహించాలి.

ప్రాణాలకు భరోసా ఎక్కడ?

విశ్వనగరం అంటే కేవలం ఆకాశాన్ని తాకే భవనాలు మాత్రమే కాదు అందులో నివసించే ప్రతి పౌరుడి ప్రాణాలకు పూర్తి భద్రత ఉండటం. కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన అపార్ట్‌మెంట్లు నివాసితులకు సురక్షితమైన గూడులా ఉండాలి కానీ ఒకే చోట కిక్కిరిసిన మృత్యుకుహరాలుగా మారకూడదు. ఒక టవర్‌లో ప్రమాదం జరిగితే పక్క టవర్‌కు సెగ తగలకుండా ఉండేలా నిర్మాణ ప్రణాళికలు, అత్యవసర సమయాల్లో వేలాది మంది సురక్షితంగా బయటపడే ఏర్పాట్లు చేసినప్పుడే హైదరాబాద్ విశ్వనగరానికి నిజమైన భద్రత లభిస్తుందని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

హైరైజ్ కొనుగోలుదారులు గమనించాల్సిన ఐదు భద్రతా సూత్రాలు

రెండు టవర్ల మధ్య అగ్నిమాపక వాహనాలు సులభంగా ఫ్లాట్, కారిడార్‌లో ఆటోమేటిక్ స్ప్రింక్లర్, స్మోక్ అలారం వ్యవస్థలు పనిచేస్తున్నాయో లేదో చూడాలి. అగ్నిమాపక శాఖ నుంచి పొందిన నిరభ్యంతర పత్రం రెన్యూవల్ అయిందో లేదో పరిశీలించాలి. అత్యవసర మెట్ల మార్గాల్లో ఎటువంటి అడ్డంకులు లేకుండా స్పష్టమైన సంకేతాలు ఉండేలా చూసుకోవాలి. ఎలక్ట్రికల్ వైరింగ్, నిర్మాణ నాణ్యత విషయంలో ప్రమాణాలు పాటించారా లేదా అని నిర్ధారించుకోవాలి.

రికార్డు స్థాయి నుంచి పడిపోయిన విద్యుత్ డిమాండ్ థర్మల్ ప్లాంట్లకు విశ్రాంతి డిస్కమ్‌లకు కొత్త సవాళ్లు..

కారణాలు ప్రధానంగా నాలుగు కనిపిస్తున్నాయి. వాతావరణం: తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలు, ఆ తర్వాత మొదలైన చలితో ఏసీలు, కూలర్ల వాడకం బాగా తగ్గింది. వ్యవసాయ వినియోగం: వరి కోతలు ముగియడంతో బోరుబావుల మోటార్ల వాడకం పడిపోయింది. పండుగ, సెలవుల ప్రభావం: దసరా సమయంలో హైదరాబాద్ నుంచి చాలామంది స్వస్థలాలకు వెళ్లడంతో నగర వినియోగం కొంతకాలం తగ్గింది. రుతువు మార్పు: వేసవి గరిష్ఠాల తర్వాత సహజంగా వచ్చే చలికాలపు తగ్గుదల ఇది. అంటే ఇది ఆర్థిక మందగమనానికి సంకేతమని అప్పుడే చెప్పలేం. వాతావరణం, పంటల కాలచక్రమే ప్రధాన కారణమని నిపుణుల అభిప్రాయం.

థర్మల్ ప్లాంట్లకు విశ్రాంతి

డిమాండ్ తగ్గిన ప్రభావం ముందుగా జెన్‌కో థర్మల్ కేంద్రాలపై పడింది. పక్షం రోజుల క్రితం వరకు రోజంతా పూర్తి సామర్థ్యంతో నడిచిన ప్లాంట్లను ఇప్పుడు సగం రోజే నడిపిస్తున్నట్లు సమాచారం. పగటి వేళ విశ్రాంతినిచ్చి, రాత్రివేళ మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారు. నవంబర్ 2న థర్మల్ ప్లాంట్లు 108.30 మిలియన్ యూనిట్లు అందించగా, 16న అది 100.34 మిలియన్ యూనిట్లకు తగ్గింది. ఇదే సమయంలో కొన్ని యూనిట్లలో నిర్వహణ పనులు జరుగుతున్నాయి. భూపాలపల్లి కాకతీయ ప్లాంట్‌లో యూనిట్ 1 (500 మెగావాట్లు) వార్షిక ఓవర్‌హాలింగ్ కోసం నిలిపివేశారు. భద్రాద్రి ప్లాంట్‌లోని యూనిట్ 1, యూనిట్ 3, కొత్తగూడెంలోని 250 మెగావాట్ల యూనిట్ 10, యాదాద్రి యూనిట్ 3లో మరమ్మతులు సాగుతున్నాయి. మొత్తం 2,090 మెగావాట్ల ఉత్పత్తి ఆగిందని వెల్లడైంది. డిమాండ్ తక్కువగా ఉన్న ఈ సమయాన్ని నిర్వహణకు వాడుకోవడం మంచి నిర్ణయమేనని, ఇవే పనులు వేసవిలో చేయడం సాధ్యం కాదని ఇంధన రంగ నిపుణులు అంటున్నారు.

కొనుగోళ్లు చౌక కరెంటు వ్యూహం

బహిరంగ మార్కెట్లో విద్యుత్ చౌకగా దొరుకుతుండటంతో సొంత ఉత్పత్తి తగ్గించి కొనుగోళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇటీవలి రోజుల్లో సగటున రోజుకు 60 నుంచి 83 మిలియన్ యూనిట్లు కొంటున్నారు. అక్టోబర్ 18న రాష్ట్రం వినియోగించిన 319 మిలియన్ యూనిట్లలో 96 మిలియన్ యూనిట్లను యూనిట్‌కు సగటున రూ 4.94 చొప్పున కొన్నట్లు వార్తలు వచ్చాయి. ఇక్కడ విశ్లేషణ అవసరం. చౌక విద్యుత్ కొనడం వల్ల తక్షణ ఖర్చు తగ్గవచ్చు. అయితే ఉత్పత్తి కేంద్రాలతో చేసుకున్న దీర్ఘకాల ఒప్పందాల్లో స్థిర ఛార్జీలు ఉంటాయి. ప్లాంట్లు నడవకపోయినా ఈ ఛార్జీలు చెల్లించాల్సి వస్తే, డిస్కమ్‌లపై భారం పడుతుంది. ఈ భారం చివరకు వినియోగదారుల టారిఫ్‌పై పడకుండా చూసుకోవడం విద్యుత్ నియంత్రణ మండలి, ప్రభుత్వం ముందున్న బాధ్యత.

హైదరాబాద్ లెక్క వేరు

గ్రేటర్ పరిధిలోనే రాష్ట్ర డిమాండ్‌లో సింహభాగం ఉంటుంది. నవంబర్ 1 నాటి డిమాండ్‌లో 70 శాతం దక్షిణ డిస్కమ్ పరిధిలోనే నమోదైందని నివేదికలు తెలిపాయి. ఉత్తర డిస్కమ్ వాటా 30 శాతమే. నగరంలో వాణిజ్య, ఐటీ, నివాస వినియోగం ఏడాది పొడవునా ఎక్కువే ఉండటంతో, ఇక్కడి తగ్గుదల రాష్ట్ర గణాంకాలపై నేరుగా ప్రభావం చూపుతోంది.

ముందున్న సవాళ్లు

వేసవి సన్నద్ధత: ఈ ఏడాది అక్టోబర్‌లోనే 20 వేల మెగావాట్లు దాటిన డిమాండ్ వేసవిలో ఎంత ఉంటుందో ఇప్పటినుంచే అంచనా వేసి, ఉత్పత్తి, కొనుగోలు ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఆర్థిక భారం: తక్కువ డిమాండ్ కాలంలో స్థిర ఛార్జీల చెల్లింపులు, డిస్కమ్‌ల నష్టాలపై స్పష్టత కావాలి. మరమ్మతుల గడువు: ప్లాంట్ల నిర్వహణ పనులు డిమాండ్ పెరగకముందే పూర్తి కావాలి. పునరుత్పాదక వనరులు: పగటి వేళ మిగులు విద్యుత్‌ను వినియోగించుకునే, నిల్వ చేసే ఏర్పాట్లపై దృష్టి పెట్టాలి. చివరగా డిమాండ్ తగ్గడం తాత్కాలికమే. చలికాలం గడిచి వేసవి రాగానే ఈ లెక్కలు మళ్లీ తారుమారవుతాయి. అప్పుడు ఇబ్బంది పడకుండా ఉండాలంటే ఇప్పుడు దొరికిన వెసులుబాటును సరిగా వాడుకోవడమే విద్యుత్ సంస్థల ముందున్న అసలైన పరీక్ష...

ఇందిరమ్మ కుటుంబ బీమాకు మార్గదర్శకాలు విడుదల..

ఒక రేషన్ కార్డుపై ఒక దరఖాస్తుకు మాత్రమే అనుమతి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. కుటుంబంలో ఒక్కరికి మాత్రమే ఈ బీమా వర్తిస్తుందని, ఎవరిని నమోదు చేయించాలనే విషయాన్ని కుటుంబ సభ్యులే స్వయంగా నిర్ణయించుకోవాలని సూచించా రు. బీమా పొందిన వ్యక్తి దురదృష్టవశాత్తు మరణిస్తే, నామినీకి ఐదు లక్షల రూపాయల ఆర్థిక సాయం అందుతుంది. ఈ పథకంలో చేరడానికి పద్దెనిమిది నుంచి యాభై తొమ్మిది ఏళ్ల మధ్య వయసున్న వారు అర్హులని ప్రభుత్వం పేర్కొంది. అంటే పందొమ్మిది వందల అరవై ఏడు నవంబర్ పందొమ్మిది నుంచి రెండు వేల ఎనిమిది నవంబర్ పద్దెనిమిది మధ్య జన్మించిన వారంతా నమోదు చేసుకోవచ్చు. రేషన్ కార్డు నంబరునే దరఖాస్తు నంబరుగా పరిగణిస్తారు. ఒకవేళ రేషన్ కార్డు లేని కుటుంబాలు ఉంటే, వారికి ప్రత్యేక దరఖాస్తు ఫారం అందజేసి ప్రత్యేక కోడ్ కేటాయిస్తారు. నమోదు కోసం లబ్ధిదారులు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, మొబైల్ నంబర్ వెంట తీసుకెళ్లాలి. ఆధార్ కార్డులో పుట్టిన తేదీ తప్పుగా ఉంటే ముందుగా దానిని సరి చేయించుకోవాలని అధికారులు సూచించారు. ఒకరికంటే ఎక్కువ మందిని నామినీలుగా పేర్కొనే వెసులుబాటు కల్పించారు. నామినీ మైనర్ అయితే, క్లెయిమ్ స్వీకరించేందుకు మేజర్ అయిన సంరక్షకుని పేరును తప్పనిసరిగా నమోదు చేయాలి. ప్రత్యేక వెబ్ పోర్టల్, మొబైల్ అప్లికేషన్ ద్వారా ఓటీపీ ధ్రువీకరణతో నమోదు ప్రక్రియ పూర్తవుతుంది. ఇతర జిల్లాలకు చెందిన రేషన్ కార్డు ఉన్న కుటుంబాలు కూడా తమకు సమీపంలోని శిబిరంలోనే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. దరఖాస్తుల పరిశీలన సమయంలో వివరాల్లో చిన్నచిన్న తప్పులు ఉన్నప్పటికీ వాటిని వెనక్కి పంపవద్దని, తిరస్కరించ వద్దని అధికారులను ప్రభుత్వం స్పష్టంగా ఆదేశిం చింది. అర్హులందరికీ పథకం అందేలా నెల రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక నమోదు శిబిరాలను నిర్వహించనున్నారు. రేషన్ కార్డు ఉన్న కుటుంబాలు తమ ఆధార్, రేషన్ కార్డులతో సమీపంలోని శిబిరా నికి వెళ్లి వెంటనే దరఖాస్తు చేసుకోవాలని అధికా రులు కోరారు.

హస్తిన పిలుపు.. 23న తేలనున్న లెక్క

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, వీడియో క్లిప్పులు ఢిల్లీకి చేరిన నేపథ్యంలో అధిష్ఠానం రంగంలోకి దిగింది. తెలంగాణ కాంగ్రెస్ కొత్త ఇన్‌ఛార్జ్‌గా నియమితులైన బి.ఎం. సందీప్ స్వయంగా ఢిల్లీ నుంచి రాజగోపాల్ రెడ్డికి ఫోన్ చేసి మాట్లాడినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఆదివారం (నవంబర్ 22) హైదరాబాద్‌కు రానున్న సందీప్, మరుసటి రోజు అంటే నవంబర్ 23న తనను వ్యక్తిగతంగా కలవాలని రాజగోపాల్ రెడ్డికి సూచించారు.

తగ్గేదేలే అంటున్న రాజగోపాల్ రెడ్డి

అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చినప్పటికీ రాజగోపాల్ రెడ్డి తన వైఖరిని మార్చుకోలేదు. సిద్దిపేట సభలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన మరోసారి ఘాటుగా స్పందించారు. ఇన్‌ఛార్జ్ బి.ఎం. సందీప్ తనకు ఫోన్ చేసిన విషయాన్ని ఆయనే స్వయంగా ధృవీకరించారు. నేను పార్టీ మారే ప్రసక్తే లేదు, రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే నా లక్ష్యం. 23న కొత్త ఇన్‌ఛార్జ్ సందీప్‌ను కలిసి నియోజకవర్గ నిధులు, పాలనపై నా ఆవేదనను వివరిస్తాను" అని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

అనిరుధ్ రెడ్డి యూటర్న్:

మరోవైపు, రాజగోపాల్ రెడ్డితో పాటు అధిష్ఠానం పరిశీలనలో ఉన్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వ్యూహాత్మకంగా వెనక్కి తగ్గారు. సీఎం వ్యాఖ్యలు తనను ఉద్దేశించి కాదని, తనకు ముఖ్యమంత్రితో ఎలాంటి విభేదాలు లేవని ఆయన వివరణ ఇచ్చారు. జడ్చర్ల రోడ్ల మరమ్మతులు, క్షేత్రస్థాయి అవినీతిపై గతంలో సీఎం చెప్పిన మాటలనే తాను గుర్తు చేశానని ఆయన సర్దుబాటు ధోరణి కనబరిచారు. ఉమ్మడి నల్గొండ జిల్లా కాంగ్రెస్‌లోనూ రాజగోపాల్ రెడ్డిపై వ్యతిరేకత తీవ్రమైంది. నల్గొండ డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాష్ నేత మీడియా సమావేశం ఏర్పాటు చేసి, పార్టీకి నష్టం కలిగిస్తున్న రాజగోపాల్ రెడ్డిపై ఏఐసీసీకి ఫిర్యాదు చేస్తానని, దమ్ముంటే సొంత పార్టీ పెట్టుకోవాలని సవాల్ విసిరారు. ఆదివారం కొత్త ఇన్‌ఛార్జ్ సందీప్ అధ్యక్షతన జరగనున్న టీపీసీసీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ (గ్రూపు) సమావేశంలో ఈ క్రమశిక్షణ ఉల్లంఘనలపై కీలక చర్చ జరిగే అవకాశం ఉందని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి.

లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కిన జీఎస్టీ సూపరింటెండెంట్

నిర్వహిస్తున్న ఈ అధికారి నివాసంలో సీబీఐ అధికారులు నిర్వహించిన సోదాల్లో రూ. 1.86 కోట్ల విలువైన నగదు, విదేశీ కరెన్సీ, బంగారం, వెండిని స్వాధీనం చేసుకున్నారు.

రూ.50 లక్షల డిమాండ్.. రూ.10 లక్షలతో పట్టివేత

సీబీఐ వెల్లడించిన వివరాల ప్రకారం, ఓ ప్రైవేట్ సంస్థపై జరుగుతున్న జీఎస్టీ చర్యల్లో అనుకూలంగా వ్యవహరిస్తానంటూ సూపరింటెండెంట్ లంచం డిమాండ్ చేశాడు. భారీ జరిమానాలు విధించకుండా ఉండేందుకు, తదుపరి డిమాండ్ నోటీసులు జారీ చేయకుండా ఉండేందుకు ఆ సంస్థ భాగస్వామి నుంచి మొదట రూ. 50 లక్షలు డిమాండ్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే రోజు పంచకులలో వలపన్ని, రూ. 10 లక్షల లంచం తీసుకుంటుండగా సదరు అధికారిని సీబీఐ అధికారులు అరెస్టు చేశారు.

ఇంటి సోదాల్లో భారీగా సొత్తు లభ్యం

అరెస్టు అనంతరం శుక్రవారం నిందితుడి ఇంట్లో సీబీఐ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో రూ. 24.29 లక్షల భారతీయ నగదు, సుమారు రూ. 15.65 లక్షల విలువైన విదేశీ కరెన్సీ లభించాయి. వీటితో పాటు బంగారు ఆభరణాలు, బంగారు కడ్డీలు, వెండి కలిపి సుమారు రూ. 1.46 కోట్ల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. మొత్తం స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ సుమారు రూ. 1.86 కోట్లు ఉంటుందని సీబీఐ ప్రతినిధి తెలిపారు. విదేశీ కరెన్సీ ఎలా సమకూరిందనే కోణంలోనూ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో నిందితుల్లో షేక్ మున్నా, మహంకాళి శ్రీనివాస్ ఉన్నారని సమాచారం. ఘటనపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది.

నలభై కోట్ల ధాన్యం గోల్‌మాల్‌పై ఈడీ ఆరా..

నలభై కోట్ల రూపాయల విలువైన ధాన్యం గోల్‌మాల్ వ్యవహారంపై ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు దృష్టి సారించారు. ఈ కేసుకు సంబంధించి ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ నివాసంలో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. మనీలాండరింగ్ కోణంలో ఈ వ్యవహారంపై లోతైన దర్యాప్తు చేపట్టారు. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ధాన్యం అక్రమాలకు సంబంధించి పెద్ద ఎత్తున నిధుల మళ్లింపు జరిగినట్లు ఆరోపణలు రావడంతో ఈడీ రంగంలోకి దిగింది. నిర్మల్ జిల్లాలోని రైస్ మిల్లుల్లో ధాన్యం నిల్వల తేడాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ వ్యవహారంలో పన్నెండు కోట్ల రూపాయల ధాన్యం పక్కదారి పట్టగా, అధికారులు ఇరవై రెండు కోట్ల రూపాయల పెనాల్టీ విధించారని మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ మీడియా సమావేశంలో వెల్లడించారు. పెనాల్టీ విధింపు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రికార్డులను ఈడీ అధికారులు పరిశీలిస్తున్నారు. ధాన్యం గోల్‌మాల్ వెనుక ఉన్న ఆర్థిక మూలాలు, నిధుల బదిలీలపై పూర్తిస్థాయి వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ఈ పరిణామంతో జిల్లా రాజకీయ, వ్యాపార వర్గాల్లో కలకలం రేగింది...

ఢిల్లీని కమ్మేసిన విష వాయువులు..

కంద్ర కాలుష్య నియంత్రణ మండలి (జ్ఞాజదీ) నిబంధనల ప్రకారం ఇది 'అత్యంత పేలవమైన' (వెరీ పూర్) కేటగిరీలోకి వస్తుంది. ఉదయం వేళల్లో రహదారులు, ఫ్లైఓవర్లు కనిపించనంతగా పొగమంచు కమ్ముకోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గాలిలో విషతుల్యమైన కణాలు పెరగడం వల్ల ప్రజల్లో కళ్ల మంటలు, గొంతు నొప్పి, పొడి దగ్గు, శ్వాసకోశ సమస్యలు అధికమవుతున్నాయి. ఈ స్థాయి కాలుష్య గాలిని ఎక్కువసేపు పీల్చడం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, ఆస్తమా మరియు గుండె జబ్బులు ఉన్నవారు అత్యంత అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. చలికాలం కావడంతో గాలి వేగం మందగించడం, వాహనాల పొగ, నిర్మాణ పనుల ధూళితో పాటు పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాల దహనం ఢిల్లీ కాలుష్యానికి ప్రధాన కారణాలుగా మారాయి. కాలుష్య తీవ్రతను అరికట్టేందుకు అధికారులు 'గ్రాప్' (+=ూ్రా) ఆంక్షలను అమలు చేస్తున్నారు. రహదారులపై నీటిని చల్లే యంత్రాలను (వాటర్ స్ప్రింక్లర్స్) రంగంలోకి దించడంతో పాటు నిర్మాణ ప్రాంతాల్లో దుమ్ము నియంత్రణ చర్యలు, బహిరంగంగా వ్యర్థాలు కాల్చడంపై నిషేధం వంటివి చేపట్టారు. అయినప్పటికీ గాలి నాణ్యతలో ఆశించిన స్థాయిలో మార్పు రాకపోవడంతో ఢిల్లీ ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.!

ఓఎస్డీనంటూ నిరుద్యోగులకు టోకరా..

ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కార్యాలయంలో ఓఎస్డీ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ నని నమ్మించి, ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. బాధితులు మంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేయడంతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం, రామంతాపూర్ నెహ్రూనగర్‌కు చెందిన కొలుగూరి రవికిరణ్ ఈ మోసానికి ప్రధాన సూత్రధారి. నకిలీ ఓఎస్డీ గుర్తింపు కార్డు, నకిలీ నియామక ఉత్తర్వులు చూపించి, ప్రభుత్వ వెబ్‌సైట్లను పోలిన నకిలీ పోర్టళ్లను సృష్టించి అభ్యర్థులను నమ్మించాడు. టీచర్, మున్సిపల్ అటెండర్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, రికార్డ్ అసిస్టెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి, నలుగురు బాధితుల నుంచి విడతలవారీగా మొత్తం రూ.50.87 లక్షలు తీసుకున్నాడు. గుంటూరులో మీ-సేవ కేంద్రం నిర్వహిస్తున్న రవికుమార్ ఈ మోసంలో అతడికి సహకరించాడు. బాధితులు మంత్రి కార్యాలయానికి వెళ్లి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. దీనిపై పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సైఫాబాద్ పోలీసులు రవికిరణ్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదే తరహాలో మొత్తం ఎనిమిది మంది నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు అడిగేవారిని నమ్మవద్దని అధికారులు సూచించారు. మంత్రి కార్యాలయం పేరుతో, గుర్తింపు కార్డులు చూపించి ఎవరైనా సంప్రదిస్తే ముందుగా అధికారికంగా నిర్ధారించుకోవాలని కోరారు..

బతికున్న భార్యను కాగితాలపై చంపేసి..

ఆస్తులు, డబ్బు కోసం మనుషులు ఎంతకైనా తెగిస్తున్నారు. క్షణికావేశంలో హత్యలకు పాల్పడే ఘటనలు చూస్తుంటాం కానీ, నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలో ఓ భర్త చేసిన పని పోలీసులనే విస్మయానికి గురిచేసింది. రక్తం చిందించకుండా, కనీసం ఆమె ప్రాణం తీయకుండానే బతికున్న భార్యను ప్రభుత్వ రికార్డుల్లో చంపేసి రూ.15 లక్షల విలువైన ఆస్తిని కాజేశాడు. చివరకు తాను బతికే ఉన్నానని నిరూపించుకోవడానికి ఆ భార్య పోలీస్ స్టేషన్ మెట్లెక్కాల్సి వచ్చింది.

అసలేం జరిగిందంటే:

ఆర్మూర్ మండలం పెర్కిట్ గ్రామానికి చెందిన దేశాయిపేట రవి ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి 2017లో కామారెడ్డి జిల్లా బీర్కూర్‌కు చెందిన గీతాంజలితో వివాహమైంది. పెళ్లైన కొన్నాళ్లకు దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో గీతాంజలి పుట్టింటికి వెళ్లిపోయింది. రవి 2023లో తన సొంతూరు పెర్కిట్‌కు తిరిగి వచ్చాడు. ఈ క్రమంలో కోటార్మూర్ వద్ద భార్య గీతాంజలి పేరిట ఉన్న 267 గజాల స్థలంపై రవి కన్నుపడింది. ఎలాగైనా ఆ స్థలాన్ని అమ్మి సొమ్ము చేసుకోవాలని పథకం వేశాడు.

డాక్యుమెంట్ రైటర్ అనుభవంతో భారీ స్కెచ్:

తన వృత్తి అనుభవాన్ని ఉపయోగించి రవి పక్కా ప్రణాళిక రచించాడు. తన భార్య 2018లోనే గుండెపోటుతో మరణించినట్లు నకిలీ డెత్ సర్టిఫికెట్ సృష్టించాడు. ఆ పత్రం ఆధారంగా ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల సమక్షంలో వాంగ్మూలం ఇచ్చి తహసీల్దార్ కార్యాలయం నుండి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కూడా పొందాడు. అనంతరం ఆ స్థలాన్ని తన తల్లి లక్ష్మీబాయి పేరిట గిఫ్ట్ డీడ్ చేయించి, ఆపై రూ.15 లక్షలకు మరొకరికి విక్రయించాడు.

2024లో లీగల్ నోటీసులతో అసలు ట్విస్ట్:

ఈ కథలో మరో ఆశ్చర్యకరమైన మలుపు ఉంది. 2018లోనే భార్య చనిపోయిందని రికార్డులు సృష్టించిన రవి, 2024లో తన లాయర్ ద్వారా గీతాంజలికి నోటీసులు పంపించాడు. భార్య కాపురానికి రావడం లేదంటూ ఆ నోటీసుల్లో పేర్కొన్నాడు. ఇటీవల తన స్థలం వేరొకరికి విక్రయించబడిందని తెలుసుకున్న గీతాంజలి ఆర్మూర్ పోలీసులను ఆశ్రయించడంతో ఈ గుట్టు రట్టయింది.

పోలీసుల విచారణలో మరిన్ని నిజాలు

నిందితుడిపై ఇప్పటికే మరో రెండు కేసులు ఉన్నాయని ఆర్మూర్ సీఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. అంతేకాకుండా, ఇదే నకిలీ డెత్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లను ఉపయోగించి సీఎం రిలీఫ్ ఫండ్ కోసం కూడా దరఖాస్తు చేయాలని రవి భావించినట్లు విచారణలో తేలింది. సమగ్ర విచారణ లేకుండా రెవెన్యూ అధికారులు ఇలాంటి ధ్రువపత్రాలు జారీ చేయడంపై స్థానికంగా చర్చ జరుగుతోంది. కమీషన్లకు ఆశపడి నకిలీ పత్రాల జారీకి సహకరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

జగిత్యాల జిల్లా కళాకారుల ఐక్యవేదిక కార్యవర్గం ఎన్నిక

-17 మందితో ఏర్పాటైన నూతన కార్యవర్గం

జగిత్యాల, నవంబర్ 21 (తెలంగాణ పత్రిక):

జగిత్యాల జిల్లా కళాకారుల ఐక్యవేదిక (జెకేఐవి) ఎన్నికలు 2026 నవంబర్ 15 ఆదివారం రోజున జగిత్యాల పట్టణంలోని శాంతి నికేతన్ పాఠశాలలో సార్వత్రిక సాధారణ ఎన్నికల శైలిలో ఓటు పద్ధతిలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో గెలిచిన నూతన అధ్యక్ష కార్యవర్గాన్ని వ్యవస్థాపక కమిటీ అధ్యక్ష కార్యవర్గ సభ్యులు మల్లిక్ తేజ అభి కమల్ ఇస్లావత్ ఓరుగంటి శేఖర్ పలిగిరి రాజేందర్ మామిడి మౌనిక తదితర కార్యవర్గ సభ్యులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిక్ తేజ మాట్లాడుతూ నవంబర్ 15న నిర్వహించిన కళాకారుల ఐక్య వేదిక ఎన్నికల్లో 17 మంది కమిటీ కార్యవర్గానికి గాను మొత్తం 33 మంది పోటీలో నిలవగా అధ్యక్షుడిగా బోగె అశోక్ ఉపాధ్యక్షులుగా మెండు హరీష్ బొడ్డు సౌజన్య ప్రధాన కార్యదర్శిగా బొడ్డుపల్లి లక్ష్మీనారాయణ కోశాధికారిగా గడ్డం రాజారామ్మోహన్ రెడ్డి సంయుక్త కార్యదర్శులుగా మారవేణి శివక్రాంతి మల్యాల సతీష్ కుమార్ ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా భుక్య గంగాధర్ పెరుమాండ్ల విజయలక్ష్మి కార్యవర్గ సభ్యులుగా కొమురవెల్లి చిరంజీవి చింత శ్రీనివాస్ సంగెపు బాపు గుండేటి సందీప్ ఎనుగంటి శ్రీచరణ్ గజ్జెల వందన ఇప్పల లక్ష్మి గుండ ఉమాశ్రీ ఎన్నికయ్యారని వీరిని గురువారం రోజున స్థానిక మార్కండేయ గుడి ఆవరణలో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందని తెలిపారు. జగిత్యాల జిల్లా కళాకారులను ఏకం చేస్తూ గత 3 నెలల క్రితం నిర్వహించుకున్న కళాకారులు బోనాల జాతర మరియు సక్సెస్ మీట్ విజయవంతం కావడంతో జిల్లా కళాకారుల ఐక్యవేదిక ఏర్పాటు చేసుకోవడం అలాగే సభ్యత్వ నమోదు ద్వారా అర్హులైన కళాకారులను సంఘంలో చేర్చుకోవడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 449 మంది కళాకారులు సభ్యత్వం పొంది ఓటు హక్కు కలిగి ఉన్నారని ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించి నూతన కమిటీని ఓటు పద్ధతిలో ఎన్నుకున్నారని 81శాతం పోలింగ్ నమోదు అయిందని పేర్కొన్నారు. ఈ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరగడానికి కృషి చేసిన ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన కళాకారులు జేడీ సుమన్ నడిగడ్డ రాజు సహాయకులు కోడిపల్లి అభి ఎన్నికల అధికారులకు సిబ్బందికి వ్యవస్థాపక కమిటీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నవంబర్ 27వ తేదీ ఉదయం 10 గంటలకు నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవ కారక్రమం స్థానిక బూసి లక్ష్మినారాయణ ఫంక్షన్ హాలు ధర్మపురి రోడ్డులో జరగనుందని కావున కవులు కళాకారులు ప్రజా ప్రతినిధులు పాత్రికేయ మిత్రులు ఇదే పిలుపుగా భావించి ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కళాకారులు కవి గాయకులు రాగుల పరశురాం గౌడ్ ఎములాడ మహిపాల్ నూతన కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



నిరుద్యోగులకు బ్యాక్‌లాగ్ పోస్టులు విడుదల చేయాలి

-జిల్లాలోని అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలి.

-నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలి

-రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ జనతా పార్టీ (టిజేపి)డిమాండ్

కరీంనగర్ జిల్లా నవంబర్ 21 (తెలంగాణ పత్రికా ప్రతినిధి)

కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే విడుదల చేసి, అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని తెలంగాణ జనతా పార్టీ (టిజేపి)రాష్ట్ర అధ్యక్షులు కుతాడి శివరాజ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కరీంనగర్‌లోని తెలంగాణ జనతా పార్టీ (టిజేపి)రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ఆధ్వర్యంలో నిరుద్యోగుల సమస్యలపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎంతోమంది నిరుద్యోగ యువత సంవత్సరాల తరబడి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, నోటిఫికేషన్లు, ఉద్యోగ భర్తీ ప్రక్రియలో జాప్యం కారణంగా యువత తీవ్ర నిరాశకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రభుత్వ శాఖల వారీగా ఖాళీగా ఉన్న పోస్టులను గుర్తించి, బ్యాక్‌లాగ్ పోస్టులతో పాటు అన్ని ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. అర్హత కలిగిన నిరుద్యోగులకు వయోపరిమితి విషయంలో తగిన న్యాయం చేయాలని, ఉద్యోగ నియామక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. నిరుద్యోగ యువతకు కేవలం హామీలు కాకుండా ఆచరణలో ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఉద్యోగాలు వచ్చే వరకు నిరుద్యోగ యువతను ఆదుకునేందుకు తగిన ఆర్థిక సహాయం అందించాలని సూచించారు. తెలంగాణ జనతా పార్టీ (టిజేపి)నిరుద్యోగ యువత పక్షాన నిలబడి వారి న్యాయమైన హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



ప్రభుత్వానికి తెలంగాణ జనతా పార్టీ(టిజేపి) ప్రధాన డిమాండ్లు:

1. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే విడుదల చేయాలి.
2. కరీంనగర్ జిల్లాతో పాటు అన్ని జిల్లాల్లో అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి.
3. శాఖల వారీగా ఉద్యోగ ఖాళీల వివరాలను బహిరంగంగా ప్రకటించాలి.
4. నిరుద్యోగులకు న్యాయం జరిగేలా పారదర్శకంగా నియామకాలు చేపట్టాలి.
5. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలవాలి.

ఈ సదస్సు కార్యక్రమంలో

తెలంగాణ జనతా పార్టీ (టిజెపి) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మొగురం మిరియా. కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కాశిపాక అజయ్. జిల్లా ఉపాధ్యక్షుడు బెజ్జంకి అంజయ్య. మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పెద్దల చంద్రకాంత్. వరంగల్ జిల్లా ఇన్చార్జి ముత్యం అశోక్ రెడ్డి. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కే నారాయణ రావు. పెద్దపల్లి జిల్లా ఇన్చార్జి రామ్ రమేష్. కామురయ్య ముదిరాజ్. తడి గొప్పల వినోద్ కుమార్. శ్రీనివాస్. ఉపేందర్. లక్ష్మణ్ రాజ్. ఎం మల్లేశం. తదితరులు పాల్గొన్నారు..

మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దు.. వ్యసనాల నుంచి బయటపడి ఆరోగ్యకరమైన జీవితాన్ని ప్రారంభించాలి: జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్, ఐపీఎస్

-జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని డీ-అడిక్షన్ (వ్యసన విముక్తి) కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ

-గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక కార్యాచరణ

తెలంగాణ దినపత్రిక ప్రతినిధి నవంబర్ 21-2026

జగిత్యాల జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ (వ్యసన విముక్తి) కేంద్రాన్ని జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్, ఐపీఎస్ గారు పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలు, చికిత్సా విధానం, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వ్యసనాల నుంచి బయటపడేందుకు తీసుకుంటున్న చర్యల గురించి సంబంధిత వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు, మద్యం, గంజాయి తదితర వ్యసనాలకు అలవాటుపడటం వల్ల వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబ జీవనం, సామాజిక సంబంధాలు తీవ్రంగా ప్రభావితమవుతాయని తెలిపారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చెడు అలవాట్లకు ఆకర్షితులై తమ విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు.వ్యసనాలకు బానిసలైన వారిని నేరస్తులుగా చూడకుండా, వారికి అవసరమైన వైద్య సహాయం, కౌన్సెలింగ్ అందించి సాధారణ జీవనంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. వ్యసన విముక్తి కేంద్రాల ద్వారా అందించే వైద్య చికిత్సలు, మానసిక కౌన్సెలింగ్ సేవలను వినియోగించుకొని వ్యసనాల నుంచి బయటపడాలని సూచించారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగిస్తున్నామని, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే సమయంలో యువతలో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తూ, విద్యాసంస్థలు, గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన,అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, యువతలో ఎలాంటి మార్పులు కనిపించినా నిర్లక్ష్యం చేయకుండా అవసరమైన కౌన్సెలింగ్, వైద్య సహాయం అందించాలని సూచించారు.వ్యసన విముక్తి అనేది ఒక్కరోజులో సాధ్యమయ్యే ప్రక్రియ కాదని, వైద్యుల సలహాలు, కుటుంబ సభ్యుల సహకారం, ఆత్మవిశ్వాసంతో పూర్తిస్థాయిలో వ్యసనాల నుంచి బయట పడవచ్చని తెలిపారు. వ్యసనాలకు బానిసలైన వారు సంకోచించకుండా డీ-అడిక్షన్ కేంద్రాన్ని సంప్రదించి చికిత్స పొందాలని, ఆరోగ్యకరమైన జీవితాన్ని తిరిగి ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి పురుషోత్తం రెడ్డి,జజూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్.ఐ లు కిరణ్ కుమార్, సుప్రియా సంబంధిత వైద్యాధికారులు పాల్గొన్నారు.





వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు

రెబ్బెన, నవంబర్ 21,(తెలంగాణ పత్రిక)

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం గంగాపూర్ లోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక మాసం సందర్భంగా శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు శనివారం దేవాలయంలో పూజలు నిర్వహించి ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు ఈ సందర్భంగా ఆసిఫాబాద్ జిల్లా రీజనల్ ట్రాన్స్పోర్టు సభ్యులు ఎల్ రమేష్ గౌడ జన హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్ గౌడ్ జర్నలిస్టు సంఘాల నాయకులు సాయి సుప్రజ్ ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు రామస్వామి నాయకులు పల్లె రాజేశ్వర్ రావు అజయ్ జైస్వాల్ భక్తులు పాల్గొన్నారు



రైతులకు ఇబ్బందులు లేకుండ ధ్యానం కొనుగోలు

- మంత్రి లక్ష్మణ్ కుమార్



జగిత్యాల, నవంబర్ 21(తెలంగాణ పత్రిక):

జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. రైతులకు మద్దతు ధర చెల్లించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మద్దతు ధర కల్పించాలని ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని మంత్రి తెలిపారు. రైతులకు కావాల్సిన గన్ని బ్యాగులను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు అనంతరం మిల్లర్ల నుండి వచ్చే సమస్యలను ధాన్యం కొనుగోలు సెంటర్ ఇన్ చార్జీ పరిష్కరించాలని మంత్రి సూచించారు. రైతులను ఎక్కడ ఇబ్బంది పెట్టవద్దని మంత్రి ఆదేశించారు. తేమ వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు ప్రారంభించాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆదేశించారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి:

బుగ్గారం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త హైమద్ ఇటీవల ఆనారోగ్యంతో మరణించగా వారి కుటుంబాన్ని మంత్రి లక్ష్మణ్ కుమార్ శనివారం పరామర్శించి ప్రాగాడ సానుభూతి వ్యక్తం చేశారు.

ఆంజనేయ స్వామి నిజరూప దర్శనం చేసుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

జగిత్యాల, నవంబర్ 21 (తెలంగాణ పత్రిక):



కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవసానంలో శనివారం స్వామి వారి నిజరూప దర్శనం సందర్భంగా వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి అంజనా రెడ్డి విప్‌కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారి ఆశీర్వచనం అందజేశారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. ప్రజా ప్రతినిధులు అధికారులు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ నిధులతో నిర్మించిన గదులను ప్రారంభించిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్



జగిత్యాల, నవంబర్ 21 (తెలంగాణ పత్రిక):



మెట్‌పల్లి విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పర చుకుని వాటిని సాధించే దిశగా పట్టుదలతో ముందుకు సాగాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మెట్‌పల్లి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు దామోదర్ రావు నిధులు రూ 40 లక్షలతో నిర్మించిన రెండు అదనపు తరగతి గదులను కలెక్టర్ నిధులు రూ.35 లక్షలతో నిర్మించిన మరో రెండు అదనపు తరగతి గదులను ఎమ్మెల్యే సంజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో విలువైనదని ఈ సమయంలో క్రమశిక్షణతో చదువుతూ తమలోని ప్రతిభను వెలికితీసుకోవాలని సూచించారు. చదువుతో పాటు మంచి నడవడిక క్రమశిక్షణ అలవర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు లేదా అవసరాలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుప్పాల లింబాద్రి డీఈవో రాము ఎంఈవో ప్రధానోపాధ్యాయులు కౌన్సిలర్లు ఉపాధ్యాయులు విద్యా ర్థులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA
TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా బిజినెస్

ముగ్గురికి రూ 4.20 లక్షల ఎల్ఓసీని అందించిన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



జగిత్యాల, నంబర్ 21 (తెలంగాణ పత్రిక):

మెట్‌పల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్న ముగ్గురికి ఎల్ఓసీ పత్రాలను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కల్వకుంట్ల అందజేశారు. ఈ సందర్భంగా మల్లాపూర్ మండలం రేగుంట గ్రామానికి చెందిన అడ్మాల నర్సారెడ్డికి రూ.1,10,000/-లు, కోరుట్ల పట్టణానికి చెందిన గిన్నెల పద్మకు రూ. 2,00,000/-లు కోరుట్ల మండలం ఐలాపూర్ గ్రామానికి చెందిన బద్దం లింగుకు రూ. 1,10,000/-ల విలువైన ఎల్ఓసీ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. మొత్తం ముగ్గురికి రూ.4,20,000/-లు అందించేలా ఎల్ఓసీలు మంజూరు కావడంతో లబ్ధిదారులు ఎమ్మెల్యేకు సంజయ్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆల్ ఇన్ వన్ పుస్తకాల పంపిణీ



తానూర్:21నవంబర్(తెలంగాణ పత్రిక)

తానూర్ మండలంలోని ఆయా పాఠశాలలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలను అందజేశారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలను ప్రజా ట్రస్ట్ చైర్మన్ బోస్లే మోహన్ రావు పాటిల్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను అందిస్తూ ఉన్నతమైన లక్ష్యాలను సాధించేందుకు వెన్నుంటానని పేర్కొన్నారు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అండగా నిలుస్తూ సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు నైతిక విలువలు, మంచి నడవడిక అలవర్చుకుని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సాయిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సర్పంచ్ సుగంధ మాధవ్ రావ్ పాటిల్, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన వితంతు పింఛన్ ప్రాసీడింగ్ లు అందజేత

-దాంపూర్ సర్పంచ్ దాసరి మణిదీపక్



భీమారం నవంబర్ 21, తెలంగాణ పత్రిక:

భీమారం మండలం దాంపూర్ గ్రామపంచాయతీ లో అర్హులైన వితంతువులకు పింఛన్ ప్రొసీజర్లు అందజేసిన సర్పంచ్ దాసరి మణిదీపక్. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... ధర్మారం గ్రామ పంచాయతీ పరిధిలో ఎన్నికల సమయంలో గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకునే క్రమంలో పలువురు అర్హులైన వితంతువులు తమకు పింఛన్లు రావడం లేదని తెలిపారని తను గెలిస్తే అందరికి న్యాయం చేస్తాని ఆరోజు మాట ఇచ్చానని నేడు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి నూతన వితంతు పింఛన్లు మంజూరయ్యేలా ప్రత్యేక చొరవ తో నూతన వితంతు పింఛన్ల ప్రొసీడింగ్స్‌ను అందజేశామని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను మాటలకే పరిమితం చేయకుండ వాటిని ఆచరణలో పెట్టి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే నిజమైన ప్రజాసేవ అని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రవణ్ కుమార్, వార్డు సభ్యులు, సుకునా మరియు పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు రిషిత ఎంపిక

ఇల్లంతకుంట నవంబర్ 21 తెలంగాణ పత్రిక

గాలి పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పల్లె రిషిత అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన ట్లుప్రధానోపాధ్యాయురాలు మేకల పావని తెలిపారు.ఈ నెల 20న సుల్తానాబాద్ లో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరచి ఎంపికైందని ఫిజికల్ డైరెక్టర్ సాన బాబు తెలిపారు. ఈ నెల 22 నుంచి 24 వరకు మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటుందన్నారు. రిషితనుప్రధానోపాధ్యాయురాలు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ బట్టు పద్మ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

గట్టుఇప్పల పల్లి గ్రామాన్ని పిఎసిఎస్ కేంద్రంగా ఏర్పాటు చేయాలి బీ ఆర్ ఎస్ నాయకుల డిమాండ్

కల్వకుర్తి నవంబర్ 21 తెలంగాణ పత్రిక



కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండలం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన పిఎసిఎస్ నూతన సంఘాలలో గట్టుఇప్పల పల్లి గ్రామాన్ని పిఎసిఎస్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని బీ ఆర్ ఎస్ నాయకుల డిమాండ్ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన 240 నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల లిస్ట్ లో మా గట్టు ఇప్పలపల్లి గ్రామం లేకపోవడం చాలా బాధాకరం తలకొండపల్లి మండలములో తలకొండపల్లి పల్లి తర్వాత అత్యధిక జనాభా మరియు విస్తీర్ణం కలిగిన గట్టు ఇప్పలపల్లి గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధిని వెనుకకు నెట్టడడం ఎంతవరకు సమంజసం గతంలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే గట్టు ఇప్పలపల్లి గ్రామాన్ని మండలం చేస్తాం అని చెప్పి దాని గురుంచి పట్టించుకోవడం లేదు ఇప్పుడు పి ఎ సి ఎస్ కేంద్రం కూడా ఏర్పాటు చేయకపోవడం చాలా బాధాకరం మరి ఈ గ్రామములో ఉన్న కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే దగ్గరకి వెళ్లి గట్టు ఇప్పలపల్లి గ్రామములో పి ఎ సి ఎస్ కేంద్రం ఏర్పాటు చేసేలాగా హామీ తీసుకు రావాలని కోరుతా ఉన్నాం లేని యడల అన్ని పార్టీల నాయకులను మరియు గ్రామ ప్రజలని కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని అన్నారు ఈ కార్యక్రమములో తలకొండపల్లి మండల బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ జయమ్మ వెంకటయ్య, గ్రామ అధ్యక్షుడు ఏదుల రాజు, ఉపాధ్యక్షుడు కానుగుల జంగయ్య, మండల కృష్ణయ్య, శరత్ చంద్ర శర్మ, విజేందర్ యాదవ్, సాధిక్, బొల్లి కృష్ణ, కొండల్, ఇట్యాల రవీందర్, శ్రీశైలం, పురుషోత్తం, రత్నయ్య, ఆంజనేయులు, ప్రవీణ్, మల్లేష్, కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

చేయూత భద్రత పింఛన్లకు ధరఖాస్తు చేసుకున్న అర్హులైన అందరికీ ఇవ్వాలి

-మంత్రి సీతక్కకు మాజీ కౌన్సిలర్ అనుమండ్ల జయశ్రీ విజ్ఞప్తి

జగిత్యాల, నవంబర్ 21 (తెలంగాణ పత్రిక):

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని గత 6 సంవత్సరాల నుండి పింఛన్ కొరకు వేచిచూస్తున్న పింఛన్ దారులకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించగా జగిత్యాల జిల్లాలో మొత్తం 18,955 పింఛన్ కొరకు దరఖాస్తు చేసుకోగా అందులో కేవలం 11,516 మంది లబ్ధిదారులకు మాత్రమే పింఛన్ మంజూరి పత్రాలు ఇవ్వడం జరిగిందని 7,439 మందికి పింఛన్ మంజూరి ఇవ్వకపోవడం బాధాకరమని మాజీ కౌన్సిలర్ అనుమండ్ల జయశ్రీ ఆవేదన వ్యక్తం చేశారు. ఒంటరి మహిళలు వితంతువులు దివ్యాంగులు పైలేరియా బాదితులు గీత కార్మికులు చేనేత కార్మికులు పింఛన్ కొరకు దరఖాస్తు చేసుకున్నవారు. కాని వీరిలో 7,439 మంజూరి కాక పోవడంతో ముఖ్యంగా చేనేత కార్మికులే దాదాపు 2300 మంది ఉండటంతో రెక్కాడితే డొక్కాడని పరిస్థితులలో ఉన్న చేనేత కార్మికులకు మంజూరు ఇవ్వక పోవడంతో వారి పరిస్థితి అగమ్య గోచరంగా ఉందని ఇప్పటికైనా దరఖాస్తు చేసుకున్న చేనేత కార్మికుల అందరికి పింఛన్ మంజూరు చేసి వాళ్ళ కుటుంబాలను పంచాయతీ రాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి దాసరి అనసూయ (సీతక్క) ఆదుకోవాలని వారి అందరి పక్షాన మనవి చేస్తున్నానని మాజీ కౌన్సిలర్ జయశ్రీ మనవి చేస్తున్నారు. దివ్యాంగులకు సదరం సర్టిఫికేట్లు కాలం చెల్లడంతో తిరిగి రెన్యువల్ కొరకు దరఖాస్తు చేసుకోగా వారికి కొత్త సర్టిఫికెట్ లు మంజూరు చేయడం ఆలస్యం కావడంతో వాళ్ళ అందరికి కూడ మంజూరి లభించలేదని వారికి సదరం సర్టిఫికేట్లు ఇచ్చి వారందరికి కూడ పింఛన్ మంజూరు ఇవ్వాలని వారందరి తరపున విజ్ఞప్తి చేస్తున్నారు. వితంతువులు ఒంటరి మహిళలు గీత కార్మికులు కూడ ప్రతి ఒక్కరు కూడ అర్హులైనప్పటికి పింఛన్ మంజూరు కాకపోవడంతో కొన్ని సంవత్సరాల నుండి ఎదురుచూస్తున్న



వారి కలలు నేరవేర్చాలని వారి కుటుంబాలకు ఆసరా కల్పించాలని జయశ్రీ కోరుతున్నారు.

మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దు

-జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

-వ్యసనాల నుంచి బయటపడి ఆరోగ్యకరమైన జీవితాన్ని ప్రారంభించండి

-జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని డీ-అడిక్షన్ (వ్యసన విముక్తి) కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ

-గంజాయి మత్తు పదార్థాల నిర్మూలనకు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక కార్యాచరణ

జగిత్యాల, నవంబర్ 21 (తెలంగాణ పత్రిక):



జగిత్యాల జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ (వ్యసన విముక్తి) కేంద్రాన్ని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలు చికిత్సా విధానం రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు వ్యసనాల నుంచి బయటపడేందుకు తీసుకుంటున్న చర్యల గురించి సంబంధిత వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మత్తు పదార్థాలు మద్యం గంజాయి తదితర వ్యసనాలకు అలవాటుపడటం వల్ల వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబ జీవనం సామాజిక సంబంధాలు తీవ్రంగా ప్రభావితమవుతాయని తెలిపారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చెడు అలవాట్లకు ఆకర్షితులై తమ విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. వ్యసనాలకు బానిసలైన వారిని నేరస్తులుగా చూడకుండ వారికి అవసరమైన వైద్య సహాయం కౌన్సెలింగ్ అందించి సాధారణ జీవనంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. వ్యసన విముక్తి కేంద్రాల ద్వారా అందించే వైద్య చికిత్సలు మానసిక కౌన్సెలింగ్ సేవలను వినియోగించుకొని వ్యసనాల నుంచి బయటపడాలని సూచించారు.జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం విక్రయం అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగిస్తున్నామని గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే సమయంలో యువతలో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తూ విద్యా సంస్థలు గ్రామాలు పట్టణాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని యువతలో ఎలాంటి మార్పులు కనిపించినా నిర్లక్ష్యం చేయకుండా అవసరమైన కౌన్సెలింగ్ వైద్య సహాయం అందించాలని సూచించారు. వ్యసనాలకు బానిసలైన వారు సంకోచించకుండా డీ-అడిక్షన్ కేంద్రాన్ని సంప్రదించి చికిత్స పొందాలని ఆరోగ్యకరమైన జీవితాన్ని తిరిగి ప్రారంభించాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి పురుషోత్తం రెడ్డి సీసీస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ఎస్ఐలు కిరణ్ కుమార్ సుప్రియా సంబంధిత వైద్యాధికారులు పాల్గొన్నారు.

15 ఏళ్లుగా భక్త మార్కండేయ యువజన సమితి సేవలు అభినందనీయం

-జగిత్యాల జిల్లా మహిళ అధ్యక్షురాలు అడువాల జ్యోతిలక్ష్మిణ్

-నిరుపేద యువతి వివాహానికి రూ.15 వేల ఆర్థిక సాయం అందజేత

జగిత్యాల, నవంబర్ 21 (తెలంగాణ పత్రిక):



గత 15 ఏళ్లుగా నిరుపేదలకు అండగా నిలుస్తూ శ్రీ భక్త మార్కండేయ యువజన స్వచ్ఛంద సేవా సమితి నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని జగిత్యాల జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. స్వామి వివేకానందుని స్ఫూర్తితో 'ఓదార్చే మాటల కన్నా సహాయం చేసే చేతులే మిన్న' అనే నినాదంతో శనివారం సమితి ఆధ్వర్యంలో రాయికల్ గ్రామానికి చెందిన గోసికొండ జమున-కిషన్ దంపతుల కుమార్తె వివాహానికి రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ నెల 25 న జరగనున్న వివాహం సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జ్యోతిలక్ష్మణ్ దంపతుల చేతుల మీదుగా ఆర్థిక సహాయాన్ని అందించారు. అలాగే గీత సిల్క్ హౌస్ అధినేత కస్తూరి జగదీశ్వర్ కుమారుడు శశిధర్-లహరిక దంపతుల సహకారంతో వధువుకు కంచి పట్టు చీరను బహూకరించారు. ఈ సందర్భంగా జ్యోతిలక్ష్మణ్ మాట్లాడుతూ సమితి గత 15 ఏళ్లుగా నిరుపేద కుటుంబాలకు వివాహాలు విద్య ఇతర అవసరాలతో పాటు ఆపద సమయంలోనూ ఆర్థిక సహాయం అందించడం గొప్ప విషయమన్నారు. సమాజ సేవలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలకు తన వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందని తెలిపారు. సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న సమితి సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహకులు ఆకుబత్తిని శ్రీనివాస్ కొక్కుల సుదర్శన్ జోగ మల్లేశం బోగ రాజేశం చెట్‌పెల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు

-.పేద కుటుంబాలకు అందగా ప్రజా ప్రభుత్వం

-ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి :

(తెలంగాణ పత్రిక) నవంబర్, 21



జయశంకర్ భూపాలపల్లి నియోజకవర్గంలోని గోరు కొత్తపల్లి మండలంలో పలు గ్రామాల్లో నిర్వహించిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా అవగాహన కార్యక్రమాల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని గ్రామ ప్రజలకు పథకం ఉద్దేశం, ప్రయోజనాలు, దరఖాస్తు చేసుకునే విధానం, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై వివరించారు. గోరి కొత్తపల్లి మండలంలోని చెన్నాపూర్, దామరించ పల్లె గ్రామం, చిన్నకోడపాక గ్రామం, బాలయ్యపల్లి గ్రామాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు రూ. 5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించడం ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న వ్యక్తికి అనుకోని ప్రమాదం లేదా మరణం సంభవించినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఈ పథకం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, మహిళల ఆర్థిక భద్రత, రైతుల సంక్షేమం, విద్య, వైద్యం, ఉపాధి, సామాజిక భద్రతకు పెద్దపీట వేస్తోందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాలనే ఉద్దేశంతో గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించిన వివరాలను తెలుసుకొని, అవసరమైన పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో అధికారులు, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భూపాలపల్లి మార్కెట్ చైర్మన్, గోరికోతపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, యువ నాయకులు, గ్రామస్థులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

సిద్ధిపేట మెడికల్ కళాశాలకు అనంతుల మదన్ మోహన్ పేరు

-ముఖ్యమంత్రి చారిత్రాత్మక నిర్ణయం పట్ల హర్షం

-తెలంగాణ తొలి దశ ఉద్యమ యోధుడికి సముచిత గౌరవం

-తెలంగాణ మలిదశ ఉద్యమ రాజకీయ జేఏసీ ఛైర్మన్, సీనియర్ నాయకుడు సంగు పురేందర్

సంగుపూరు, నవంబరు 21(తెలంగాణ పత్రిక):



తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన తొలి దశ ఉద్యమంలో మాజీ మంత్రి, తెలంగాణ ప్రజా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు అనంతుల మదన్ మోహన్ కీలక పాత్ర పోషించారని తెలంగాణ మలిదశ ఉద్యమ రాజకీయ జేఏసీ సంగుపూరు మండల ఛైర్మన్, సిద్ధన్నపేట సర్పంచి సంగు పురేందర్ పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షను తెలంగాణ ప్రజా సమితి ద్వారా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లిన దివంగత సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అనంతుల మదన్ మోహన్ పేరు తెలంగాణ చరిత్రలో మరువలేనిదని అన్నారు. శనివారం సంగుపూరులో విలేకరులతో మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమ నినాదంతో 1970 సంవత్సరంలో సిద్ధిపేట ఎమ్మెల్యేగా గెలిచి ప్రజల్లోని ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను బలంగా చాటారని చెప్పారు. సిద్ధిపేట అభివృద్ధిలో మదన్ మోహన్ చెరగని ముద్ర వేశారన్నారు. తెలంగాణ ఉద్యమానికి, రాష్ట్రానికి మదన్ మోహన్ చేసిన సేవలకు రాష్ట్ర ప్రభుత్వం సముచిత గుర్తింపు ఇవ్వడం హర్షణీయమన్నారు. సిద్ధిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనంతుల మదన్ మోహన్ పేరు పెట్టనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం తెలంగాణ ఉద్యమ చరిత్రకు, ఆ ఉద్యమంలో విశేష సేవలందించిన నాయకుడికి దక్కిన గౌరవమని ఆయన అభివర్ణించారు. ఈ నెల 18వ తేదీన (గురువారం) సిద్ధిపేటలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనపై సంగు పురేందర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నిర్ణయాన్ని స్వాగతించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దశాబ్దాల క్రితమే తన రాజకీయ ప్రస్థానాన్ని ఉద్యమ బాటలో సాగించిన మదన్ మోహన్ సేవలను నేటి తరానికి గుర్తు చేసేలా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో ప్రాధాన్యత కలిగిందని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష ప్రజల్లో బలంగా నాటుకోవడానికి తొలి దశ ఉద్యమ నాయకులు చేసిన కృషి మరువలేనిదని అన్నారు. అప్పటి రాజకీయ పరిస్థితుల్లో ప్రత్యేక తెలంగాణ వాదాన్ని ధైర్యంగా వినిపిస్తూ, ప్రజల్లో తెలంగాణ రాష్ట్ర సాధన పట్ల చైతన్యం కల్పించిన నాయకుల్లో అనంతుల మదన్ మోహన్ ఒకరని గుర్తుచేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సాగిన ఆయన పోరాటం, రాజకీయ సేవలు చిరస్మరణీయం అని కొనియాడారు. ఒక ప్రాంత అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కృషి చేసిన నాయకుల సేవలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయడంలో ఇలాంటి నిర్ణయాలు కీలక పాత్ర పోషిస్తాయని అభిప్రాయపడ్డారు. వైద్య విద్యను అభ్యసించే విద్యార్థులు, వైద్య కళాశాలకు వచ్చే ప్రజలు అనంతుల మదన్ మోహన్ పేరును నిరంతరం గుర్తుంచుకునే అవకాశం ఈ నిర్ణయం ద్వారా కలుగుతుందని పేర్కొన్నారు. విద్యాసంస్థలకు ఉద్యమ నాయకుల పేర్లు పెట్టడం అనేది కేవలం పేరుమార్పు మాత్రమే కాదని, వారి త్యాగాలు, పోరాటాలు, ప్రజాసేవను భావితరాలకు అందించే గౌరవప్రదమైన చర్య అని వివరించారు. సిద్ధిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనంతుల మదన్ మోహన్ పేరు పెట్టాలనే నిర్ణయం ఆయనకు లభించిన సముచిత గుర్తింపుతో పాటు తెలంగాణ తొలి దశ ఉద్యమ చరిత్రకు దక్కిన గౌరవమని సంగు పురేందర్ పేర్కొన్నారు. తెలంగాణ కోసం నిస్వార్థంగా పనిచేసిన నాయకుల సేవలను గుర్తించి గౌరవిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మరోసారి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల తెలంగాణ ఉద్యమ అభిమానులు, మదన్ మోహన్ అనుచరులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

మండలంలో విత్తన దుకాణాల తనిఖీ





గంభీరావుపేట తెలంగాణ పత్రిక నవంబర్ 21

రాజన్న సిరిసిల్ల జిల్లా, గంభీరావుపేట మండలంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా విత్తన విక్రయాల్లో ఎలాంటి అక్రమాలు జరగకుండా ఉండేందుకు శనివారం రోజున విత్తన దుకాణాలను తనిఖీ నిర్వహించారు ఈ తనిఖీలో ఎస్ఐ బాలరాజు మండల వ్యవసాయ అధికారి సలావుద్దీన్ పాల్గొని విత్తన దుకాణాల్లో విత్తన నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, విక్రయ రికార్డులు, విత్తన లైసెన్సులు, విత్తనాల నాణ్యత ధరల వివరాలను పరిశీలించారు ఈసందర్భంగా దుకాణదారులకు విత్తన నిల్వలు, విక్రయాల వివరాలను రిజిస్టర్లలో సక్రమంగా నమోదు చేయాలని, రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని, విత్తన ప్యాకెట్లపై ఉన్న ధర కంటే అధిక ధరలకు విక్రయించరాదని, నిబంధనలకు విరుద్ధంగా విత్తన విక్రయాలు చేపట్టరాదని సూచించారు రైతులకు నకిలీ విత్తనాలు లేదా నాణ్యత లేని విత్తనాలు విక్రయించినట్లయితే సంబంధిత దుకాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని ఏవైనా సమస్యలు ఎదురైతే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు రైతుల ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా మండలంలో విత్తన దుకాణాలపై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు

విద్యార్థులకు మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్ష

తెలంగాణ పత్రిక చారకొండ, నవంబర్ 21:



విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి, సైన్స్ పట్ల ఆసక్తిని ప్రోత్సహించాలనే లక్ష్యంతో శనివారం చారకొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్ష నిర్వహించారు.పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు అంజయ్య, సైన్స్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షకు జెడ్పీ ఉన్నత పాఠశాల, కేజీబీవీ, విశ్వశాంతి హైస్కూల్‌కు చెందిన 8, 9, 10వ తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్ఎం అంజయ్య మాట్లాడుతూ ఇలాంటి పోటీ పరీక్షలు విద్యార్థుల్లో సృజనాత్మకత, తార్కిక ఆలోచనా శక్తిని పెంపొందించడంతో పాటు మూఢనమ్మకాలను తొలగించి శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసేందుకు దోహదపడతాయని అన్నారు.పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రశంసాపత్రాలు అందజేశారు. మండల స్థాయి పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ నెల 28న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంభిక్షమయ్య, యాదగిరి, వెంకట్‌రెడ్డి, బాలాజీ, డాక్య నాయక్, బాలమణి, లలిత తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ఆర్థిక అభివృద్ధికి త్యాగరాజన్ కృషి అమోఘం: ఎంఈఓ శేఖర్

-'మిషన్ టెన్త్ క్లాస్ - చదువుకో తెలంగాణ' మెరిట్ స్కాలర్‌షిప్ చెక్కుల పంపిణీ

-ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ. 10 వేల చొప్పున ఆర్థిక సాయం







పెద్ద శంకరంపేట: పేద కుటుంబాల ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా 50 సంవత్సరాల క్రితం ఆర్. త్యాగరాజన్ స్థాపించిన శ్రీరామ్ గ్రూప్, గ్రామీణ పేదల అభ్యున్నతికి ఎనలేని సేవలు అందిస్తోందని పెద్ద శంకరంపేట మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) శేఖర్ కొనియాడారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులను ప్రోత్సహించేందుకు చేపట్టిన 'మిషన్ టెన్త్ క్లాస్ - చదువుకో తెలంగాణ (2025-26)' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెరిట్ స్కాలర్‌షిప్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గత విద్యా సంవత్సరం పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు పులబోయిన శశికాంత్, కుమ్మరి అభిలాష తల్లిదండ్రులకు ఎంఈఓ శేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శిరీష చేతుల మీదుగా తలా రూ. 10,000 చొప్పున చెక్కులను అందజేశారు.

పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు:

ఈ సందర్భంగా ఎంఈఓ శేఖర్ మాట్లాడుతూ.. శ్రీరామ్ గ్రూప్ కేవలం వ్యాపార రంగానికే పరిమితం కాకుండా, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుండటం అభినందనీయమన్నారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు సంస్థ ఖర్చు చేసే ప్రతి రూపాయి పేద విద్యార్థుల భవిష్యత్తులో వెలుగులు నింపుతుందని పేర్కొన్నారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.

కార్యక్రమంలో పాల్గొన్నవారు:

ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శిరీష, ఉపాధ్యాయులు దయానంద్, సుధీర్, సత్యకుమార్, లక్ష్మణ్, హన్మండ్లు, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ నారాయణఖేడ్ బ్రాంచ్ మేనేజర్ పూర్ణచందర్, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు సూర్యప్రకాష్, బాసాడ రాజు, సేల్స్ ఆఫీసర్లు కల్లేటి రమేష్ గుప్తా, చీటీ భూమేష్, రవీందర్, బైండ్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు ఆర్థిక భరోసానే లక్ష్యం

-ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం పత్రాల పంపిణీ..



పెదశంకరంపేట:

పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రధాన లక్ష్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేట మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ తో కలిసి ఆయన లబ్ధిదారులకు పథకానికి సంబంధించిన పత్రాలను అందజేశారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తికి రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించడం ద్వారా ఆపద సమయంలో కుటుంబానికి అండగా నిలవాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.అనంతరం పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని, నూతన గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు..

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA
TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా బిజినెస్

జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు



కరీంనగర్ జిల్లా నవంబర్ 21 (తెలంగాణ పత్రిక ప్రతినిధి)

బాలల దినోత్సవం పురస్కరించుకుని మహిళాభివృద్ధి మరియు సమగ్ర శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ప్రభుత్వ పురాతన ఉన్నత పాఠశాల కరీంనగర్ విద్యార్థులు కుంచం అక్షయ్ ప్రథమ, వ్యాసరచన విభాగంలో సీవల్లి చరణ్ ద్వితీయ బహుమతులను జడ్పి చైర్ పర్సన్ శ్రీ రామోజు ధనలక్ష్మి, సంక్షేమ శాఖాధికారి సరస్వతి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రామారావు , పర్వీన్ చేతులమీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జక్కు కృష్ణమూర్తి గౌడ్, మాలోతు ప్రవీణ్, పబ్బతి రఘు, గోషికొండ శివాజీ, కాశపాక రాజు, వంగ ప్రకాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వధించిన మాజీ ఎమ్మెల్యే గండ్రవెంకట రమణ రెడ్డి



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి: తెలంగాణ పత్రిక) నవంబర్,21

జయ శంకర్ భూపాల్ పల్లి జిల్లా గణపురం మండలం, నగరంపల్లి గ్రామ వాస్తవ్యులు గొర్రె యల్లయ్య యాదవ్ – లక్ష్మిల కుమార్తె వివాహ వేడుకల్లో మరియు గణపురం వాస్తవ్యులు పోతర్ల రజిత – మల్లికార్జున యాదవ్ గార్ల కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొన్ని నూతన వధూ వరులను ఆశీర్వధించిన భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి .. అదే విదంగా కొత్తపల్లి గోరి మండలం, జగ్గయ్యపేట గ్రామ వాస్తవ్యులు కొడకండ్ల శ్రీదేవి – కృష్ణమూర్తి గార్ల కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొన్ని వారిని ఆశీర్వదించారు. అనంతరం రేగొండ మండలం, మడతపల్లి గ్రామ వాస్తవ్యులు వరంగంటి నీరజ – ఓంకార్ గౌడ్ గార్ల కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొన్ని నూతన వధూవరులను ఆశీర్వధించారు. వారి వెంట ఆయా మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులకు పౌష్టికాహారం కరువు

-మాడుగులపల్లి మండలంలోని అంగన్వాడి కేంద్రాలలో చిన్నారుల ఆరోగ్యం పై అంత నిర్లక్ష్యమా?
-పర్యవేక్షణ కొరబడిందా -పట్టించుకోని అధికారులు



మాడుగులపల్లి//నల్గొండ//నవంబర్ 21:(తెలంగాణ పత్రిక):-

చిన్నారులకు పౌష్టికాహారం అందించి వారి ఆరోగ్యాన్ని కాపాడాల్సిన అంగన్వాడీ కేంద్రాల్లోని పోషకహారం కొరత ఏర్పడుతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మాడుగులపల్లి మండలంలోని పలు అంగన్వాడి కేంద్రాల లో చిన్నారులకు ప్రభుత్వం నిర్దేశించిన పోష్టికాహారం సక్రమంగా అందడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. చిన్నారుల్లో పోషకాహారం లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల ద్వారా పాలు, గుడ్లు, బాలామృతం, తదితర పోషకాహార పదార్థాలను అందిస్తుంది. అయితే కొన్ని కేంద్రాలలో సరఫరా సక్రమంగా అందుబాటులో లేకపోవడంతో ఉన్న ఆహార పదార్థాలను సకాలంలో పంపిణీ చేయకపోవడం వంటి సమస్యలు ఉన్నాయని ఫిర్యాదులు వస్తున్నాయి. పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాలే ఆధారంగా ఉంటున్నాయి. అలాంటి కేంద్రాలలో పౌష్టికాహారం అందకపోతే చిన్నారులు ఎదుగుదలపై ప్రభావం పడే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు మండలంలోని అన్ని అంగన్వాడీలో కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి ఆహార పదార్థాలు నిలువలు సరిపడా పంపిణీ వివరాలు పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. చిన్నారులకు అందాల్సిన పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పిల్లల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

డ్రగ్స్‌కు దూరంగా.. సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా!

-విద్యార్థుల భవిష్యత్తుకు వ్యసనాలు, సైబర్ మోసాలు పెను ముప్పు
-మత్తుకు బానిసైతే భవిష్యత్తు అంధకారమే!
-డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి.. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
-విద్యార్థులకు న్యాయవాదులు ఎస్. రాజేశ్, బి. రమేశ్ సూచన

నంగునూరు, నవంబరు 21 (తెలంగాణ పత్రిక):

చిన్ననాటి వ్యసనాలు జీవితాన్ని ఛిద్రం చేస్తే.. సైబర్ మోసాలు భవిష్యత్తును ప్రమాదంలోకి నెడతాయి. మత్తు పదార్థాల మాయలో పడకుండా, అంతర్జాల నేరాల వలలో చిక్కుకోకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని న్యాయవాదులు ఎస్. రాజేశ్, బి. రమేశ్ సూచించారు. చట్టాలపై అవగాహన పెంచుకుని, క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తును మత్తు పదార్థాలు ఛిద్రం చేస్తాయని, చిన్న వయసులోనే చెడు వ్యసనాలకు బానిసైతే జీవితమే అంధకారంలో పడుతుందని హెచ్చరించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, సిద్ధిపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జి. సుదర్శన్ ఆదేశాల మేరకు బుధవారం నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామిగౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, బాలల హక్కులు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం యువత జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తోందన్నారు. సరదాగా ప్రారంభమయ్యే అలవాటు క్రమంగా వ్యసనంగా మారి విద్య, ఆరోగ్యం, కుటుంబ జీవనాన్ని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. మత్తు పదార్థాల విక్రయం, వినియోగం, అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. ఇలాంటి వ్యవహారాలు తెలిసినప్పుడు సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. బాలల హక్కులపై ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలని, బాలలపై జరిగే వేధింపులు, అన్యాయాలను మౌనంగా భరించకూడదని తెలిపారు. సమస్యలు ఎదురైతే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అదేవిధంగా పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులు పంపే సందేశాలు, అనుమానాస్పద లింకులను తెరవకూడదని



హెచ్చరించారు. వ్యక్తిగత వివరాలు, రహస్య సంకేతాలు, బ్యాంకు ఖాతాల సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని, సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. చట్టాలపై అవగాహన హక్కులకు రక్షణ కల్పిస్తుందని, క్రమశిక్షణతో కూడిన జీవనశైలి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుపై ఏకాగ్రత పెట్టి, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామిగౌడ్, ఉపాధ్యాయులు దుబ్బుడు రవీందర్‌రెడ్డి, కొత్తపల్లి రవి, కోర్టు సిబ్బంది ఆకుల శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతలో క్రీడా ప్రతిభను వెలికితీసి, క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

-ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి: తెలంగాణ పత్రిక :నవంబర్, 21

యువజన సర్వీసులు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణ రావు.ఆయన ఖేలో ఇండియా పోస్టర్, లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని, వారిలోని నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహించేందుకు ఖేలో ఇండియా క్రీడా పోటీలు చక్కని వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. పల్లె స్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి క్రీడాకారులు ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణను పెంపొందిస్తాయని తెలిపారు. యువత చదువుతో పాటు క్రీడలపైనా ప్రత్యేక దృష్టి సారించి ప్రతిభను చాటుకోవాలని, తద్వారా జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. క్రీడాకారులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, క్రీడా రంగ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా



గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రాజాబాబు, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, యువజన సర్వీసులు, క్రీడల శాఖ అధికారి చిర్రా రఘు, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల ఐక్యతే అభివృద్ధికి పునాది!

-నంగునూరులో ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

నంగునూరు, నవంబరు 21 (తెలంగాణ పత్రిక):

మత్స్యకారుల హక్కులు, ఆత్మగౌరవం, సంక్షేమ సాధన లక్ష్యంగా సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించి ఐక్యతను చాటిన నాయకులు, మత్స్యకారుల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. మత్స్యకారుల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని నంగునూరు, పాలమాకుల ముదిరాజ్ సంఘం నాయకులు కోరారు. చేపల వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ద్వారా మరింత చేయూత అందించాలని, ముఖ్యంగా 50 ఏళ్లు పైబడిన ప్రతి మత్స్యకారుడికి పింఛన్ సౌకర్యం కల్పించి వారి జీవితాలకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నంగునూరు మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు జెండా ఆవిష్కరించి మత్స్యకారుల ఐక్యత,



సంక్షేమం, హక్కులు, అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ మత్స్యకారులు సమాజానికి అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. తరతరాలుగా చేపల వృత్తినే జీవనాధారంగా చేసుకుని ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న మత్స్యకార కుటుంబాల అభ్యున్నతిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడంతో పాటు చెరువులు, కుంటల్లో చేపల పెంపకానికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని కోరారు. వయస్సు పైబడిన మత్స్యకారులు శారీరక శ్రమ చేయలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాంటి వారికి నెలవారీ పింఛన్ అందించడం ద్వారా వృద్ధాప్యంలో ఆర్థిక భద్రత కల్పించ



వచ్చని అన్నారు. ముదిరాజ్‌ల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మత్స్యకారుల ఐక్యతను చాటుతూ నిర్వహించిన ఈ వేడుకల్లో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గౌరబోయిన సంపత్ కుమార్, ఉపాధ్యక్షుడు కొండిల్ల రాజు, కార్యవర్గ సభ్యులు సోప్పరి ఎల్లాదాసు, జంగిటి శ్రీనివాస్, వస్తాదుల యాదయ్య, జంగిటి ఆంజనేయులు, భీమరి కనకరాజు, చింతల రాజు, అప్పిన్ ఆంజనేయులు, చింతల నవీన్ కుమార్, గుండబోయిన సాయిరామ్, జంగిటి శేఖర్, పోలబోయిన మహేష్, గౌరబోయిన రాజు, తుపాకుల సాయి, గుండబోయిన భూపతి, సోప్పరి సంజయ్, గౌరబోయిన అజయ్, నల్లక్కట్టే హరికృష్ణ, కన్నారం ప్రశాంత్, గౌరబోయిన బాబు, ముదిరాజ్ సంఘం కుల పెద్దలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు గ్రామంలో బీడీ, సిగరెట్ అమ్మకాలపై నిషేధం - సర్పంచ్ కట్ట జయమ్మ యాదయ్య

కల్వకుర్తి నవంబర్ 21 తెలంగాణ పత్రిక

కల్వకుర్తి నియోజకవర్గం మాడుగుల మండలం నల్లచెరువు గ్రామ సర్పంచ్ కట్ట జయమ్మ యాదయ్య సంచలన నిర్ణయం తీసుకున్నారు. ధూమపానం అలవాటు వల్ల యువత చెడిపోతున్నారని విద్యకు దూరమవుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అలవాటు కారణంగా తన సొంత భర్తపైనే ఆగ్రహం వ్యక్తం చేసిన సర్పంచ్, ఇక నుండి గ్రామంలో బీడీ, సిగరెట్ అమ్మకూడదని నిర్ణయించారు. ఈ నిషేధాన్ని ఉల్లంఘించి అమ్మిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. గ్రామాన్ని ధూమపాన రహిత గ్రామంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని తెలిపారు. నల్ల చెరువు సర్పంచ్ కట్ట జయమ్మ యాదయ్య ఆమె మాట్లాడుతూ ఎవరైనా గ్రామంలో బీడీ సిగరెట్ షాపులలో అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వేముల మహేందర్ గౌడ్ ఎన్నిక

-మలిదశ ఉద్యమపు నిప్పు కణికకు దక్కిన గౌరవం..

-కొండా దంపతుల దీవెనలు తీసుకున్న వేముల మహేందర్ గౌడ్..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి

:తెలంగాణ పత్రిక :నవంబర్, 21

ఆంధ్రవలస వాదుల పాలనలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను ప్రజలకు వివరిస్తూ, విద్యార్థి యువకులను చైతన్య పరుస్తూ..తెలంగాణ ఉద్యమ జ్వాలను రగిలించి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లో క్రియాశీలకంగా పనిచేసిన వేముల మహేందర్ గౌడ్ కు అరుదైన గౌరవం దక్కింది. ఆయనను తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు తమ్మల శోభారాణి ఉత్తర్వులు జారీ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండల కేంద్రానికి చెందిన వేముల మహేందర్ గౌడ్ మలిదశ ఉద్యమ సమయంలో ఆంధ్ర వలసవాదుల పెత్తనాన్ని ఎదిరించి ఉద్యమాన్ని ముందుకు నడిపించారు. తెలంగాణ పొలిటికల్ జేఏసీ, విద్యార్థి జేఏసీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా, కొండా యువసేన రాష్ట్ర నాయకుడిగా సేవలం దిస్తున్నారు.

కొండా దంపతుల ఆశీస్సులు – శాలువాతో సత్కారం:



రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామకం కాగానే వేముల మహేందర్ గౌడ్ తన రాజకీయ గురువులు, తెలంగాణ ఉద్యమానికి అండగా నిలిచిన కొండా దంపతుల ఆశీస్సులు తీసుకోవడం జరిగింది. శుక్రవారం హన్మకొండ రామ్ నగర్ లోని కొండా దంపతుల నివాసంలో రాష్ట్ర అధ్యక్షురాలు తమ్మల శోభారాణితో కలిసి మాజీ మంత్రి కొండా సురేఖ, కొండా మురళీ దంపతులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీని వేముల మహేందర్ గౌడ్ స్వయంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొండా మురళీ మహేందర్ గౌడ్ ను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. అదే విధంగా కొండా మురళీ తమ్మల శోభారాణిని శాలువాతో సన్మానించగా, శోభారాణి కొండా సురేఖకు పూల మొక్కను అందించి ఆత్మగౌరవ పాదయాత్రను ప్రారంభించాలని ఆహ్వానించారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం నాడు పోరాటం చేస్తే..ఆత్మగౌరవం, అధికార పదవుల కోసం నేడు ఉద్యమకారులకు గుర్తింపేదీ అనే నినాదంతో వరంగల్ నుండి హైదరాబాద్ గన్ పార్క్ వరకు ఆత్మగౌరవ పాదయాత్ర చేపట్టనున్నట్లు ప్రకటించారు. వేముల మహేందర్ గౌడ్ నియామకం పట్ల జిల్లా వ్యాప్తంగా ఉద్యమకారులు, బీసీ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి నాయకత్వ లక్షణాలు కీలకం



-పట్వారిగూడెంలో రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి శిక్షణ కార్యక్రమం

-గ్రామస్థాయి నుంచే బలమైన నాయకత్వాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యం

-ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాల అభివృద్ధిపై నాయకులకు అవగాహన

తెలంగాణ పత్రిక -- దమ్మపేట, నవంబర్ 21

పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు గ్రామస్థాయిలో ప్రజాస్వామ్య విలువలను పెంపొందించేందుకు నాయకత్వ లక్షణాలు ఎంతో అవసరమని పలువురు నాయకులు పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో శనివారం అశ్వారావుపేట నియోజకవర్గ స్థాయి ఒకరోజు నాయకత్వ శిక్షణ కార్యక్రమాన్ని దమ్మపేట మండలం పట్వారిగూడెంలోని చెలికాని ఆదెమ్మ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సంఘటన్ జాతీయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి బి. సుభాష్ యక్కర, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మర్క రాజేంద్రప్రసాద్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా



అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చీకటి కార్తీక్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జాతీయ సమన్వయకర్త జూపల్లి కోదండ వెంకట రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకత్వ లక్షణాల పెంపుదల, గ్రామపంచాయతీల పనితీరు, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధుల బాధ్యతలు, గ్రామాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా నాయకులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. గ్రామస్థాయి నుంచే సమర్థవంతమైన నాయకత్వాన్ని తయారు చేయడం, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, స్థానిక సంస్థలను మరింత పటిష్టం చేయడం ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. శిక్షణ ద్వారా పొందిన అవగాహనను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన బిడ్డ నుంచి హైకోర్టు న్యాయవాదిగా..!

-పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకున్న దమ్మపేట మహిళ పెనుబల్లి మిరియమ్మ

-న్యాయవాదిగా ప్రమాణ స్వీకారం చేసిన మిరియమ్మ ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ఉన్నత విద్యను అభ్యసించిన ఆదివాసీ మహిళ భర్త అడుగుజాడల్లో న్యాయవాద వృత్తిలోకి అడుగుపెట్టిన మిరియమ్మ

దమ్మపేట, నవంబర్ 21

పట్టుదల, కృషి, ఆత్మవిశ్వాసం ఉంటే ఎన్ని కష్టాలు ఎదురైనా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని దమ్మపేట మండలానికి చెందిన ఆదివాసీ మహిళ పెనుబల్లి మిరియమ్మ నిరూపించారు. గిరిజన కుటుంబంలో జన్మించి, ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ ఉన్నత విద్యను అభ్యసించిన ఆమె తాజాగా న్యాయవాదిగా ప్రమాణ స్వీకారం చేసి తన కలను సాకారం చేసుకున్నారు. శనివారం తెలంగాణ బార్ మండలిలో జరిగిన కార్యక్రమంలో ఆమె న్యాయవాదిగా ప్రమాణ స్వీకారం చేశారు. దమ్మపేట మండలం అంకంపాలెం గ్రామానికి చెందిన మిరియమ్మకు 2017లో అదే గ్రామానికి చెందిన ఉన్నత న్యాయస్థాన న్యాయవాది పెనుబల్లి రమేష్ బాబుతో వివాహమైంది. వివాహానంతరం కూడా చదువుపై ఉన్న ఆసక్తిని వదులుకోకుండా తన విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. హైదరాబాద్‌లోని నారాయణగూడ బాబు జగ్జీవన్ రామ్ కళాశాలలో పట్టభద్రుల విద్యను, బాగ్‌లింగంపల్లిలోని అంబేద్కర్ న్యాయ కళాశాలలో న్యాయశాస్త్ర విద్యను పూర్తి చేశారు. ఆదివాసీ గిరిజన కుటుంబంలో జన్మించిన మిరియమ్మ చిన్ననాటి నుంచి వసతి గృహాల్లో ఉంటూ ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని చదువును కొనసాగించారు. కష్టాలను అధిగమిస్తూ ఉన్నత విద్యను పూర్తి చేసి న్యాయవాద వృత్తిలోకి అడుగుపెట్టడం విశేషం. ఆమె మామ పెనుబల్లి సర్వయ్య కమ్యూనిస్టు, ఆదివాసీ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్న నాయకుడు కావడం కూడా కుటుంబ నేపథ్యానికి ప్రత్యేకతను చేకూరుస్తోంది. మిరియమ్మ భర్త పెనుబల్లి రమేష్ బాబు గత 14 సంవత్సరాలుగా ఉన్నత న్యాయస్థానంలో న్యాయవాదిగా సేవలందిస్తున్నారు. గతంలో ప్రభుత్వ తరపు ప్రధాన న్యాయవాదిగా బాధ్యతలు నిర్వహించడంతో పాటు పలు కీలక న్యాయపోరాటాల్లో పాల్గొన్నారు. అత్యున్నత న్యాయస్థానం, జాతీయ హరిత న్యాయస్థానంలోనూ



పలు కేసుల్లో విజయం సాధించారు. ఇప్పుడు భర్త అడుగుజాడల్లోనే మిరియమ్మ కూడా న్యాయవాద వృత్తిలోకి అడుగుపెట్టడం పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు, ఆదివాసీ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే గిరిజన యువతులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని విద్య ద్వారా ఉన్నత స్థాయికి ఎదగవచ్చని మిరియమ్మ ప్రయాణం చాటిచెబుతోందని పలువురు అభినందిస్తున్నారు.

గణిత కృత్యాలతో విద్యార్థుల్లో సృజనాత్మకతకు పదును

-దమ్మపేట పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా గణిత వృత్తం కార్యక్రమం

తెలంగాణ పత్రిక దమ్మపేట నవంబర్ 21

దమ్మపేట: దమ్మపేటలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సంచిలేని దినోత్సవంలో భాగంగా గణిత వృత్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు వారిలో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు స్వయంగా రూపొందించిన వివిధ గణిత కృత్యాలను ప్రదర్శించారు. గణిత అంశాలపై అవగాహన పెంపొందించేలా పలు ఆసక్తికరమైన ప్రశ్నలతో ప్రశ్నోత్తర పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆలోచనా శక్తిని, సృజనాత్మకతను, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు వెంకట కృష్ణారావు, అత్తిలి శ్రీనివాసరావు, నరసింహారావు, మోహన్ రావు పాల్గొన్నారు.

సిద్దిపేట వైద్య కళాశాలకు మదన్ మోహన్ పేరు

-హర్షం వ్యక్తం చేసిన దేవులపల్లి యాదగిరి

-తెలంగాణ తొలి దశ ఉద్యమ నేత సేవలకు సముచిత గుర్తింపు

-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి కృతజ్ఞతలు



నంగునూరు, నవంబరు 21(తెలంగాణ పత్రిక):

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన తొలి దశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన దివంగత సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అనంతుల మదన్ మోహన్ సేవలను గుర్తించి సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాలకు ఆయన పేరు పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం అభినందనీయమని నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి అన్నారు. తెలంగాణ ఉద్యమానికి విశేష సేవలం దించిన మహనీయుడికి ఈ నిర్ణయం ద్వారా సముచిత గౌరవం లభించిందని హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల సిద్దిపేటలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన రాజకీయ గురువు అనంతుల మదన్ మోహన్ పేరును సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాలకు పెడుతున్నట్లు ప్రకటించడం పట్ల యాదగిరి సంతోషం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దేవులపల్లి యాదగిరి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను తొలి దశ ఉద్యమంలోనే బలంగా వినిపించిన నాయకుల్లో అనంతుల మదన్ మోహన్ ప్రముఖులని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన పోరాటం, రాజకీయ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. పదవులు, అధికారాలకు అతీతంగా ప్రజల ఆకాంక్షల కోసం పనిచేసిన నాయకుల సేవలను భావితరాలకు పరిచయం చేయడం ఎంతో అవసరమని అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాలకు అనంతుల మదన్ మోహన్ పేరు పెట్టాలనే నిర్ణయం ఆయన ఆశయాలను, ఉద్యమ స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు గుర్తుచేస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో విశిష్ట స్థానం సంపాదించుకున్న అనంతుల మదన్ మోహన్ సేవలను గుర్తించి గౌరవించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మరోసారి కృతజ్ఞతలు తెలిపారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా సీనియర్ మహిళల హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

కరీంనగర్ నవంబర్ 21 తెలంగాణ పత్రిక



ఈ నెల 27న అంబేద్కర్ స్టేడియంలో సెలక్షన్ ట్రయల్స్

ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27-11-2026, శుక్రవారం రోజున స్థానిక అంబేద్కర్ స్టేడియం (డిఎస్‌సి)లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి సీనియర్ మహిళల హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు ఎంపిక ట్రయల్స్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు వీర్ల వెంకటేశ్వర్ రావు, కార్యదర్శి బసరవేణి లక్ష్మణ్ తెలిపారు. ఈ ఎంపిక పోటీలలో పాల్గొనదలచిన క్రీడాకారిణులు తమ ఒరిజినల్ ఆధార్ కార్డు లేదా ఎస్ఎస్‌సీ మెమోతో ఉదయం 10 గంటలకు అంబేద్కర్ స్టేడియంలో సంయుక్త కార్యదర్శి ఎన్. ప్రభాకర్, హ్యాండ్‌బాల్ కోచ్ వెంకటేష్‌లకు రిపోర్ట్ చేయాలని సూచించారు. ఈ ఎంపిక పోటీలలో ప్రతిభ కనబరిచి ఎంపికైన క్రీడాకారిణులు డిసెంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ (టి హెచ్ ఎ) ఆధ్వర్యంలో నల్గొండ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా తరఫున పాల్గొంటారని తెలిపారు. అర్హత ప్రమాణాలు కట్ ఆఫ్ డేట్: 01-01-2010 కంటే ముందు జన్మించిన క్రీడాకారిణులు మాత్రమే అర్హులు. ఒరిజినల్ ఆధార్ కార్డు లేదా ఎస్ఎస్‌సీ మెమో తప్పనిసరిగా తీసుకురావాలి.

రిపోర్టింగ్ సమయం: ఉదయం 10:00 గంటలకు.

వేదిక: అంబేద్కర్ స్టేడియం (డి ఎస్ సి), కరీంనగర్.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు:

9441925807

8978995730

9550942180

ఈ అవకాశాన్ని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అర్హులైన మహిళా హ్యాండ్‌బాల్ క్రీడాకారిణులు సద్వినియోగం చేసుకోవాలని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కోరారు.

మండల స్థాయి భాషా ప్రతిభ పోటీల్లో విద్యార్థుల సత్తా

-విజేతలుగా నిలిచిన విద్యార్థులు.. జిల్లా స్థాయి పోటీలకు అర్హత



ఓదెల, నవంబర్ 21 (తెలంగాణ పత్రిక)

ఓదెల: మండల స్థాయిలో నిర్వహించిన భాషా ప్రతిభ పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఓదెల మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జిల్లా పరిషత్ పాఠశాల ఓదెలలో మండల విద్యాధికారి వై రమేష్ ఆధ్వర్యంలో మండల స్థాయి భాషా ప్రతిభ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. రచనా విభాగంలో దాసరి సహస్ర 10వ తరగతి ఓదెల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి విజేతగా నిలవగా, మరో విజేతగా జిల్లా పరిషత్ పాఠశాల పొత్కపల్లి విద్యార్థి నిలిచారు. ఉపన్యాస విభాగంలో జిల్లా పరిషత్ పాఠశాల ఓదెలకు చెందిన 6వ తరగతి విద్యార్థి గొడుగు శివనాగేంద్ర కుమార్, హనీ 5వ తరగతి విజయం సాధించారు. ఈ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులు వచ్చే నెలలో నిర్వహించనున్న పెద్దపల్లి జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. విజేతలను మండల విద్యాధికారి, పాఠశాల ఇన్‌చార్జి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వై రమేష్ హెచ్ఎం లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్ బండి శోభారాణి ఎండి యూసఫ్ జానీ సంపత్ కుమార్ ప్రణీత తో పాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు నాగంపేట విద్యార్థిని ఎంపిక



గంభీరావుపేట తెలంగాణ పత్రిక నవంబర్ 21

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నాగంపేట జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని మాలోత్ పవిత్ర 70 వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్ 14 బాలికల కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లుగా ప్రధానోపాధ్యాయులు మారుపాక బాలఎల్లయ్య తెలిపారు ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో జెడ్పిహెచ్ఎస్ నాగంపేట పాఠశాల నుండి సిరిసిల్ల జిల్లా కబడ్డీ జట్టు తరఫున ఇద్దరు విద్యార్థులు మాలోత్ పవిత్ర, తేజావత్ అక్షిత పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో వీరు పాల్గొన్న రాజన్న సిరిసిల్ల జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. అంతే కాకుండా ఇందులో నుండి ఒక్కరు మాలోత్ పవిత్ర తొర్రూర్ లో జరిగే అండర్ 14 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా పక్షాన ఎంపిక కావడం జరిగింది ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారుపాక బాలఎల్లయ్య పాఠశాల ఉపాధ్యాయులు డి శ్రీహరి, యం దేవేంద్రం షిరాజ్ ఫాతిమా, ఆర్ అనిత, ఎల్ రవి, జే.శ్రీనివాస్ రావు, ఎస్ లక్ష్మి ఈ శాంత ఎంపికైన మాలోత్ పవిత్రను అభినందించారు పిల్లలను ఆటలలో చక్కగా తీర్చిదిద్దుతున్న పిఈటి శాంత కు తోటి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

పుట్టినరోజు వేడుకలో పాల్గొన్న కల్వకుర్తి ఎమ్మెల్యే కా సి రెడ్డి నారాయణరెడ్డి



కల్వకుర్తి నవంబర్ 21 తెలంగాణ పత్రిక

కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు పవన్ వాల్మీకి అన్న కుమారుని మొదటి పుట్టినరోజు వేడుకకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మరియు గౌరవ తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ ఠాకూర్ బాలాజీ సింగ్ హాజరై చిన్నారి బాబును ఆశీర్వదించడం జరిగింది ఈ కార్యక్రమంలో బొమ్మరాజుపల్లి గ్రామ ఉప సర్పంచ్ బోయ తిరుపతి,బోయ వెంకటేష్,బోయ జంగయ్య,శివ యాదవ్,మల్లీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు..

ఎండిపోతున్న బోర్లు.. నీరందక చనిపోతున్న పామాయిల్ చెట్లు!







-ఎలినో ప్రభావంతో రైతులకు తీరని నష్టం..
నాలుగు బోర్లు వేసినా చుక్క నీరు లేదు
-గోకారం--చంద్రాయన్ పల్లి చెరువును రిజర్వాయర్‌గా పూర్తి చేయాలని రైతుల విజ్ఞప్తి

తెలంగాణ పత్రిక చారకొండ, నవంబర్ 21

ఎలినో ప్రభావంతో నాగర్ కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని పలు గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రైతులు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా చంద్రాయన్ పల్లి గ్రామంలో ఎన్నడూ లేని విధంగా బోర్లు ఎండిపోవడంతో సాగులో ఉన్న పంటలు నీరందక ఎండిపోతున్నాయి. పంట చేతికొచ్చే సమయంలో నీరు లేకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంద్రాయన్ పల్లి గ్రామానికి చెందిన రైతు సందడి సీతారాం రెడ్డి నాలుగు సంవత్సరాల క్రితం ఆరు ఎకరాల విస్తీర్ణంలో పామాయిల్ తోటను సాగు చేశారు. ప్రస్తుతం ఎలినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గిపోవడంతో పామాయిల్ చెట్లకు నీరందక అవి ఎండిపోయి చనిపోయే పరిస్థితికి చేరుకున్నాయి. ఇప్పటికే సుమారు 500 అడుగుల లోతులో నాలుగు బోర్లు వేసినా ఒక్క బోరులో కూడా నీరు పడలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి పెంచుకున్న పామాయిల్ చెట్లను నీరులేక ఎండిపోతుండటం చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం స్పందించి తమలాంటి రైతులను ఆదుకోవాలని కోరారు. రిజర్వాయర్ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో నీటి కష్టాలు మరోవైపు చంద్రాయన్ పల్లి, గోకారం గ్రామాల పరిధిలోని చెరువుకు సుదీర్ఘ చరిత్ర ఉంది. గతంలో ఈ చెరువులో నీరు సమృద్ధిగా ఉండటంతో సుమారు 25 కిలోమీటర్ల పరిధిలోని బోర్లలో భూగర్భ జలాలు అందుబాటులో ఉండేవని గ్రామస్తులు చెబుతున్నారు. చెరువు ఆయకట్టు కింద దాదాపు 500 ఎకరాల్లో పంటలు సాగు చేసేవారని, ముదిరాజ్ కులస్తులు చేపల వేట ద్వారా జీవనోపాధి పొందేవారని గుర్తు చేస్తున్నారు. 2016లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పథకంలో భాగంగా ఈ చెరువును రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయాలని ప్రకటించింది. అనంతరం 2019 వరకు పనులు చేపట్టి మధ్యలోనే నిలిపివేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రిజర్వాయర్ నిర్మాణం కోసం పాత చెరువు ఆయకట్టును తొలగించి, నీటిని నిల్వ చేసే ప్రాంతాన్ని కూడా చదును చేయడంతో చెరువులోకి వచ్చే వర్షపు నీరు నిల్వ ఉండకుండా వాగుల ద్వారా నాగార్జునసాగర్‌లోకి వెళ్లిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గతంలో చెరువులో నీరు నిల్వ ఉండటంతో పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండేవని, ప్రస్తుతం చెరువు నీరు నిల్వ లేకపోవడం కూడా బోర్లు ఎండిపోవడానికి ఒక కారణమని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం ఈ సమస్యపై నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శిస్తున్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి

ఒకవైపు ఎలినో ప్రభావం, మరోవైపు భూగర్భ జలాలు అడుగంటిపోవడం, చెరువులో నీటి నిల్వలు లేకపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని గోకారం--చంద్రాయన్ పల్లి చెరువు రిజర్వాయర్ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని కోరుతున్నారు. రైతులకు సాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, పంటలు నష్టపోతున్న రైతులకు తగిన పరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆంగ్ల భాషపై పట్టు సాధిస్తే అవకాశాల ప్రపంచం మన ముందుంటుంది!

-విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో భావాలను వ్యక్తపరచాలి
-వక్తృత్వ నైపుణ్యాలను పెంపొందించుకోవాలి
-మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి
-ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామి గౌడ్

నంగునూరు, నవంబరు 21(తెలంగాణ పత్రిక):

ఆంగ్ల భాషపై పట్టు సాధించడం నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు ఎంతో అవసరమని, భాషా నైపుణ్యాలు భవిష్యత్తులో ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవడానికి దోహదపడతాయని సిద్దిపేట జిల్లా నంగునూరు మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి అన్నారు. నంగునూరు మండల ఆంగ్ల భాషా ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మండలస్థాయి ఆంగ్ల భాషా ఒలింపియాడ్, టెడ్-ఎడ్ ప్రసంగ పోటీలకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని భాషా పరిజ్ఞానం, సృజనాత్మకత, భావవ్యక్తీకరణ సామర్థ్యాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ఆంగ్ల భాషలో ప్రావీణ్యం సంపాదించడంతో పాటు తమ ఆలోచనలను స్పష్టంగా, ధైర్యంగా ఇతరులకు వివరించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. వక్తృత్వ పోటీలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి చక్కటి అవకాశమని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా మాట్లాడే నైపుణ్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనడం ద్వారా కొత్త విషయాలను నేర్చుకుని నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాల్సిన నైపుణ్యాలను గుర్తించ వచ్చని తెలిపారు. నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామి గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా వేదికలపై ధైర్యంగా మాట్లాడే నైపుణ్యాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అభ్యసనలో ఆంగ్ల భాషా పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. కేవలం పరీక్షల్లో మార్కులు సాధించడమే కాక ఆంగ్లంలో మాట్లాడటం, ఇతరుల అభిప్రాయాలను అర్థం చేసుకోవడం, స్వతంత్రంగా ఆలోచించడం వంటి నైపుణ్యాలను అలవర్చుకోవాలని సూచించారు. ప్రసంగ పోటీలు విద్యార్థుల్లో వేదిక భయాన్ని తొలగించి, తమ అభిప్రాయాలను నిర్భయంగా వ్యక్తపరిచే ధైర్యాన్ని కల్పిస్తాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను నిరంతరం ప్రోత్సహిస్తూ ఇలాంటి పోటీలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు.





ఆంగ్ల భాషా ఒలింపియాడ్‌లో విజేతలు

సీనియర్ల విభాగంలో నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి.హర్షితారెడ్డి, నర్మెట్ట పాఠశాలకు చెందిన బి. రిత్విక్ వరుసగా ప్రథమ, ద్వితీయ బహుమతి సాధించారు. జూనియర్ల విభాగంలో నంగునూరు పాఠశాలకు చెందిన రిషివర్ధన్ రెడ్డి, బద్దిపడగ పాఠశాలకు చెందిన జె.భవాని వరుసగా ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందారు.

టెడ్-ఎడ్ ప్రసంగ పోటీల్లో విజేతలు

సీనియర్ల విభాగంలో అక్కెనపల్లి తెలంగాణ ఆదర్శ పాఠశాలకు చెందిన ఐ.మనోజ్ఞ, బద్దిపడగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జి. అక్షిత వరుసగా ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. జూనియర్ల విభాగంలో అక్కెనపల్లి తెలంగాణ ఆదర్శ పాఠశాలకు చెందిన ఎన్. నిత్యారెడ్డి, నర్మెట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి.నిఖిల ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు విజేతలను అభినందించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల భాషా ఉపాధ్యాయుల సంఘం మండల సమన్వయకర్త గజబీంకార్ కన్యాలాల్, సహ సమన్వయకర్త ఎర్ర పార్థసారథి, ఆంగ్ల ఉపాధ్యాయులు భైరు సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల హక్కుల కోసం పద్మశాలీల పోరుబాట

-2,400 మంది దరఖాస్తుదారుల్లో కేవలం 100 మందికే పింఛన్లు మంజూరు.
-మిగిలిన అర్హులందరికీ న్యాయం చేయాలని డిమాండ్..
23న చలో కలెక్టరేట్‌కు పిలుపు.

జగిత్యాల జిల్లా, (తెలంగాణ పత్రిక), నవంబర్ 21:

జగిత్యాల జిల్లాలో చేనేత కార్మికుల పింఛన్ల మంజూరులో జరుగుతున్న జాప్యం, అర్హులైన కార్మికులకు అందని సంక్షేమ ఫలాలపై పద్మశాలీ సమాజంలో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. జిల్లావ్యాప్తంగా సుమారు 2,400 మంది చేనేత కార్మికులు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోగా, కేవలం 100 మందికి మాత్రమే పింఛన్లు మంజూరు కావడం పట్ల పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన 2,300 మంది దరఖాస్తుదారుల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తూ, అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి పింఛను అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.ఈ నేపథ్యంలో చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అర్హులందరికీ న్యాయం చేయాలనే లక్ష్యంతో ఈ నెల 23న జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలిరావాలని న్యాయవాది, కన్నాపూర్ సర్పంచ్ పొట్టవత్తిని సతీష్ పిలుపునిచ్చారు.చేనేత కార్మికుల సంక్షేమం, వారి జీవన భద్రత ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా చేనేత వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న కార్మికులకు వృద్ధాప్యంలో పింఛను ఎంతో ఆసరాగా ఉంటుందని, అర్హత ఉన్నప్పటికీ పింఛన్లు మంజూరు కాకపోవడం బాధాకరమన్నారు. ఈ సమస్యను పరిష్కరించి మిగిలిన అర్హులైన కార్మికులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని కోరారు.ఈ పోరాటం వ్యక్తిగత సమస్య కోసం కాదని, చేనేత కార్మికుల హక్కులు, పద్మశాలీ సమాజ సంక్షేమం కోసం చేపడుతున్న ఉద్యమమని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న పద్మశాలీ కుల బాంధవులు, చేనేత కార్మికులు, యువత, మహిళలు రాజకీయ పార్టీలకు అతీతంగా ఐక్యంగా తరలివచ్చి తమ హక్కుల కోసం గళమెత్తాలని విజ్ఞప్తి చేశారు.చలో కలెక్టరేట్ కార్యక్రమం 23 నవంబర్ 2026, సోమవారం ఉదయం 10 గంటలకు వేదిక జిల్లా కలెక్టరేట్ జగిత్యాల,పద్మశాలీల ఐక్యతను చాటుతూ చేనేత కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పొట్టవత్తిని సతీష్ కోరారు.



మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్-2026 విజయవంతం

పాలకుర్తి నవంబర్ 21(తెలంగాణ పత్రిక):

?విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించే లక్ష్యంతో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాలకుర్తిలో మండల స్థాయి 'చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ – 2026' అత్యంత ఉత్సాహ భరిత వాతావరణంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాలకుర్తి మండల విద్యాశాఖ అధికారి పోతుగంటి నరసయ్య హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థి దశ నుండే మూఢనమ్మకాలను వీడి, ప్రతి విషయాన్ని సైన్స్ కోణంలో ఆలోచించేలా ప్రోత్సహించడంలో జన విజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న చెకుముకి పోటీలు ఎంతో దోహదపడతాయని కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ఓరుగంటి రమేష్, మండల





జన విజ్ఞాన వేదిక కన్వీనర్ నీలకంఠం పాల్గొని ప్రసంగిస్తూ, ఇలాంటి పోటీ పరీక్షల ద్వారా విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకత, మేధస్సు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.?ఈ పోటీలలో విభాగాల వారీగా విజేతలుగా నిలిచిన పాఠశాలల వివరాలు ప్రభుత్వ విభాగంలో ప్రథమ స్థానం పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాలకుర్తి, ద్వితీయ స్థానం జిల్లా పరిషత్ హై స్కూల్ చెన్నూరు; గురుకుల విభాగంలో ప్రథమ స్థానం కేజీబీవీ పాలకుర్తి,ప్రైవేట్ విభాగంలో ప్రథమ స్థానం ప్రగతి విద్యానిలయం, కైవసం చేసుకున్నాయి. మండల స్థాయిలో గెలుపొందిన ఈ పాఠశాలల జట్లు త్వరలో జరగబోయే జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు అర్హత సాధించాయి. విజేతలకు ముఖ్య అతిథులు నిర్వాహకులు అభినందనలు తెలియజేశారు.

బాలసదనంలో వసతి పొందుతున్న పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి

-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

నిర్మల్ జిల్లా ప్రతినిధి నవంబర్ 21 (తెలంగాణ పత్రిక)

బాలసదనంలో వసతి పొందుతున్న పిల్లలందరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జాతీయ బాలల దినోత్సవం వారోత్సవాల సందర్భంగా శనివారం జిల్లా కలెక్టర్ నిర్మల్ గ్రామీణ మండలం కొండాపూర్ గ్రామంలో గల బాలసదనాన్ని సందర్శించి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ముందుగా ఆయన బాలసదనంలోని వివిధ విభాగాలను పరిశీలించారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లలందరికీ అన్ని వసతులు కల్పించాలన్నారు. చిన్నారులతో నేరుగా మాట్లాడి వారి వివరాలు, బాలసదనంలో సౌకర్యాలు, ఇంకా ఏవైనా ఇబ్బందులు ఉన్నాయేమో అని, వారి జీవిత లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు కలిగినా వెంటనే అధికారు





లకు తెలియజేయాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆటలు ఆడాలని తెలిపారు. బాలసదనం అధికారులతో మాట్లాడుతూ, చిన్నారులకు ఎటువంటి సమస్య వచ్చిన వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రతి ఒక్కరిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అందరూ తరగతులకు హాజరయ్యేలా చూడాలన్నారు. విద్యార్థులను ఇతర రాష్ట్రాలకు విమానాల్లో సందర్శనకు తీసుకు వెళ్లాలని సూచించారు. ఆదివారాలు, ఇతర సెలవు దినాల్లో వారికి సందేశాత్మకమైన, వారి మనోస్థైర్యం నింపేలా మంచి మంచి సినిమాలను ప్రదర్శించాలన్నారు. ఆటలు ఆడించాలన్నారు. వినూత్నమైన కార్యక్రమాలు నిర్వహించి వారిని భాగస్వామ్యం చేయాలని చెప్పారు. త్వరలోనే సొంత భవనంలోనికి బాలసదనాన్ని మారుస్తామని హామీ ఇచ్చారు. చిన్నారులతో కేకు కట్ చేయించి, వారికి కానుకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి వినూత్న, అధికారులు మురళి, వైష్ణవి, రాజు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి

-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

నిర్మల్ జిల్లా ప్రతినిధి నవంబర్ 21 (తెలంగాణ పత్రిక)

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. శనివారం కలెక్టర్ పట్టణం లోని గొల్లపేట్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా శిబిరాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బీమా నమోదు తీరును పర్యవేక్షించారు. ఒక కుటుంబానికి బీమా నమోదు చేయడానికి దాదాపు ఎంత సమయం అవుతుందో స్వయంగా పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బీమా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు.





స్థానిక అధికారులంతా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం శిబిరాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. ప్రజలంతా ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం కింద నమోదయ్యేలా చొరవ చూపాలని తెలిపారు. ఈ పథకంపై ప్రజలకు ఎలాంటి సందేహాలు ఉన్న వారికి అర్థమయ్యేలా తెలియజేయాలని అన్నారు. ప్రక్రియ పూర్తి చేసిన కుటుంబాల వివరాలన్నీ స్పష్టంగా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ తనిఖీలో సిపిఓ గంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, స్థానిక కౌన్సిలర్ సురేష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 30 న వెంకటాపురం తహసీల్దార్ కార్యాలయం ముట్టడి జయప్రదం చేయాలి





-ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరణ.

-1/70 చట్టాన్ని రద్దు చేయాలని గిరిజనేతరులు సుప్రీమ్ కోర్టు లో పిటిషన్ వేసి,ఐదో షెడ్యూల్ ప్రాంతాన్ని విచ్ఛిన్నం కుట్రను తిప్పికొట్టాలి..

వెంకటాపురం. (నూగురు) నంబర్ 21 : తెలంగాణ పత్రిక ::

5 వ షెడ్యూల్డ్ ప్రాంత చట్టాలను పూర్తి స్థాయిలో అమలు చేయుటకై,నవంబర్ 30 ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో వెంకటాపురం మండలం తాసిల్దార్ కార్యాలయం ముట్టడి ప్రచారంలో భాగంగా శనివారం. ఆదివాసి సంఘాల కార్యచరణ వేదికగా కరపత్రం ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు మాట్లాడుతూ. 1/70 చట్టం ఐదో షెడ్యూల్ లో ఉన్న ఆదివాసీల భూములకు రక్షణ కోసమే కాదని,ఆదిమ తెగల ఆస్తిత్వానికి, ఆదివాసీల సంస్కృతీ, సంప్రదాయాలను, వాటి ఉనికిని కాపాడడానికి వచ్చిన,రాజ్యాంగ బద్ధమైన చట్టమని అన్నారు.నేడు ఈ చట్టానికి ఆదివాసీల ఉనికికి ప్రమాదం ఏర్పడే విధంగా గిరిజనేతరులు 1/70 చట్టాన్ని తీసివేయాలని కోర్టును ఆశ్రయిస్తున్నారని, ఇది ఆదివాసి సమాజం గమనించాలని అన్నారు.దీని పై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకుండా ముందడుగు వేయకుండా మౌనంగా ఉంటోందని,ప్రభుత్వ మౌనం ఆదిమ తెగల ఆస్థిత్వానికి పెనుముప్పు ఏర్పడుతుందని,ఐదో షెడ్యూల్ భూభాగంలోని ఖనిజ సంపదను దోచుకు తినడానికి ఈనాడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రపూరితంగా

వ్యవహరిస్తున్నారని,దిన్ని ఆదివాసి సమాజం గమనించాలని నాయకులు అన్నారు. ఒక 1/70 చట్టం మాత్రమే కాదు, పెసా, అటవీ హక్కుల గుర్తింపు చట్టాలు కూడా అమలుకు నోచుకోవడం లేదని.మనం ఇలాగే ప్రభుత్వ విధానాలను ప్రశ్నించక పొతే మన మౌనమే మనకు భవితరాలకు మరణ శాసనం కాబోతోంది అని ఆవేదన వ్యక్తం చేశారు.నేడు ఆ చట్టాల ఉనికి ప్రమాదం ఏర్పడ్డది. వారి వారసులుగా , వారి ఆశయాలను సాధిద్దాం.రాజకీయ పార్టీలకు అతీతం గా మన మౌన సంకెళ్లు తెంచుకోని నవంబర్ 30 న ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ తలపెట్టిన వెంకటాపురం తహసీల్దార్ కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి ఆదివాసి ప్రజలు,ప్రజా స్వామిక వాదులు,ప్రజా ప్రతినిధులు,మేధావులు వేలాదిగా తరలి రావాలని పిలునిచ్చారు.ఈ కరపత్ర ఆవిష్కరణలో తుడుం దెబ్బ,జాతీయ నాయకులు యాసం రాజు,జిల్లా అధ్యక్షుడు సిద్ధబోయిన సర్వేశ్వరరావు,బొగ్గుల బిక్షపతి, మండల అధ్యక్షుడు కణితి వెంకటకృష్ణ,ఆదివాసి నవ నిర్మాణసేన,రాష్ట్ర అధ్యక్షుడు కోర్స నరసింహమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం నాగరాజు,జిల్లా కన్వీనర్ కుంజ మహేష్, ఉపాధ్యక్షుడు కంతి విజయ్,గొండ్వానా సంక్షేమ పరిషత్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి, జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్,మండల నాయకులు పూనెం. నితిన్, బి.నరసింహమూర్తి, ఆదివాసి సంక్షేమ పరిషత్,ములుగు జిల్లా కన్వీనర్ పర్షిక సతీష్,మండల అధ్యక్షుడు తుర్స కృష్ణ బాబు,తుర్స ప్రశాంత్, సూర్యే తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బిఎల్ఆర్

-ప్రతి కుటుంబంలో అర్హులైన ఒకరికి ఐదు లక్షల బీమా భరోసా అందించడమే ప్రభుత్వ లక్ష్యం



మాడుగులపల్లి//నల్గొండ//నవంబర్ 21:(తెలంగాణ పత్రిక):-

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కార్యక్రమంన్ని మాడుగులపల్లి మండలం కుక్కడం గండ్రవాని గూడెం గ్రామపంచాయతీలను మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఆర్డిఓ సందర్శించరు. అనంతరం పథకం నమోదు ప్రక్రియను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలని లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది, ఈ ప్రభుత్వం ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబంలో 18 నుంచి 59 సంవత్సరాల వయసు కలిగిన కుటుంబం లో ఒక్కరికి 5లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పిస్తుంది అన్నారు. కుటుంబం లో సంపాదించే వ్యక్తి అనుకోని పరిస్థితులు మరణిస్తే ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల గురికాకుండా ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. మండలంలోని ప్రతి కుటుంబం అర్హులైన వారి వివరాలను సేకరించి ఎవరు ఈ పథకానికి దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీ జి. వంశీధర్, సంబంధిత గ్రామపంచాయతీల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆగం పాండు ముదిరాజ్ ఘన స్వాగతం పలికిన జోగులాంబ తెలుగు ముదిరాజ్ మత్స్యకారుల సంఘం అధ్యక్షులు కబీర్ దాస్



(తెలంగాణ పత్రిక)21/11/26జోగులాంబ గద్వాల్ జిల్లా ప్రతినిధి



నరసింహులు ముదిరాజ్.ఈరోజు గద్వాల పట్టణ కేంద్రంలో జోగులాంబ గద్వాల జిల్లా తెలుగు ముదిరాజ్ మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా గార్లపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన పండుగ సాయన్న ముదిరాజ్ విగ్రహ ఆవిష్కరణకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ సర్పంచ్,మాజీ కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్ గారికి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికిన జోగులాంబ గద్వాల జిల్లా తెలుగు ముదిరాజ్ మత్స్యకారుల సంఘం అధ్యక్షులు కబీర్దాస్ నరసింహులు ముదిరాజ్ అనంతరం కృష్ణవేణి చౌక్ లోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన ఆగం పాండు ముదిరాజ్. ఈ కార్యక్రమంలో తాలూకా అధ్యక్షులు టిఎన్ఆర్ జగదీష్,జిల్లా సలహాదారులు లక్ష్మన్న,డాక్టర్ నర్సింగరావు,మధురాములు, కౌన్సిలర్ నరసింహ, గద్వాల్ తాలూకా ప్రధాన కార్యదర్శి దడవై నరసింహ,కేక్ భాయ్,చాపల చిన్న,బీరెల్లి వెంకటేష్,ముదిరాజ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఉపసభాపతి పద్మా దేవేందర్ రెడ్డి

పాపన్నపేట నవంబర్ 21:(తెలంగాణ పత్రిక)





పాపన్నపేట మండలంలోని కుర్తివాడ గ్రామానికి చెందిన పత్రికా విలేఖరి మధుసూదన్ చారి కుమార్తె వైష్ణవి వివాహం శనివారం హైదరాబాద్ కు చెందిన సురేష్ చారితో ఘనంగా జరిగింది. మండల కేంద్రంలోని కొత్తపల్లి గ్రామంలో ఉన్న అనంత పద్మనాభ స్వామి ఫంక్షన్ హాల్‌లో వివాహ వేడుక వైభవంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకకు మాజీ శాసనసభ ఉపసభాపతి యం. పద్మా దేవేందర్ రెడ్డి హాజరై నూతన వధూవరులు వైష్ణవి, సురేష్ చారిలను ఆశీర్వదించారు.వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జగన్, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు వడ్ల కుబేరుడు, మాజీ సర్పంచులు గురుమూర్తి గౌడ్, లింగారెడ్డి, బద్రి, మల్లేశం, నాయకులు మన్నె వెంకటేశం, కిరణ్ ,దుర్గయ్య, రాజు, దత్తు, రాము, విల్సన్, సాయి బాబా,నవీన్, గోపాల్, తదితరులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ పత్రిక TELANGANA PATRIKA TELUGU DAILY తెలుగు దిన పత్రిక నిజం మా బిజినెస్

శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ గా వాసరి రవి ఏకగ్రీవం

రాయికల్ మండల నవంబర్ 21(తెలంగాణ పత్రిక):



జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని రామాజీపేట గ్రామంలో గల శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆల య కమిటీ చైర్మన్ గా వాసరి రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యా రు. ఆలయ ప్రాంగణంలో నూతన కార్యవర్గం ఎన్నికల్లో రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే నూతన కార్యవ ర్గం ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా అనుపు రం సత్యం గౌడ్, ఎనుగంటి శంకర్, కోశాధికారిగా చల్ల రాజేందర్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి వట్టిమల్ల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు గా ఎనుగంటి పెద్ద లింబయ్య,ఇద్దం గంగారెడ్డి ఎనుగంటి నాగరాజు, కుర్మ లింగారెడ్డి,అయిండ్లెని రామరెడ్డి,ఏళ్లిపాక గంగారంలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సలహాదారులుగా కోల రాజు,బద్ధం సుధాకర్ రెడ్డి,ఆకుల మహేష్,ఎనుగంటి రాములు,అయిండ్లేని భీమారెడ్డి,అయిండ్లేని గంగారెడ్డి, గుజ్జుల మోహన్ రెడ్డి లు ఎన్నిక య్యారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బెజ్జంకి మోహన్,ఉప సర్పంచ్ ఇద్దం సుధీర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ హరీష్ రావు,వివిధ కుల సంఘాల సభ్యులు రామాలయం కమిటీ శాశ్వత సభ్యులు పాల్గొన్నారు.

మత్స్యశాఖ దినోత్సవం సందర్భంగా తమ్మాయి పల్లిలోఘనంగా జండావిష్కరణ



పాపన్నపేట, నవంబర్ 21: (తెలంగాణ పత్రిక)

మత్స్యశాఖ దినోత్సవం సందర్భంగా శనివారం రోజు మండల పరిధిలోని తమ్మాయిపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు చింతకాయల వెంకట్ ఆధ్వర్యంలో ఘనంగా జండా ఎగురవేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం పాపన్నపేటతో పాటు మండల లోని అన్ని గ్రామాల్లో జండాను ఎగుర వేసినట్లు ఆయన వెల్లడించారు. ప్రతీ గ్రామంలో ముదిరాజ్ లు ఐక్యంగా ఉంటే రాజకీయంగా ఎదుగుతామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.జెండావిష్కరణ కార్యక్ర మంలో పాపన్నపేట మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ముషెట్టి కిష్టయ్య,పాపన్నపేట గ్రామ అధ్యక్షులు బుడాల మానయ్య,వెంకటేశం, విట్టల్,లక్ష్మణ్, వెంకటేశం తోట్లనరేష్, ఆంజనేయులు,భాగయ్య, సాయిలు, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఎస్సై బాలరాజును సన్మానించిన ఆదర్శ ఆటో యూనియన్ సభ్యులు

గంభీరావుపేట తెలంగాణ పత్రిక నవంబర్ 21



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బాలరాజును శనివారం రోజున మండల కేంద్రంలోని ఆద ర్శ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి ఎస్సైని శాలువాతో సన్మానించి స్వీట్ తినిపించారు ఎస్సైని సన్మానించిన వారిలో ఆదర్శ ఆటో యూనియన్ అధ్యక్షులు ఇబాదుల్లా ఖాన్ ఉపాధ్యక్షులు గుడికాడి మహేష్ కోశాధికారి వీరబోయిన జనార్ధన్ సభ్యులు రాజారాం ఏ ప్రవీణ్ ఏ కిషన్ కే మహేష్ ఈ దేవేందర్ రమేష్ నాయక్ ఈ దేవయ్య శేఖర్ వినోద్ గుడ్ల స్వామి బాల బుదయ్య మద్దెల శ్రీనివాస్ అధికం శ్రీనివాస్ ఆర్ చంద్రం హైమద్ ముజీబ్ సలీం చాంద్ ధనుంజయ్ జంగం రాజు తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ బీమా నమోదు ప్రక్రియపై అధికారుల పర్యవేక్షణ

- ఆత్మకూరు, గూడెపాడు గ్రామాల్లో శిబిరాల తనిఖీ
- నమోదు వివరాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ శేషాద్రి
- ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలని ఆదేశం

ఆత్మకూర్, నవంబర్ 21 (తెలంగాణ పత్రిక):



ఆత్మకూరు, గూడెపాడు గ్రామ పంచాయతీల పరిధిలో నిర్వహి స్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు శిబిరాలను శనివారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), సీఈఓ శ్రీ ఎం. శేషాద్రి, డిప్యూటీ సీఈఓ శ్రీనివాసరావు సందర్శించి నమోదు ప్రక్రియను పరిశీలించారు. శిబిరాల్లో లబ్ధిదారుల వివరాలు నమోదు చేస్తున్న తీరును, సేకరిస్తున్న సమాచారాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాటా ఎంట్రీ ఆపరేటర్లు, పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించిన వివరాలను ఎలాంటి తప్పులు, లోటుపాట్లు లేకుండా పూర్తి జాగ్రత్తతో నమోదు చేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంబంధించిన సమాచారం సక్రమంగా నమోదు అయ్యేలా బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎంపీడీవో ఎం. శ్రీనివాస్ రెడ్డి, ఆత్మకూరు సర్పంచ్ శ్రీమతి పర్వతగిరి మహేశ్వరీ రాజు, గూడెపాడు సర్పంచ్ రమేష్, పంచాయతీ కార్యదర్శులు శ్వేత, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ గా పి.కృష్ణ పూర్తి అదనపు బాధ్యతల స్వీకరణ

-ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

-గ్రామీణ,పట్టణ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి

(తెలంగాణ పత్రిక)21/11/16జోగులాంబ గద్వాల్ జిల్లా ప్రతినిధి



జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గా పి.కృష్ణ పూర్తి అదనపు బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, తనకు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపా రు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగిం చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ, అప్పగించిన బాధ్యతలను పూర్తి అంకితభావంతో, నిబద్ధతతో, సమర్థవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు.జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి స్థానిక సంస్థలు ఎంతో కీలకమని, ఈ దిశగా మరింత సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామ పంచాయతీలు,మండల పరిషత్‌లు, మున్సిపా లిటీల పరిధిలో అమలవుతున్న వివిధ అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తానని అన్నారు.గ్రామ పంచాయతీల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. అదేవి ధంగా పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ సేవలను మెరుగుపరచడం,పారిశుధ్య కార్యక్రమాలను సమర్థవ ంతంగా నిర్వహించడం, తాగునీటి సమస్యల పరిష్కా రం, రహదారులు,డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధి,ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతానని తెలిపారు.ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో చేరేలా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తానని చెప్పారు.గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల పరిధిలో చేపడుతున్న పనుల పురోగతిని ఎప్పటిక ప్పుడు సమీక్షిస్తూ, నిర్ణీత సమయంలో పనులు పూర్తయ్యేలా అవసరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ స్థానిక సంస్థల పనితీరును పరిశీలించడంతో పాటు, ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కా రానికి చర్యలు చేపడతానని తెలిపారు. జిల్లా అభివృద్ధి లక్ష్యాల సాధనలో తనకు అప్పగించిన బాధ్యతలను బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని పి.కృష్ణ ఈ సందర్భంగా వెల్లడించారు.

తల్లికి ఆరోగ్య పరిరక్షణకు సాధారణ ప్రసవాలు జరిగేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలి

-జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి :

(తెలంగాణ పత్రిక) నవంబర్, 21





జయశంకర్ భూపాలపల్లి శనివారం ఐడీఓసీ సమా వేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వ ర్యంలో నిర్వహించిన జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, పురోగతిపై సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యపరంగా అత్యవసరమైన సందర్భా ల్లో మాత్రమే సిజేరియన్ ప్రసవాలు నిర్వహించాలని, అనవసర సిజేరియన్లను నియంత్రించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భి ణులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ, సాధారణ ప్రసవాలకు అనుకూలమైన వాతావరణం కల్పిం చాలని తెలిపారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమన్వ యంతో పనిచేస్తూ గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ ఆరోగ్య సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా వైద్యాధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించా రు. గర్భిణులు, చిన్నపిల్లలు, కౌమార బాలబాలికలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సలు అందించాలని సూచించారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన తాజా గణాంకాలు, నెలవారీ పురోగతి, పనితీరు సూచికలతో కూడిన నివేదికలను ముందుగానే సిద్ధం చేసుకోవా లని తెలిపారు. నివేదికల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా వాస్తవ గణాంకాలను నిర్ణీత సమ యంలో సమర్పించాలని అధికారులకు స్పష్టం చేశారు. అంతకుముందు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ జిల్లాలో అమలవుతున్న మాతా శిశు ఆరోగ్య కార్యక్రమాలు, హైరిస్క్ గర్భిణుల గుర్తింపు, సంపూర్ణ టీకాల కార్యక్రమం, కుటుంబ నియంత్రణ సేవలు, క్షయ, కుష్ఠు వ్యాధుల నివారణ, మధుమేహం, రక్తపోటు వంటి అసంక్రమిత వ్యాధుల పరీక్షలు, రక్తహీనత నివారణ, పోషకాహార కార్యక్ర మాల పురోగతిని కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరిం టెండెంట్ డా వెంకటరత్నం, జిల్లా ప్రోగ్రామ్ అధికా రులు, గైనకాలజిస్టులు, వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, సూప ర్‌వైజర్లు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవల్లో ఫార్మసిస్ట్ ల పాత్ర కీలకం







-జాతీయ ఫార్మసీ సప్తాహంలో డిఎంఎచ్ఓ వాణిశ్రీ

-ఫార్మసిస్ట్ లకు సన్మానం.. రోగులకు పండ్ల పంపిణీ

పాలకుర్తి,నవంబర్ 21(తెలంగాణ పత్రిక):

ప్రాణాలు కాపాడే ఔషధాలను అందిస్తున్న ఫార్మసిస్ట్ లు ఆరోగ్యరంగంలో కీలకం అని ప్రశంసించారు జనగామ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వనపర్తి వాణిశ్రీ. 65వ జాతీయ ఫార్మసీ సప్తాహం ముగింపు వేడుకలను పురస్కరించుకొని ఇండియన్ ఫార్మస్యూ టికల్ అసోసియేషన్ మరియు కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాలకుర్తి ప్రభుత్వ వైద్యశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో వాణి శ్రీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ఆరోగ్య సేవల జిల్లా కోఆర్డినేటర్ జి సంధ్య మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ బృందంలో ఔషధ ప్రయోక్తలైన ఫార్మసిస్ట్ ల పాత్రను మరింత బలోపే తం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వ ఫార్మసిస్ట్ లు మేడిపల్లి రాధిక, జోగు కవిత మరియు స్థానిక ఫార్మసిస్ట్ లను ఘనంగా సన్మానిం చారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఏఈ సిద్ధార్థ రెడ్డి, సిఎచ్ఓ పుర్మ జయపాల్ రెడ్డి, వైద్యాధి కారులు స్వప్న, గాయత్రి, అడుగు డిజిటల్ మీడియా చీఫ్ ఎడిటర్ మార్గం లక్ష్మినారాయణ, ఎండి మార్గం సాయి సందేశ్ తేజ, ఐపిఏ ప్రతినిధి రాపోలు సత్యనా రాయణ, జనగామ జిల్లా కెమిస్ట్స్ అసోసి యేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ బిట్ల రాంప్రభాకర్, అధ్య క్షుడు పబ్బ సంతోష్, కార్యదర్శి చిదురాల మహేం దర్, కోశాధికారి మాదంశెట్టి భాస్కర్, సభ్యులు ఓంకార్, సతీష్, కత్తుల సోమ్ ప్రకాశ్, కేర్ల కర్ణాకర్, రాపోలు సోంసాయి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధి ప్రణాళికను పకడ్బందీగా చేయాలి - కలెక్టర్ దివాకర టి ఎస్

-2028 నాటికి తలసరి ఆదాయం రూ. 5 లక్షలు, 2033 నాటికి రూ.10 లక్షలకు పెంచే లక్ష్యంతో కార్యాచరణ ఉండాలి

ఖమ్మం జిల్లా ప్రతినిధి నవంబర్ 21 (తెలంగాణ పత్రిక)



ఖమ్మం జిల్లా అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ అన్నారు . శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో జిల్లా అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన పై కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, శిక్షణ సహాయ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి శాఖ తమ లక్ష్యాలను స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలుగా విభజించుకుని, నిర్దేశిత గడువులోగా వాటి సాధనకు పక్కా కార్యాచరణతో ఉండాలన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాలతో పాటు విద్యుత్, పునరుత్పాదక ఇంధన, తాగునీటి రంగాల అభివృద్ధి లక్ష్యాలపై చర్చించారు. వ్యవసాయ రంగంలో భాగంగా 2032 మార్చి నాటికి రైతుల నికర ఆదాయాన్ని 15 శాతం మేర పెంచడం, 5 వేల ఎకరాల్లో లాభదాయక సాగు పద్ధతులను విస్తరించడం, డ్రోన్ల వినియోగం, యాంత్రీకరణ ప్రణాళిక చేయాలన్నారు. ఉద్యానవన శాఖ పరిధిలో ఆయిల్ పామ్ సాగు విస్తరణతో పాటు డ్రిప్ ఆటోమేషన్ పెంచాలని, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 2030 నాటికి పశువుల్లో గాలికుంటు, పీపీఆర్, రేబిస్ వ్యాధుల పూర్తి నిర్మూలన, 4 వేలకు పైగా పశువుల షెడ్ల నిర్మాణం, పశుగ్రాస క్షేత్రాల అభివృద్ధి, మత్స్య శాఖ ద్వారా చెరువుల అభివృద్ధి, ఆధునిక మత్స్య మార్కెట్ల నిర్మాణం, మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డుల మంజూరు వంటి అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. 2028 నాటికి తలసరి ఆదాయాన్ని రూ.5 లక్షలకు, 2033 నాటికి రూ.10 లక్షలకు పెంచే లక్ష్యంతో శాఖల వారీగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ సూచించారు. 2033-34 నాటికి ఖమ్మం జిల్లాను అభివృద్ధి చెందిన జిల్లాగా ప్రకటించే స్థాయికి తీసుకెళ్లేందుకు సమన్వయంతో పని చేయాలని అన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకోవడమే కాకుండా వాటి సాధనకు అవసరమైన వనరులు, చేపట్టాల్సిన పనులు, అమలు చేయాల్సిన విధానం, నిర్దిష్ట కాలపరిమితులను స్పష్టంగా పేర్కొనాలని అన్నారు. జిల్లా అభివృద్ధిలో అన్ని రంగాల సమతుల్య వృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి రంగానికి సంబంధించి అవసరమైన గణాంకాలను సేకరించి విశ్లేషణ ఆధారంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. అంతకుముందు కలెక్టర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్ష చేశారు. ప్రజల దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, త్వరితగతిన పరిష్కార చర్యలు తీసుకోవాలని తెలిపారు. దరఖాస్తు తిరస్కారంపై కారణాలతో సహా దరఖాస్తుదారునికి వ్రాతపూర్వకంగా తెలిపాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఎంపిడిఓ లు, తదితరులు పాల్గొన్నారు

మహా పాదయాత్రను విజయవంతం చేయాలి



-కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు జలపతి రెడ్డి

గంభీరావుపేట తెలంగాణ పత్రిక నవంబర్ 21

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు కోడె రమేశ్ ఆధ్వర్యంలో మహా పాదయాత్ర సమావేశం నిర్వహించారు ఈసందర్భంగా మండల ఇన్చార్జ్ సిరిసిల్ల జిల్లా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు జలపతి రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

మండల అధ్యక్షులు కోడె రమేశ్ మాట్లాడుతూ..

ఎస్ఐఆర్ పేరుతో కాంగ్రెస్ కాక్రోచ్ కానీ మిత్ర పక్షాలు కానీ దేశం లో చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పి కొడుతూ, ప్రజల్లో అపోహలను తొలగిస్తూ కాంగ్రెస్ చేస్తున్న అరాచక పాలనకు అడ్డుకట్ట వేసి ప్రజాస్వామ్య విలువలను కాపాడే లక్ష్యంతో కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేపట్టిన



మహా పాదయాత్రలో జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ పాల్గొననున్నారు

కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు జలపతి రెడ్డి మాట్లాడుతూ..

ఈ మహాసభను విజయవంతం చేద్దాం! ప్రజల హక్కుల పరిరక్షణే మన లక్ష్యం... ప్రజాస్వామ్య పరిరక్షణే మన సంకల్పం... సత్యం కోసం, న్యాయం కోసం ప్రతి ఒక్కరం ఐక్యంగా ముందుకు సాగుదాం.దేశం కోసం -- మోడీ కోసం! ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం -- మన పాదయాత్ర! యువత, ప్రజలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ మహా పాదయాత్రను విజయవంతం చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మహేష్ రాజిరెడ్డి బండ సుకన్య దేవయ్య జిల్లా కార్మిక సెల్ కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ ప్రధాన కార్యదర్శిలు మలేష్ యాదవ్ విగ్నేష్ గౌడ్ నాయకులు దేవేందర్ యాదవ్ గంట అశోక్ పత్తి స్వామి దేవేందర్ గౌడ్ ఆంజనేయులు అన్ని గ్రామాల నాయకులు పాల్గొన్నారు

ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే

మిర్యాలగూడ ప్రతినిధి//నవంబర్ 21:(తెలంగాణ పత్రిక):-

మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో అమలవుతున్న ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అధికారులకు సూచించారు. ఈరోజు మిర్యాలగూడ నియోజకవర్గం లోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కేంద్రాలను జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఐఏఎస్ తో కలిసి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సందర్శించి, నమోదు ప్రక్రియను పరిశీలించారు. మొదట మాడుగులపల్లి మండలం కుక్కడం గ్రామం, గండ్రవాణిగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాలను సందర్శించి, పథకం నమోదు విధానం, ప్రజలకు అందుతున్న సేవలు, నమోదు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దామరచర్ల మండల కేంద్రం





లోని నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డ ప్రాంతంలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే కలిసి పర్యటించి, ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకం ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. అర్హులైన కుటుంబాలన్నీ ఈ పథకంలో నమోదు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడమే ప్రభుత్వ ధ్యేయమని, ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా ప్రతి కుటుంబానికి భద్రత కల్పించడమే లక్ష్యమని తెలిపారు. అర్హులైన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నమోదు చేసుకోవాలని కోరారు. నమోదు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, ఆర్డిఓ రమణారెడ్డి , మున్సిపల్ కమిషనర్ శ్రీజ రెడ్డి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భార్య హత్య కేసులో భర్తకు సహకరించిన తండ్రి, సోదరుడు, స్నేహితుడు అరెస్ట్

-మృతదేహాన్ని పూడ్చిపెట్టి, అనంతరం గోదావరి నదిలో పడవేసిన నిందితులు.

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక నవంబర్ 22

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నెంబర్.205/2026 యు/ఎస్103, 238 ఆర్/డబ్ల్యూ 3(5) బిఎన్ఎస్ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. భార్యను హత్య చేసిన కేసులో ప్రధాన నిందితుడైన బోడా నరేందర్‌కు సహకరించిన అతని తండ్రి బోడా హరిలాల్, సోదరుడు బోడా సురేందర్, స్నేహితుడు మాలోత్ శోభన్‌లను పోలీసులు అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం.. బోడా నరేందర్ 2025 సంవత్సరంలో గంగారపు భవానీని ప్రేమ వివాహం చేసుకున్నాడు. అయితే కులాంతర వివాహం చేసుకున్నాడనే కారణంతో నరేందర్ తండ్రి హరిలాల్, సోదరుడు సురేందర్ ఈ వివాహాన్ని వ్యతిరేకిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో కుటుంబంలో ఏర్పడిన విభేదాల కారణంగా భవానీని వదిలించుకోవాలని నరేందర్‌పై కుటుంబ సభ్యులు ఒత్తిడి తెచ్చినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ క్రమంలో నరేందర్ తన తండ్రి హరిలాల్, సోదరుడు సురేందర్‌తో కలిసి భార్య భవానీని హత్య చేసేందుకు పథకం రూపొందించుకున్నాడు. ఇందులో భాగంగా 03-11-2026 రాత్రి నరేందర్ తన భార్య భవానీని గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం తండ్రి హరిలాల్ సహాయంతో గోలియతండా గ్రామ శివారులోని తమ పత్తి చేనులో గుంత తవ్వి మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. మృతదేహం నుంచి దుర్వాసన రావడంతో విషయం బయటపడుతుందనే భయంతో 04-11-2026న మరో పథకం రచించారు. రాత్రి సమయంలో పూడ్చిపెట్టిన మృతదేహాన్ని బయటకు తీసి, శుభ్రం చేసి దుస్తులు మార్చి, రెండు తెల్లని ప్లాస్టిక్ సంచుల్లో చుట్టి మోటార్ సైకిళ్లపై భద్రాచలం వైపు తరలించారు. ఈ సమయంలో నరేందర్ తన తండ్రి హరిలాల్‌తో కలిసి ఒక మోటార్ సైకిల్‌పై మృతదేహాన్ని తీసుకెళ్లగా, సోదరుడు సురేందర్, స్నేహితుడు మాలోత్ శోభన్ మరో మోటార్ సైకిల్‌పై ముందుగా వెళ్లి పోలీసుల గస్తీ వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తూ ఎస్కార్ట్‌గా వ్యవహరించారు. అనంతరం భద్రాచలం పాత



వంతెన సమీపంలోని గోదావరి నదిలో మృతదేహాన్ని పడవేసి తిరిగి గ్రామానికి చేరుకున్నారు. ఈ క్రమంలో 06-11-2026న భవానీ కనిపించడం లేదని ఆమె అక్క స్వరూప కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం ప్రధాన నిందితుడు నరేందర్ విచారించగా భార్యను హత్య చేసిన విషయాన్ని వెల్లడించాడు. దీంతో అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తదుపరి దర్యాప్తులో భాగంగా సీసీటీవీ ఫుటేజీలు, ఇతర సాంకేతిక ఆధారాలను విశ్లేషించి, నిందితుల పాత్రను పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో పోలీసులకు పట్టుబడకుండా తప్పించుకుని పారిపోయేందుకు ప్రయత్నిస్తున్న బోడా హరిలాల్, బోడా సురేందర్, మాలోత్ శోభన్‌లను ఈరోజు ఉదయం 11:40 గంటలకు లక్ష్మీదేవిపల్లి మండలంలోని 33/11 కె.వి సబ్‌స్టేషన్ సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించి నిందితులను గుర్తించి అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన డీఎస్పీ ఆదినారాయణ, సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సైలు యాయాతి రాజు, రమేష్‌తో పాటు పోలీస్ సిబ్బంది రాజు, మురళి, చిరంజీవిలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అభినందించారు.

మహా పాదయాత్ర గా శబరిమల అయ్యప్ప స్వామి వరకు వెళ్ళి దర్శనం చేసుకుని వచ్చిన



(తెలంగాణ పత్రిక)21/11/26జోగులాంబ గద్వాల్ జిల్లా ప్రతినిధి

9వ వార్డు కౌన్సిలర్ ఎ. శివకు ఘన సన్మానం అయిజ మున్సిపాలిటీ చైర్మన్ సీఎం సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కారం జోగులాంబ గద్వాల జిల్లా, అలంపూర్ నియోజకవర్గం, అయిజ పట్టణానికి చెందిన 9వ వార్డు కౌన్సిలర్ ఎ. శివ 41 రోజుల అయ్యప్ప స్వామి దీక్షలో భాగంగా గత నెల 16వ తేదీ నుంచి ఈ నెల 17వ తేదీ వరకు మహా పాదయాత్ర చేపట్టి కేరళ రాష్ట్రంలోని శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకుని తిరిగి అయిజకు చేరుకున్నారు. ఈ సందర్భంగా అయిజ మున్సిపాలిటీ చైర్మన్ సీఎం సురేష్ ఆధ్వర్యంలో, నేడు తన నివాసంలో కౌన్సిలర్ ఎ. శివ గారికి పూలమాలలు వేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మాల నర్సింహులు , మాజీ వైస్ చైర్మన్ నాగన్న గౌడ్ , బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లికార్జున్ రెడ్డి , కౌన్సిలర్లు తిరుమలేష్ , రజకు , కోఆప్షన్ సభ్యులు మౌల , పార్టీ నాయకులు మేస్త్రి శ్రీను , అశ్వ పెద్దయ్య , పీజీకే రఘు , అశోక్ , వీరేష్ , నరేష్ , మైబు , మహేంద్ర ,తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన అభయ్ రాజు



రాయికల్ మండల సవంబర్ 21(తెలంగాణ పత్రిక):

జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గత మూడు రోజులు గా జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో రాయికల్ మండలంలోని కుమ్మరి పల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కడకుంట్ల అభయ్ రాజ్ ఉపాధ్యాయ విభాగంలో తాను రూపొందించిన "విద్యా మిత్ర" ప్రాజెక్ట్ రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతో జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంగనభట్ల దినేష్, జిల్లా విద్యాధికారి రాము చేతుల మీదుగా బహుమతి మరియు ప్రశంసాపత్రంను అందుకున్నారు. ఈ సందర్భంగా అభయ్ రాజ్ ను మండల విద్యాధికారి రాఘవులు, ప్రధానోపాధ్యాయులు దేవలక్ష్మి, ఉపాధ్యాయులు హరికృష్ణ, ప్రమీల తదితరులు అభినందించారు.

ఒలింపియాడ్ పోటీలలో అర్పపల్లి విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ



సారంగాపూర్, నవంబర్ 21(తెలంగాణ పత్రిక):

జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ నిర్వహించిన టిఈడి ఈడి టాక్ మరియు ఒలింపియాడ్ పోటీలలో అర్పపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా టిఈడి ఈడి టాక్ విజేతలు అయేషా మోతుకు రిషిక ఒలింపియాడ్ విజేతలు కొండ శృతిలయ నేతునూరి దీపిక లను గైడ్ టీచర్ నాయిని రాజనర్సయ్య సారంగాపూర్ ఎస్సై గీత అర్పపల్లి సర్పంచ్ సొల్లు సురేందర్ ఉప సర్పంచ్ కొండ మురళి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోతె అచ్యుత రెడ్డి ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎస్సై గీత మాట్లాడతూ ప్రభుత్వం ఇస్తున్న అవకాశాలను చక్కగా వినియోగించుకుంటూ బాలికలు అన్ని రంగాల్లో గొప్ప స్థాయికి ఎదుగాలని ఆకాంక్షించారు. సర్పంచ్ సొల్లు సురేందర్ మాట్లాడుతూ అర్పపల్లి ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక పాఠశాలలు ప్రైవేట్ కు ధీటుగా పని చేస్తున్నాయని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి మంచి పేరు ప్రఖ్యాతలు పెంపొందించాలని ఆకాంక్షించారు.

తెలంగాణ పత్రిక TELANGANA PATRIKA TELUGU DAILY తెలుగు దిన పత్రిక

అజ్మతుల్లా హుస్సేనీ శుభాకాంక్షలు తెలిపిన మహమ్మద్ సిరాజ్

(తెలంగాణపత్రిక)21/11/26జోగుళాంబ గద్వాల్ జిల్లా ప్రతినిధి



ఏఐసీసీ సెక్రటరీగా, కర్ణాటక రాష్ట్ర ఇన్‌ఛార్జ్‌గా నియమితులైన వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ జోగులాంబ గద్వాల జిల్లా డీసీసీ జనరల్ సెక్రటరీ మహమ్మద్ సిరాజ్ కలిసి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అజ్మతుల్లా హుస్సేనీ కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని, కర్ణాటక రాష్ట్రంలో పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేయాలని ఆకాంక్షించారు. అజ్మతుల్లా హుస్సేనీ గారికి ఈ కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆయన రాజకీయ ప్రస్థానం మరింత విజయవంతం కావాలని మహమ్మద్ సిరాజ్ ఆకాంక్షించారు.

అప్పుల బాధ భరించలేక ఒకరి ఆత్మహత్య



ముధోల్: 21నవంబర్(తెలంగాణ పత్రిక)

అప్పుల బాధ భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ముధోల్ మండలంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై బిట్ల పెర్సిస్ తెలిపిన వివరాలు ప్రకారం ముధోల్ మండలంలోని వడ్తాల్ గ్రామానికి చెందిన గాజుల పండరి (42) అనే వ్యక్తి ఇటీవల నూతన ట్రాక్టర్ తోపాటు పరికరాలను కొనుగోలు చేసాడు. దీంతో అప్పుల బాధ ఎక్కువగా కావడంతో శనివారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి నలుగురు కుమార్తెలు ఉన్నారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఉచిత షుగర్, బీపీ పరీక్షలు



రాయికల్ మండల నవంబర్ 21(తెలంగాణ పత్రిక):

రాయికల్ పట్టణంలోని వీరాపూర్ రోడ్డులో లయన్స్ క్లబ్ ఆఫ్ రాయికల్ ఆధ్వర్యంలో ఉచిత మధుమేహం (షుగర్), బీపీ పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ఇంటింటికీ వెళ్లి 35 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వాసం ప్రసాద్, సామర్ల సత్యనారాయణ, సంకోజి అశోక్ ల్యాబ్ టెక్నీషియన్ మోసారపు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కాలుజారి పాలంలో పడి యువకుడి మృతి

గంభీరావుపేట తెలంగాణ పత్రిక నవంబర్ 21



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోనీ కడారి లక్ష్మీ(65) భర్త విజయ రాములు (మాల) దోసెలగూడెం కాలనీకి చెందిన వృద్ధురాలు తన చిన్న కుమారుడు కడారి సురేష్(30) కూలి పనిచేసుకొని జీవించేవాడు, తనకు వివాహం చేయగా ఇద్దరు పిల్లల సంతానమైనారు తన భార్యతో సంసారం విషయంలో గొడవలు జరుగగా రెండు సంవత్సరాలు క్రితం వేరే ప్రాంతంలో పిల్లలతో సహా నా కోడలు ఉంటుంది అప్పటి నుండి నాకొడుకు మద్యం కు బానిస అయి గ్రామంలో తిరుగుతుండేవాడు తనకు ఫిట్స్ కూడా వస్తుంది శనివారం రోజున ఉదయం 10:30 నిమిషాలకు మా గ్రామస్తుడైన దండు చంద్రం తండ్రి బాలరాజు అను అతను నాకు ఫోన్ చేసి తన వ్యవసాయ పొలంలో నా చిన్న కొడుకు కడారి సురేష్ బోర్లా పడి చనిపోయి ఉన్నాడు అని తెలుపగా నేను వెంటనే దండు చంద్ర పొలం వద్దకు పోయి చూడగా బురద నీటిలో బోర్లా పడి ఊపిరి ఆడక చనిపోయి ఉన్నాడు గత కొంతకాలంగా నా చిన్న కొడుకు కడారి సురేష్ మద్యం తాగడానికి అలవాటు పడి మద్యం మత్తులో నడుస్తూ రాగా ఫిట్స్ వచ్చి కాలుజారి ప్రమాదవశాత్తు పొలంలో పడి బురద నీటిలో ఊపిరి ఆడక చనిపోయినాడు. నా కొడుకు మరణం పై ఎవరిపై ఎలాంటి అనుమానం లేదని మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై ఆర్ బాలరాజు తెలిపారు.

విశ్వనగర విస్తరణ నుంచి గ్లోబల్ టెక్ పీఠం దాకా..

తెలంగాణ ప్రగతి రథం పరుగులు తీయించిన కేటీఆర్ శకం





తెలంగాణ పత్రిక విశ్లేషణాత్మకమైన స్పెషల్ స్టోరీ

దార్శనికత, వేగం, పారదర్శకతతో ఒక దశాబ్ద కాలంలో తెలంగాణ పారిశ్రామిక, ఐటీ ముఖచిత్రాన్ని మార్చిన కేటీఆర్ పరిపాలనా దక్షతపై ప్రత్యేక విశ్లేషణ భారతదేశ రాజకీయాల్లో సంప్రదాయ పంథాను దాటి, కార్పొరేట్ స్థాయి దక్షతను, ఆధునిక సాంకేతిక దార్శనికతను పరిపాలనకు జోడించిన అతికొద్ది మంది నాయకుల్లో కల్వకుంట్ల తారక రామారావు అగ్రగణ్యులు. నవతెలంగాణ ఆవిర్భవించినప్పుడు రాష్ట్ర పారిశ్రామిక, ఐటీ రంగాల భవిష్యత్తుపై ఎన్నో సందేహాలు ఉండేవి. కానీ, కేటీఆర్ నాయకత్వంలో కేవలం ఒక దశాబ్ద కాలంలోనే హైదరాబాద్ ప్రపంచ టెక్ దిగ్గజాలకు చిరునామాగా మారడమే కాకుండా, తెలంగాణ దేశానికే ఆర్థిక గ్రోత్ ఇంజన్‌గా అవతరించింది.ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా కేటీఆర్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత హైదరాబాద్ రూపురేఖలే మారిపోయాయి. రాష్ట్ర ఏర్పాటైన తొలినాళ్లలో యాభై ఏడు వేల కోట్ల రూపాయలుగా ఉన్న తెలంగాణ ఐటీ ఎగుమతులు, తొమ్మిదేళ్ల కాలంలోనే రెండు లక్షల నలభై ఒక్క వేల కోట్ల రూపాయలకు చేరడం ఒక చారిత్రక రికార్డు. ఉద్యోగాల కల్పనలోనూ మూడు లక్షల ఇరవై మూడు వేల నుంచి తొమ్మిది లక్షల ఐదు వేలకు పైగా ఐటీ ఉద్యోగుల సంఖ్య పెరగడం ఆయన దూరదృష్టికి నిదర్శనం. అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్, ఆపిల్, మెటా వంటి ప్రపంచ అగ్రగామి టెక్ కంపెనీలు అమెరికా వెలుపల తమ అతిపెద్ద క్యాంపస్‌లను హైదరాబాద్‌లోనే ఏర్పాటు చేశాయి. ఆవిష్కరణలకు ఊతమిచ్చేలా నిర్మించిన టీ హబ్ ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్‌గా గుర్తింపు పొందింది. దీనికి తోడు వీ హబ్ మహిళా పారిశ్రామికవేత్తలకు, టీ వర్క్స్ నూతన ఆవిష్కరణల రంగానికి కొత్త ఊపిరి పోశాయి. పరిశ్రమల స్థాపన అంటే నెలల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాలనే పాత విధానానికి కేటీఆర్ స్వస్తి పలికారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా స్వీయ ధృవీకరణ ఆధారంగా కేవలం పదిహేను రోజుల్లోనే అనుమతులు ఇచ్చే టీఎస్ ఐపాస్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేశారు. దీని ఫలితంగా రెండున్నర లక్షల కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు రాష్ట్రానికి తరలివచ్చాయి. ఫార్మా, ఏరోస్పేస్, ఎలక్ట్రిక్ వాహనాలు, టెక్స్‌టైల్స్ రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా నిలిచింది. ప్రపంచ వ్యాక్సిన్ రాజధానిగా హైదరాబాద్ ఖ్యాతి మరింత పెరిగింది. విశ్వనగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడంలో పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా కేటీఆర్ ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తట్టుకునేందుకు వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం కింద ముప్పై ఐదుకు పైగా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, కేబుల్ బ్రిడ్జిలను రికార్డు సమయంలో పూర్తి చేయించారు. దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి నేడు హైదరాబాద్ ఆధునికతకు చిహ్నంగా నిలిచింది. చెరువుల సుందరీకరణ, హరితహారం ద్వారా పచ్చదనం పెంపు, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఒకవైపు దావోస్ వంటి అంతర్జాతీయ వేదికలపై అనర్గళమైన ఆంగ్లంలో తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను విశ్వవ్యాప్తం చేస్తూనే, మరోవైపు తన సొంత నియోజకవర్గం సిరిసిల్లను ఆదర్శవంతంగా తీర్చిదిద్దారు. ఆత్మహత్యలకు నిలయంగా ఉన్న సిరిసిల్ల నేతన్నల జీవితాల్లో బతుకమ్మ చీరల ఆర్డర్లు, టెక్స్‌టైల్ పార్కుల ద్వారా వెలుగులు నింపారు. సామాజిక మాధ్యమాల వేదికగా సామాన్యుల కష్టాలకు తక్షణమే స్పందించి ఆదుకునే గుణం ఆయన్ను యువతకు, సామాన్య ప్రజలకు మరింత చేరువ చేసింది. పరిపాలనలో వేగం, పాలసీల్లో స్పష్టత, పెట్టుబడిదారుల్లో నమ్మకం కలిగించడం ద్వారా కేటీఆర్ తెలంగాణ అభివృద్ధికి ఒక బలమైన పునాది వేశారు. ప్రాంతీయ పార్టీ నాయకుడైనప్పటికీ, జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో ఒక ఆధునిక పాలకుడిగా, తెలంగాణ ప్రగతి రథసారథిగా ఆయన చెరగని ముద్ర వేశారు.

సందడిగా సాగిన 27వ అఖిల భారత పోలీస్ బ్యాండ్ పోటీలు

హైదరాబాద్ వేదికగా కేంద్ర రిజర్వ్ పోలీస్ బలగం (సీఆర్‌పీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన 27వ అఖిల భారత పోలీస్ బ్యాండ్ పోటీలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఈ నెల 16న ప్రారంభమైన ఈ వేడుకలు ఐదు రోజులపాటు ఎంతో సందడిగా సాగాయి. దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, కేంద్ర సాయుధ పోలీస్ బలగాలకు చెందిన సుమారు 30 బ్యాండ్ బృందాలు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నాయి.

ఆకట్టుకున్న ప్రదర్శనలు.. మహిళా బ్యాగ్లర్ల భాగస్వామ్యం:

తొలుత ఈ పోటీలను డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు. పోలీస్, మార్షల్ బ్యాండ్ సంప్రదాయానికి శతాబ్దాల ఘన చరిత్ర ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది తొలిసారిగా మహిళా బ్యాగ్లర్లు పోటీల్లో పాల్గొనడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. పోటీల్లో భాగంగా నగరంలోని శిల్పారామం, లుంబినీ పార్కుల్లో నిర్వహించిన ప్రత్యేక బ్యాండ్ ప్రదర్శనలను ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆసక్తిగా తిలకించారు.

'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' స్ఫూర్తికి నిదర్శనం బండి సంజయ్

ముగింపు వేడుకలకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలను, పాల్గొన్న బృందాలను అభినందించారు. హిమాలయాల నుంచి కన్యాకుమారి వరకు, ఈశాన్య ప్రాంతాల నుంచి పశ్చిమ సరిహద్దుల వరకు దేశం నలుమూలల నుంచి వచ్చిన బృందాలు అద్భుత ప్రదర్శన కనబరిచాయని ప్రశంసించారు. బృందాల ప్రతిభ, క్రమశిక్షణ, అంకితభావం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు. ఈ వేడుక కేవలం పోటీల ముగింపు మాత్రమే కాదని, నెలల తరబడి బృందాలు చేసిన కఠోర సాధనకు నిదర్శనమని అన్నారు.

సైనిక, పోలీస్ బ్యాండ్ల పాత్ర కీలకం

పూర్వకాలంలో యుద్ధరంగంలో దప్పులు, బ్యూగిల్ ధ్వనులు సైనిక దళాలకు దిశానిర్దేశం చేస్తూ వారిలో ధైర్యాన్ని, ఉత్సాహాన్ని నింపేవని కేంద్ర మంత్రి గుర్తు చేశారు. నేటికీ అమరవీరులకు నివాళులర్పించే కార్య క్రమాల్లో, గణతంత్ర దినోత్సవ పరేడ్‌లలో పోలీస్, సైనిక బ్యాండ్ల పాత్ర ఎంతో కీలకమని వివరించారు. పోటీలను అత్యంత విజయవంతంగా నిర్వహించిన సీఆర్‌పీఎఫ్ అధికారులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇలాంటి జాతీయ స్థాయి కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని, 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' స్ఫూర్తికి ఈ వేడుకలు నిదర్శనమని బండి సంజయ్ పేర్కొన్నారు.

రేవంత్‌రెడ్డి ఉద్యమంలో పాల్గొన్న వ్యక్తి కాదు ఎంపీ అర్వింద్

వచ్చే నెలలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్నారని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ వెల్లడించారు. ఆయన పర్యటనలో భాగంగా జిల్లాలో మహా పాదయాత్రతో పాటు భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపీ అర్వింద్ మాట్లాడారు.

పాదయాత్ర వాయిదా, అమిత్ షా పర్యటన

'ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం.. అరాచకత్వాన్ని పాతరేద్దాం' అనే నినాదంతో బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఈ నెల 23న నిజామాబాద్‌లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పాల్గొనాల్సిన మహా పాదయాత్రను పార్టీ అనివార్య కారణాల వల్ల రద్దు చేసింది. ఆ కార్యక్రమాన్ని డిసెంబర్‌కు మార్చడంతో పాటు, స్వయంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరుకానుండటం



రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరుపై ఎంపీ అర్వింద్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రేవంత్‌రెడ్డి ఏనాడూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వ్యక్తి కాదని ఆయన ఆరోపించారు. కనీసం 'జై తెలంగాణ' అని నినదించేందుకు కూడా రేవంత్ ముందుకు రాలేదని విమర్శించారు. స్వరాష్ట్ర ఉద్యమంతో ఏమాత్రం సంబంధం లేనివారు నేడు తెలంగాణ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.

కార్యకర్తలకు పిలుపు:

డిసెంబర్‌లో జరగనున్న అమిత్ షా పర్యటనను, మహా పాదయాత్రను విజయవంతం చేసేందుకు బీజేపీ శ్రేణులు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని అర్వింద్ పిలుపునిచ్చారు. పర్యటన తేదీ, బహిరంగ సభ వేదిక వివరాలను పార్టీ త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తుందని ఆయన స్పష్టం చేశారు...

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143

అర్హులైన ఓటర్లెవరూ ఓటు హక్కును కోల్పోకుండా చర్యలు తీసుకోవాలి

-షిఫ్టెడ్, ఆబ్సెంట్ ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించాలి

-రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

కామారెడ్డి ,నవంబర్ 21, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)





అర్హులైన ఓటర్లెవరూ ఓటు హక్కును కోల్పోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, సహాయ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులతో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా కలెక్టరేట్ నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, షిఫ్టెడ్ (నివాసం మారిన), ఆబ్సెంట్ (అందుబాటులో లేని) ఓటర్ల విషయంలో బూత్ స్థాయి అధికారులు ఎన్యుమరేషన్ ఫారాలతో పాటు మరోసారి క్షేత్రస్థాయిలో పర్యటించి సంబంధిత ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. అర్హులైన ఓటర్లు ఎవరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటు హక్కు పునరుద్ధరణకు లభించిన అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా రాజకీయ పార్టీలు, మీడియా, బూత్ స్థాయి ఏజెంట్లు, బూత్ స్థాయి అధికారుల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ఇప్పటికే ప్రచారం నిర్వహించినప్పటికీ దరఖాస్తు చేసుకోకుండా మిగిలిపోయిన అర్హులైన ఓటర్లను గుర్తించి, వారికి మరోసారి అవగాహన కల్పించాలని సూచించారు. ఎ.ఎన్.డి.డి. జాబితాలో పేర్లు ఉన్నప్పటికీ నివాసం మారని ఓటర్లు నివాస ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని, నివాసం మారిన వారు మాత్రం ఎన్యుమరేషన్ ఫారంతో పాటు అనుబంధం-సి సమర్పించాలని వివరించారు. ఈ ప్రక్రియపై సహాయ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, బూత్ స్థాయి అధికారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి, ఎన్నికల విభాగం అధికారి రాజేశ్వర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఏడుపాయల్లో అంగరంగ వైభవంగా కార్తీక ఆకాశ దీపోత్సవం

పాపన్నపేట,నవంబర్ 21:(తెలంగాణ పత్రిక)



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ ఏడుపాయల వనదుర్గామాత ఆలయం కార్తీక మాసం సందర్భంగా నిత్యం దీప కాంతులతో విరాజిల్లుతోంది.కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శనివారం రోజు రాత్రి ఆలయ ప్రాంగణంలో ఆకాశ దీపోత్సవ వేడుకలను ఆలయ పూజారులు పార్థివ శర్మ, శంకర్ శర్మలు అత్యంత సుందరంగా ముస్తాబు చేసారు. మంజీరా నదీ తీరాన వెలిసిన అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన ఈదీపోత్సవ వేడుకలకు పరిసర ప్రాంతాల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణమంతా ప్రమిదల వెలుగులతో దేదీప్యమానంగా మెరిసిపోయింది.మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో మట్టి ప్రమిదలను వెలిగించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, భక్తులు దుర్గా నామ స్మరణతో""జై దుర్గా మాతకు జై"అంటూ ఉస్తాహంలో పాల్గొన్నారు. దుర్గా నామస్మరణతో ఏడుపాయల ప్రాంతమంతా మార్మోగింది. ఆలయ గోపురం వద్ద ప్రత్యేక ధ్వజస్తంభానికి అర్చకులు ఆకాశ దీపాన్ని శాస్త్రోక్తంగా వెలిగించి పైకి ఎగురవేశారు. లోకకల్యాణం,ప్రజల సుఖశాంతుల కోసం ఈ దీపాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆకాశంలో ఎగసిన ఈదీప కాంతులను చూసి భక్తులు భక్తిభావంతో పరవశించి పోయారు.ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్,ప్రతాప్ రెడ్డి,పల్లె సాయిబాబా, మధుసూదన్ రెడ్డి, ఆలయ అర్చకులు, ఆయా ప్రాంతాల్లో నుండి వచ్చిన భక్తులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణంలో ఘనంగా జీఐఎస్ డే వేడుకలు

-జియో క్లబ్ ప్రారంభం

కామారెడ్డి, నవంబర్ 21, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణంలోని జియోఇన్ఫర్మేటిక్స్ విభాగం ఆధ్వర్యంలో జీఐఎస్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జియోఇన్ఫర్మేటిక్స్ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, వారికి నూతన అవకాశాలు, సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన మరియు నైపుణ్యాభివృద్ధికి వేదికగా నిలిచే సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. సుధాకర్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో జియోఇన్ఫర్మేషన్ టెక్నాలజీ గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు, వ్యవసాయం, పట్టణ ప్రణాళిక, పర్యావరణం, విపత్తుల నిర్వహణ తదితర అన్ని రంగాల్లో విస్తృతంగా వినియోగంలో ఉందని తెలిపారు. విద్యార్థులు ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని భవిష్యత్తులో మంచి అవకాశాలను సాధించాలని సూచించారు. జియోఇన్ఫర్మేటిక్స్ విభాగాధిపతి డాక్టర్ డి. సబిత మాట్లాడుతూ, ఈ సంవత్సరం జీఐఎస్ డే ముఖ్య ఇతివృత్తం అని తెలిపారు. భౌగోళిక సమాచార వ్యవస్థలు సమాజ అభివృద్ధికి, నూతన ఆవిష్కరణలకు మరియు వివిధ సమస్యల పరిష్కారానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ టి ప్రతిజ్ఞ మిషన్ కాకతీయ లో తెలంగాణ చెరువుల విశ్లేషణ అంశంపై జీఐఎస్ టెక్నాలజీని ఏ విధంగా వాడారో వివరించారు, డాక్టర్.ఎస్ నారాయణ గుప్తా ఇండియన్ నాలెడ్జ్ సిస్టం లో భూగోళ శాస్త్రవేత్తల పాత్రను వివరించారు విద్యార్థులు అధ్యాపకులు జీఐఎస్, రిమోట్ సెన్సింగ్, జియోస్పేషియల్ టెక్నాలజీ తదితర అంశాలపై వివిధ ప్రజెంటేషన్లు నిర్వహించి తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి. ప్రతిజ్ఞ, డాక్టర్ ఎస్. నారాయణ గుప్తా, జియోఇన్ఫర్మేటిక్స్ విభాగ అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజనుల ఆత్మగౌరవం పై దాడికి నిరసనగా గిరిజన నాయకుల ధర్నా

-దాడికి పాల్పడ్డ కాంగ్రెస్ గుండాల పై ఎస్సీ ఎస్ టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

-గిరిజన సర్పంచ్ బానోత్ మహేందర్ నాయక్ పై జరిగిన భౌతిక దాడిని తీవ్రంగా ఖండించిన ఎల్ హెచ్ పి ఎస్, జి వి ఎస్, బిహెచ్పిఎస్ సంఘాలు

పాలకుర్తి,నవంబర్ 21(తెలంగాణ పత్రిక):



తెలంగాణ రాష్ట్ర గిరిజన సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు, గిరిజన సర్పంచ్ బానోత్ మహేందర్ నాయక్‌పై జరిగిన భౌతిక, లౌకిక దాడిని లంబాడా హక్కుల పోరాట సమితి, బంజారా హక్కుల పోరాట సమితి , గిరిజన విద్యార్థి సంఘం తీవ్రంగా ఖండించాయి.ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధులకు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు, ప్రజా సమస్యలపై ప్రశ్నించే హక్కు రాజ్యాంగం కల్పించింది. అలాంటి ప్రజాప్రతినిధిపై భౌతిక దాడికి పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. ముఖ్యంగా ఒక గిరిజన ప్రజాప్రతినిధిపై ఇలాంటి దాడి జరగడం ఆందోళనకరమైన విషయం. ఈ దాడికి స్థానిక ఎమ్మెల్యే ప్రోత్సాహశీ పై సమగ్ర విచారణ జరిపి, ఎమ్మెల్యే యశిశ్విని రెడ్డి పై, తన అనుచర గుండాల పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గిరిజన ప్రజాప్రతినిధుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఇలాంటి ఘటనలను సహించేది లేదని, బాధితుడికి న్యాయం జరిగే వరకు చట్టబద్ధమైన ప్రజాస్వామ్య మార్గాల్లో పోరాటం కొనసాగిస్తామని సంఘాల నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఆంగోత్ రాజ్ కుమార్ నాయక్,గిరిజన విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు వెంకట్ బంజారా నాయక్, బంజారా హక్కుల పోరాట సమితి కార్యనిర్వాహక అధ్యక్షులు వెంకట్ నాయక్ రాథోడ్, లంబాడా హక్కుల పోరాట సమితి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పున్నీ బాయి, గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు భాస్కర్ నాయక్, లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు నాయక్, జిల్లా నాయకులు జాటోత్ రాహుల్ నాయక్ , గిరిజన జిల్లా నాయకులు మాజీ ఎంపీటీసీ లావుడ్య దేవేందర్ నాయక్, ఎస్టీ సెల్ అధ్యక్షులు ధరావత్ యాకూబ్ నాయక్ ,, బుక్యా సురేష్ నాయక్ , జహీందర్ నాయక్, , మాజీ సర్పంచ్ బానోతు మహేందర్ నాయక్, బానోత్ రవీందర్ నాయక్, బానోత్ రమేష్ నాయక్ , బోడ రాజు నాయక్, సురేష్ నాయక్, నరేష్ నాయక్, బుక్య అంజన్న నాయక్, లావిడియా రవీందర్ నాయక్, లకావత్ మోతిలాల్ నాయక్, బోడా దేవోజి నాయక్ తదితరులు పాల్గొన్నారు

9 ఎన్ డి పి ఎస్ కేసుల్లో పట్టుబడిన మత్తు పదార్థాల ధ్వంసం

కామారెడ్డి ,నవంబర్ 21,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లాలో 9 ఎన్ డి పి ఎస్కేసుల్లో స్వాధీనం చేసుకున్న 402.184 కిలోల గంజాయి, 83 గంజాయి మొక్కలు, 286 గ్రాముల ఆల్ప్రాజోలం, 40 గ్రాముల క్లోరల్ హైడ్రేట్‌ను పోలీసులు ధ్వంసం చేశారు. నిజామాబాద్ జిల్లా పడకల్‌లోని శ్రీ మెడికేర్ సర్వీసెస్‌లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం శాస్త్రీయ పద్ధతిలో నిర్వీర్యం చేసినట్లు ఎస్పీ రాజేష్ తెలిపారు. డ్రగ్స్ అక్రమ రవాణాపై నిఘా కొనసాగుతుందని హెచ్చరించారు.

కార్మికులను సంఘటితం చేస్తూ బిజెపి పార్టీని బలోపేతం చేయాలి

-బీజేపీ కార్మిక విభాగం జిల్లా కన్వీనర్ విజయ్ కుమార్

-మల్యాల మండలంలో గ్రామ కన్వీనర్ల నియామకం



జగిత్యాల, నవంబర్ 21 (తెలంగాణ పత్రిక):

కార్మికులను సంఘటీతం చేస్తూ భారతీయ జనతా పార్టీని బలోపేతం చేస్తానని బీజేపీ కార్మిక విభాగం జగిత్యాల జిల్లా కన్వీనర్ కట్ట విజయ్ కుమార్ అన్నారు. భారతీయ జనతా పార్టీ కార్మిక విభాగం ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో అధ్యక్షుడు గాజుల మల్లేశం ఆధ్వర్యంలో బీజేపీ మల్యాల మండల కన్వీనర్‌గా గంగిశెట్టి రాజేశం ను నియమించామని విజయ్ కుమార్ తెలిపారు. రామన్నపేట గ్రామ కన్వీనర్‌గా కోరేపు మల్లేశం మద్దుట్ల గ్రామ కన్వీనర్‌గా బొమ్మల సురేష్ రాంపురం గ్రామ కన్వీనర్‌గా ఎద్మలపల్లి హరీష్ గొల్లపల్లి గ్రామ కన్వీనర్‌గా గడ్డం మల్లేశం నియమించినట్లు కట్టా విజయ్ కుమార్ కో-కన్వీనర్ బండారి ప్రభాకర్ తెలిపారు. మండల గ్రామ కన్వీనర్లు గ్రామాల్లోని బీడీ కార్మికులు భవన నిర్మాణ కార్మికులు పారిశుద్ధ్య కార్మికులు ఉపాధి హామీ కూలీలను సంఘటితం చేస్తూ పార్టీని బలోపేతం చేయాలని కోరారు.

యూసుఫ్‌గూడాలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం



హైదరాబాద్, నవంబర్ 21 (జూబ్లీహిల్స్ తెలంగాణ పత్రిక):



జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకంలో తమ పేర్లను నమోదు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల వరకు జీవిత బీమా కల్పించి, నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు డీసీ సురేష్ కుమార్, అరుణ్ కుమార్, నివాస్, ఐశ్వర్యతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

భూముల లీసర్వే ప్రక్రియపై క్షేత్రస్థాయిలో పరిశీలనలో పాల్గొన్న సర్పంచ్ సునీల్

పోతంగల్ తెలంగాణ పత్రిక సవంబర్ 21.



హుమ్నాపూర్ గ్రామ శివారులో భూముల రీసర్వే పోతంగల్ మండలంలోని కారేగాం గ్రామంలో ఉన్న హుమ్నాపూర్ గ్రామ శివారులో భూముల రీసర్వే ప్రక్రియకు సంబంధించి పూర్తి వివరాలను సేకరించే పనులు చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామ పరిధిలోని వ్యవసాయ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ భూముల సరిహద్దులు, విస్తీర్ణం, సర్వే నంబర్లు, భూ రికార్డుల వివరాలను తహసిల్దార్ సందీప్ తోపాటు కారేగాం గ్రామ సర్పంచ్ నరహరి సునీల్ పరిశీలించారు.రీసర్వే ద్వారా భూముల హద్దులను స్పష్టంగా గుర్తించి, ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న వివరాలతో క్షేత్రస్థాయిలోని భూముల వివరాలను సరిపోల్చనున్నారనీ తహసిల్దార్ సందీప్ రైతులకు తెలిపారు. భూ యజమానులకు భవిష్యత్తులో భూ సరిహద్దుల వివాదాలు, విస్తీర్ణంలో తేడాలు, రికార్డుల సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. రీసర్వే సమయంలో రైతులు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలు, ఇతర భూ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు. సర్వే సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టే సమయంలో రైతులు సహకరించాలని కోరుతున్నారు. భూముల రీసర్వే ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ నరహరి సునీల్ కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సందీప్ సర్వేర్ పోశెట్టి జిపిఓలు నరేష్ పోశెట్టి కార్యాలయ రికార్డ్ అసిస్టెంట్ ఆనంద్ గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తొర్రూరులో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ వేడుకలు



పాలకుర్తి తొర్రూర్ తెలంగాణ పత్రిక ప్రతినిధి పున్నం సారయ్య

తొర్రూరు పట్టణంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మహాసభ మండల ప్రధాన కార్యదర్శి పులుగుజ్జ మహేష్ పాల్గొని జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది సంఘం నాయకులు, మత్స్యకారులు కలిసి దినోత్సవ వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. సమాజానికి మత్స్యకారులు అందిస్తున్న సేవలు మరువలేనివని పేర్కొన్నారు. మత్స్యకారుల హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ముదిరాజులను బిసి-డి నుంచి బీసీ ఏలకు మార్చాలని డిమాండ్ చేశారు రాజకీయంగా కూడా ముదిరాజులకి ప్రత్యేక స్థానం కల్పించాలని కోరారు 50 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్క ముదిరాజ్ బిడ్డకి పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నాయకులు అమ్మపురం మాజీ ఎంపిటిసి కొత్తూరు బ్రహ్మయ్య, దంతాలపల్లి మండల ప్రధాన కార్యదర్శి సాదు రాములు, యూత్ నాయకులు కాగు నవీన్,పూర్ణచంధర్,దిలీప్, సాదు సుమన్, వినోద్, అల్లి మహేష్,నాయకులు, సభ్యులు, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సిమెంటు అందజేత



కల్వకుర్తి నవంబర్ 21 తెలంగాణ పత్రిక

తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామానికి చెందిన బోయ రవి ఇంటి ఫినిషింగ్ కోసం అవసరమైన సిమెంట్‌ను ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందజేశారు. బి ఆర్ ఎస్ పార్టీ.రాష్ట్ర నాయకులు, మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ బోయ రవి కుటుంబానికి సిమెంట్ అందించి తన సేవా గుణాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా బోయ రవి కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మాజీ ఎంపీపీ సి.ఎల్. శ్రీనివాస్ యాదవ్, గ్రామ సర్పంచ్ వానరాసి రాములమ్మ వెంకటేష్, ఉప సర్పంచ్ శివ విజయలక్ష్మి, విజయ్ కుమార్, వార్డు సభ్యులు భాస్కర్, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ బీమా పథకానికి దరఖాస్తులు స్వీకరణ ప్రారంభం

-బాధిత కుటుంబానికి 5 లక్షల బీమా



మందమర్రి మండలం (రామకృష్ణాపూర్): తెలంగాణ పత్రిక

పేదల కుటుంబానికి ఎంతగానో ఉపయోగపడే ప్రభుత్వ బీమా పథకమైన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం జిల్లాలోని నస్పూర్ మండలంలో కలెక్టర్ కుమార్ దీపక్ అలాగే క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని అమరవాది గ్రామంలో కమిషనర్ మురళీకృష్ణ తో కలిసి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. ఈ పథకం ద్వారా కుటుంబంలోని 18 నుండి 59 సంవత్సరాల వరకు వయసు ఉన్న వ్యక్తి బీమా వ్యక్తిగా ప్రతిపాదించబడతారని ప్రమాదవశాత్తు సదరు వ్యక్తి చనిపోయినట్లయితే కుటుంబానికి ఐదు లక్షల బీమా వర్తిస్తుందని ఈ సదవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్వీకరించిన దరఖాస్తుల వివరాలను ఆన్ లైన్ పోర్టల్ లో స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు.

చివరి పంట తడిచేవరకు సీతారామ జలాలు

-రైతుల అభ్యర్థనపై స్పందించిన
-వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
-వైరా, ఏన్కూరు, అన్నపురెడ్డిపల్లి, రామచంద్రపురం మేజర్ కాలువలకు గోదావరి జలాలు ఆదివారం నాటికి కాలువలకు సాగర్ జలాలు చేరుకుంటాయి

ఖమ్మం జిల్లా ప్రతినిధి నవంబర్ 21 (తెలంగాణ పత్రిక)

పంటలు ఎండిపోకుండా చివరి తడి అందించి ఆదుకోవాలంటూ రైతులు చేసిన విజ్ఞప్తిపై రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తక్షణమే స్పందించారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను విడుదల చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు అధికారులు సాగు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం పంటలు కీలక దశలో ఉన్నాయని, చివరి తడి అందకపోతే దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుందని రైతులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సాగునీటి అవసరాన్ని వివరించి, వెంటనే నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. రైతుల విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించిన మంత్రి తుమ్మల అధికారులతో మాట్లాడి నీటి



విడుదలకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. వైరా, ఏన్కూరు, అన్నపురెడ్డిపల్లి, రామచంద్రపురం మేజర్ కాలువలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను అధికారులు విడుదల చేశారు. విడుదల



చేసిన నీరు ఆదివారం నాటికి మేజర్ కాలువలకు చేరుకోనుంది. తద్వారా ఆయా కాలువల పరిధిలోని పంటలకు చివరి తడి అందే అవకాశం ఏర్పడింది. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని విడుదల చేసిన గోదావరి జలాలను కేవలం పంటల సాగు అవసరాలకే వినియోగించుకోవాలని మంత్రి తుమ్మల సూచించారు. నీటిని వృథా చేయకుండా పొలాలకు అందేలా రైతులు సహకరించాలని కోరారు. చివరి తడి అందించడం ద్వారా పంటలను కాపాడి రైతులకు నష్టం వాటిల్లకుండా చూడాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. రైతుల విజ్ఞప్తికి వెంటనే స్పందించి సాగునీరు విడుదల చేయించిన మంత్రి నిర్ణయంపై ఆయా ప్రాంతాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం



- ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్

కామారెడ్డి ,నవంబర్ 21, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

రైతులకు మెరుగైన సేవలందిస్తూ సహకార సంఘాలను బలోపేతం చేయాలి అని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు శనివారం బిక్కనూరు మండల కేంద్రంలోనూతన చైర్మన్ రాజబాబు గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపిన షబ్బీర్ అలీ కామారెడ్డి నియోజకవర్గంలోని బిక్కనూర్ మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరై నూతన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నూతన వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా రాజబాబు గౌడ్ ప్రమాణ స్వీకారం చేయగా, పాలకవర్గ సభ్యులు సైతం తమ బాధ్యతలను స్వీకరించారు. అనంతరం చైర్మన్ రాజబాబు గౌడ్‌తో పాటు నూతన పాలకవర్గ సభ్యులను షబ్బీర్ అలీ శాలువాలతో సత్కరించి అభినందించారు.

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ప్రాధాన్యత

ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ గారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. రైతులు ఆర్థికంగా బలోపేతం అయినప్పుడే గ్రామీణ ప్రాంతాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. రైతులకు పంట రుణాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు తదితర అవసరాలను సకాలంలో అందించడంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలు కేవలం రుణాల పంపిణీకే పరిమితం కాకుండా రైతులకు వ్యవసాయానికి సంబంధించిన అన్ని రకాల సేవలను అందించే సమగ్ర సేవా కేంద్రాలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, పంట రుణమాఫీ, ఉచిత విద్యుత్, రైతు బీమా వంటి పథకాలతో పాటు సాగునీటి వనరుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతోందని వివరించారు. వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించి, రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.



రైతుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి

బిక్కనూర్ వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్మన్ రాజబాబు గౌడ్‌ను ప్రత్యేకంగా అభినందించిన షబ్బీర్ అలీ.. రైతులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి రైతుకు సమాన ప్రాధాన్యతనిస్తూ సేవలందించాలని, సహకార సంఘం అభివృద్ధికి చైర్మన్‌తో పాటు పాలకవర్గ సభ్యులంతా సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంత రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సామగ్రి సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు చిన్నచిన్న అవసరాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా, వారి సమస్యలకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కేంద్రంగానే పరిష్కారం లభించేలా పాలకవర్గం చొరవ చూపాలని కోరారు.

ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందించడమే లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంతో పాటు విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని షబ్బీర్ అలీ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా, ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు చేరేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గం రైతులకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి బిక్కనూర్ సహకార సంఘానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మహమ్మద్ ఇలియాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, మండల అధ్యక్షులు నరేందర్ రెడ్డి, బిక్కూర్ సర్పంచ్ బల్యాల సురేఖ సుదర్శన్, సొసైటీ చైర్మన్లు గూడెం శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, అనంత్ రెడ్డి, యాదవ రెడ్డి, భీంరెడ్డి, సురేందర్, నంద రమేష్, నర్సింహా రెడ్డి, గల్ రెడ్డి, అంకం రాజు, బల్యాల సుదర్శన్, లింగారెడ్డి, అంకం కృష్ణారావు,, శ్రీకాంత్, రాకేష్ రెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వినీత్, మధు, తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

కల్వకుర్తిలిక్రికెట్ విన్నర్స్ కు రూ. 25,000 ప్రైజ్ మనీ అందజేసిన. కౌన్సిలర్ పాపిశెట్టి రామన్న

కల్వకుర్తి నవంబర్ 21 తెలంగాణ పత్రిక



కల్వకుర్తి. నియోజకవర్గ ప్రముఖ సంఘ సేవకులు, ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు కౌన్సిలర్ పాపిశెట్టి రామన్న క్రికెట్ టోర్నమెంట్ లో విజేతగా నిలిచిన టీమ్ కు రూ. 25,000.ప్రథమ బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ. యువత క్రీడల్లో రాణించి, ఆరోగ్యంగా, క్రమశిక్షణతో ముందుకు సాగాలని, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించడానికి తాను ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. విజేత జట్టు సభ్యులను అభినందిస్తూ, వారికి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, యువకులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు కల్వకుర్తి ఆర్ ఎస్ పి ఫౌండేషన్ ద్వారా నిర్వహించినటువంటి క్రికెట్ టీం విన్నర్స్ కు పాపి శెట్టి రామన్న రూ. 25,000 ప్రైజ్ మనీ క్రికెట్ టోర్నమెంట్ లో గెలిచిన విన్నర్స్ టీమ్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో.బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ మాజీ ఎమ్మెల్యే జయపాల్ యాదవ్ తెలంగాణ రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ రామన్న మిత్ర మండలి సభ్యులు శీను నాయక్ పాల్గొన్నారు యువతను ఎప్పుడూ ప్రోత్సహించే రామన్న కి హృదయపూర్వక ధన్యవాదాలు! తెలిపారు

పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే

- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం లక్ష్యం
-కుటుంబ పెద్దను కోల్పోయినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా అండగా నిలవడమే ప్రభుత్వ ఉద్దేశం
-ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్

కామారెడ్డి, నవంబర్ 21,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి నియోజకవర్గంలోని బిక్నూర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంతో పాటు నూతనంగా మంజూరైన సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలను వివరించి, వాటి లక్ష్యాలు, అమలు విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం, ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత అందించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఒక కుటుంబంలో సంపాదించే వ్యక్తి అనుకోకుండా మరణిస్తే ఆ కుటుంబం ఒక్కసారిగా ఆర్థిక ఇబ్బందుల్లో పడుతుందని, పిల్లల చదువులు, కుటుంబ పోషణ, వైద్య ఖర్చులు తదితర అవసరాలను తీర్చుకోవడం కష్టంగా మారుతుందని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బాధిత కుటుంబం



ఆర్థికంగా కుంగిపోకుండా ప్రభుత్వం అండగా నిలవాలనే ఉద్దేశంతోనే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టినట్లు వివరించారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తిని కోల్పోయినప్పుడు అర్హులైన కుటుంబానికి బీమా ఆర్థిక సహాయం అందించి, వారి జీవనానికి భరోసా కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కుటుంబ పెద్ద మరణంతో పిల్లల భవిష్యత్తు, కుటుంబ జీవనం అగమ్యగోచరంగా మారకుండా ఈ పథకం తోడ్పడుతుందని తెలిపారు. అదేవిధంగా సమాజంలోని వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు తదితర అర్హులైన పేదలకు సామాజిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం నూతన పెన్షన్లను మంజూరు చేస్తోందని తెలిపారు. వయోభారం, అనారోగ్యం, కుటుంబ ఆదాయ వనరుల లేమి కారణంగా ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితి రాకుండా ప్రతి నెలా పెన్షన్ ద్వారా ఆర్థిక చేయూత అందించడం ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. నూతనంగా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. అర్హులైన ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా క్షేత్రస్థాయిలోనే పథకాలపై అవగాహన కల్పించి, లబ్ధిదారులకు ప్రభుత్వ సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుతో పాటు పేదల సంక్షేమం, మహిళల అభ్యున్నతి, రైతుల సంక్షేమం, విద్య, వైద్యం, సామాజిక భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరినప్పుడే వాటి అసలైన లక్ష్యం నెరవేరుతుందని, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం, నూతన సామాజిక భద్రతా పెన్షన్లు పేద కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తాయని మహమ్మద్ అలీ షబ్బీర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మహమ్మద్ ఇలియాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, బిక్నూర్ సర్పంచ్ బల్యాల సురేఖ సుదర్శన్, భీంరెడ్డి, మోహన్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంబంధిత శాఖల అధికారులు, లబ్ధిదారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ నిమ్మ నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన రెడ్డి నాయక్





-ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావు సమక్షంలో పార్టీ కండువా కప్పి ఆహ్వానం

ఓదెల.నవంబర్ 21 (తెలంగాణ పత్రిక)

ఓదెల: మండలం లంబాడి తండా గ్రామానికి చెందిన కుల పెద్దమనిషి రెడ్డి నాయక్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామ సర్పంచ్ నిమ్మ నాయక్ ఆధ్వర్యంలో శివపల్లిలోని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావు నివాసంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ విజయరమణారావు రెడ్డి నాయక్ యూత్ లీడర్ పవన్ నాయక్ కు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నిమ్మ నాయక్. ఉపసర్పంచ్ లింగేష్ నాయక్ మరియు సింగిల్ విండో డైరెక్టర్ పరిష నాయక్ తో పాటు గ్రామ పాలకవర్గం పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాస్త్రీయ ఆలోచనలే సమాజ అభివృద్ధికి పునాది!





-విద్యార్థుల్లో పరిశోధనాత్మక దృక్పథం, సృజనాత్మకతను పెంపొందించాలి

నంగునూరు, నవంబరు 21(తెలంగాణ పత్రిక):

శాస్త్ర విజ్ఞానమే సమాజ అభివృద్ధికి పునాది అని, విద్యార్థులు చిన్నతనం నుంచే శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అలవర్చుకొని ప్రతి విషయాన్ని ప్రశ్నించే, పరిశీలించే, విశ్లేషించే తత్వాన్ని పెంపొందించుకోవాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామి గౌడ్, నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంఛార్జి ప్రధానోపాధ్యాయుడు దుబ్బుడు రవీందర్ రెడ్డి సూచించారు. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా ప్రయోగాలు, పరిశీలనలు, పరిశోధనల ద్వారా విజ్ఞానాన్ని సముపార్జించుకోవాలని అన్నారు. శాస్త్రీయ దృక్పథం కలిగిన విద్యార్థులే భవిష్యత్తులో దేశాభివృద్ధికి దోహదపడతారని పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక, రసాయన శాస్త్ర ఉపాధ్యాయుల వేదిక ఆధ్వర్యంలో మండలస్థాయి చెకుముకి ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గొట్టిపర్తి రామస్వామి గౌడ్, దుబ్బుడు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. నేటి ఆధునిక ప్రపంచంలో శాస్త్ర సాంకేతిక రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. వాటికి అనుగుణంగా విద్యార్థులు తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. మూఢ నమ్మకాలకు దూరంగా ఉంటూ శాస్త్రీయ ఆధారాలతో ఆలోచించడం అలవాటు చేసుకోవాలని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడంతోపాటు పోటీతత్వం, ఆత్మవిశ్వాసం, సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని పెంపొందించేందుకు చెకుముకి వంటి విజ్ఞాన పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు.

మండలస్థాయి పోటీల్లో విజేతలు

మండల స్థాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విభాగంలో రాజగోపాల్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి స్థానం సాధించారు. నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రెండో స్థానం, గట్లమల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మూడో స్థానం దక్కించుకున్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల విభాగంలో అక్కెనపల్లి తెలంగాణ ఆదర్శ పాఠశాల మొదటి స్థానం సాధించగా, నర్మెట్ట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ద్వితీయ స్థానం పొందింది. ఈ సందర్భంగా విజేతలను ముఖ్య అతిథి, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజ్ఞాన పోటీల్లో పాల్గొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భౌతిక, రసాయన శాస్త్ర ఉపాధ్యాయులు దుద్దెడ పరశురాములు, మన్మోహన్ రెడ్డి, సతీశ్, రాములు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకకు హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు



పాపన్నపేట, నవంబర్ 21:(తెలంగాణ పత్రిక)

కుర్తివాడ గ్రామానికి చెందిన రిపోర్టర్ మధుసూదన్ చారి శోభారాణి కుమార్తె వివాహానికి టివైజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డా. తనుగుల జితేందర్ రావు శనివారం హాజరయ్యారు. కొత్తపల్లి లోని అనంత పద్మనాభ స్వామి ఫంక్షన్ హాల్ లో నూతన వధూవరులను వైష్ణవి,సురేష్ చారీ లను ఆయన ఆశీర్వదించారు. ఈసందర్భంగా రిపోర్టర్లు కిరణ్, రవి, స్వామి, కృష్ణ, భాస్కర్, లక్ష్మణ్, దయానంద్, వెంకట్ తదితరులు ఉన్నారు.

ఓల్డ్ హై స్కూల్ విద్యార్థి శరణ్ ఇన్స్ పైర్ అవార్డు మాణిక్ లో రాష్ట్ర స్థాయికి ఎంపిక



జగిత్యాల నవంబర్ 21 తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఓల్డ్ జగిత్యాల్లో పదో తరగతి చదువుతున్న ఎస్.శరణ్ గత మూడు రోజులుగా స్థానిక ఓల్డ్ హైస్కూల్లో జిల్లా స్థాయి ఇన్స్ పైర్ అవార్డ్స్ మాణిక్ ప్రదర్శనలో ఆటోమేటెడ్ రైల్వే ట్రాక్ మానిటరింగ్ సిస్టం ప్రదర్శన ద్వారా రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేశ్ కుమార్ జిల్లా విద్యాధికారి రాముచరణ్ కు ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శరణ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రకళ,గైడ్ టీచర్ విద్యా,దేవి సైన్స్ ఉపాధ్యాయులు ఆనందరావు అభినందించారు.

దోమకొండ మండల ఆర్ఎంపి/పియంపి వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షునికి సన్మానం



కామారెడ్డి నవంబర్ 21,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లాదోమకొండ మండల కేంద్రంలో మండల ఆర్ఎంపి /పి.ఎం.పి వెల్ఫేర్ అసోసియేషన్ మరియు జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన డాక్టర్ షాదుల్లా హుస్సేన్ ని సన్మానించిన మిత్రులు శ్రీ పాలకుర్తి శేఖర్ ,బోరెడ్డి కిషన్ రెడ్డి, సాయబుగారి విజయ్, చెన్ను గారి నర్సింలు, బొబ్బసాని శంకర్ , కృష్ణారెడ్డి బస్వాపూర్ గార్లు ఆయనకు శాలువలతో సన్మానించారు.

శ్రీకృష్ణ నగర్‌లో గౌరీ పరమేశ్వరి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నవీన్ యాదవ్



హైదరాబాద్, నవంబర్ 21 (తెలంగాణ పత్రిక):

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని శ్రీకృష్ణ నగర్‌లో నిర్వహించిన శ్రీ గౌరీ పరమేశ్వరి అమ్మవారి ఉత్సవాల్లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. అమ్మవారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా బిజినెస్

ఘనంగా ముదిరాజ్ జయంతి ఉత్సవాలు

-జెండా ఆవిష్కరణ.. బైక్ ర్యాలీతో సందడిగా వేడుకలు



ఆత్మకూర్, నవంబర్ 21 (తెలంగాణ పత్రిక):

ఆత్మకూరు మండల కేంద్రంలో శనివారం ముదిరాజ్ జయంతి ఉత్సవాలను సంఘం నాయకులు, సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ముదిరాజ్ సంఘంలో జెండాను ఆవిష్కరించి జయంతి వేడుకలను ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. ముదిరాజ్ సంఘం జెండాలతో, జయంతి నినాదాలతో బైక్ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ముదిరాజ్ సమాజ ఐక్యత, అభివృద్ధి, హక్కుల సాధనకు సంఘటితంగా కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. జయంతి వేడుకల్లో ముదిరాజ్ సంఘం నాయకులు, యువకులు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జీవో నెంబర్ 25 లోని నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులు సర్దుబాటు చేసి త్వరగా ఆర్డర్ జారీ చేయాలి

-కామారెడ్డి డీఈవో కు వినతిపత్రం ఇచ్చిన టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు చింతల లింగం



కామారెడ్డి,నవంబర్ 21,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులను.జీవో నెంబర్ 25 లోని నిబంధనల ప్రకారము ఉపాధ్యాయుల సర్దుబాటు చేసి త్వరగా ఆర్డర్లు జారీ చేయాలని 2008 డీఎస్సీ కాంట్రాక్టు పద్ధతిన నియమింప ఉపాధ్యాయులకు మార్చి వరకు రెగ్యులర్గా వేతనాలు చెల్లించే విధంగా చూడాలని గత ఐదు నెలలుగా వేతనాలు రాక ఇబ్బంది పడుతున్న స్కావెంజర్లకు వేతనాలు వచ్చే విధంగా ప్రయత్నం చేయాలని ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా ఉపాధ్యాయుల సర్దుబాటు పారదర్శకంగా నిర్వహించాలని కామారెడ్డి డీఈవో కి రిప్రజెంటేషన్ ఇస్తున్న టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు చింతల లింగం కామారెడ్డి మండల ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ మరియు ప్రధానోపాధ్యాయులు లోకేశ్వరరావు పాల్గొన్నారు.

కామారెడ్డి టూ శబరిమల వెళ్ళు భక్తులకు టిజిఎస్ సర్వీస్ ప్రారంభం

-కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ దినేష్ కుమార్

కామారెడ్డి ,నవంబర్ 21, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లా ప్రజలకు కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ దినేష్ కుమార్ శుభవార్త చెప్పారు అయ్యప్ప దీక్షలో ఉన్న స్వాములకు మరియు శబరిమల వెళ్ళు భక్తులకు టీజీఎస్ఆర్టిసి కామారెడ్డి బస్సు డిపో నుండి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు కల్పించబడినది అని తెలుపుటకు సంతోషిస్తున్నాము అని పి.దినేష్ కుమార్ డిపో మేనేజర్ కామారెడ్డి తెలిపినారు శబరిమల వెళ్ళుటకు గురుస్వామి బస్సు బుక్కు చేసుకున్నచో వారికి ప్రయాణం చార్జీలు మినహాయింపు కలదు మరియు బస్సు సీటింగ్ కెపాసిటీ తో పాటుగా ఇద్దరు వంట మనుషులు ఇద్దరు మణికంఠ స్వామి లను అనుమతించబడును శబరిమల వెళ్ళు బస్సులకు టోల్గేట్ రుసుము మరియు కర్ణాటక తమిళనాడు రాష్ట్రాలకు బార్డర్ టాక్సు భక్తులు చెల్లించవలసిన అవసరం లేదు టి జి ఎస్ ఆర్ టి సి బస్సులకు కేరళ రాష్ట్రంలో బోర్డర్ టాక్స్ లు మినాయింపు కలదు బస్సుల పార్కింగ్ చార్జీలు భక్తులు చెల్లించవలసి ఉంటుంది శబరిమల వెళ్ళు ఆర్టీసీ బస్సులలో అనుభవిజ్ఞులైన మరియు రూటు తెలిసినా మంచి నైపుణ్యం ఉన్న డ్రైవర్లను ప్రతి బస్సుకు ఇద్దరి చొప్పున ఇవ్వడం జరుగుతుంది అలాగే కార్తీక మాసం పురస్కరించుకొని భక్తుల కోసం ప్రముఖ పుణ్య శైవ క్షేత్రాలు అయినా శ్రీశైలం కాణిపాకం స్వర్ణ దేవాలయం జోగులాంబ కంచి కామాక్షి మరియు అరుణాచలం క్షేత్రాలను దర్శించుకొనుటకు కామారెడ్డి డిపో నుండి సూపర్ లగ్జరీ బస్సులను అదే ప్రతిపాదికంగా ఇవ్వబడును అని కామారెడ్డి పి దినేష్ కుమార్ బస్ డిపో మేనేజర్ కామారెడ్డి ఒక ప్రకటనలో తెలిపినారు.

జానపద కళాకారుల ఐక్యతకు సరికొత్త ఊపిరి.. తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ప్రస్థానంపై ప్రశంసల వెల్లువ

-ఆవిర్భావ వేడుకల పారదర్శక లెక్కలతో సత్తార్‌కు ఘన సన్మానం.. రాష్ట్ర కమిటీ విస్తరణ, సభ్యత్వ నమోదుపై కీలక తీర్మానాలు

తెలంగాణ పత్రిక ప్రతినిధి సిరిసిల్ల





తెలంగాణ జానపద కళారంగానికి నూతన శోభను తీసుకురావాలనే సంకల్పంతో తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర కార్యవర్గ కమిటీ సమావేశం సిరిసిల్ల పట్టణంలోని చిత్ర బాంకెట్ హాల్‌లో ఘనంగా జరిగింది. శుక్రవారం రాష్ట్ర అధ్యక్షులు పత్తిపాటి రమణాకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఆవిర్భావ వేడుకల సమీక్షతో పాటు సంస్థ భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించి ఏకగ్రీవ తీర్మానాలు ఆమోదించారు. సమావేశంలో తొలుత సిరిసిల్లలో నిర్వహించిన తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావ వేడుకల ఆదాయ, వ్యయ వివరాలను ప్రధాన కార్యదర్శి, ప్రోగ్రాం కన్వీనర్ మహమ్మద్ సత్తార్ సభ్యుల ముందు ఉంచారు. ఎన్ని సవాళ్లు, ఇబ్బందులు ఎదురైనా కార్య నిర్వాహక కమిటీ సభ్యులు, సిరిసిల్ల బృందం కళాకారుల సహకారంతో వేడుకలను అద్భుతంగా విజయవంతం చేయడమే కాకుండా, ప్రతి రూపాయి లెక్కను ఎంతో పారదర్శకంగా వెల్లడించిన సత్తార్ కృషిని సభ్యులందరూ కొనియాడారు. ఆదాయ ఖర్చుల నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించిన కమిటీ సభ్యులు, మహమ్మద్ సత్తార్‌ను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి ఆవిర్భావ వేడుకల బాధ్యత అప్పగించిన కార్య నిర్వాహక కమిటీ సభ్యులందరికీ సత్తార్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం దాదాపు అర్ధరాత్రి వరకు సుదీర్ఘంగా సాగిన రాష్ట్ర కార్యవర్గ కమిటీ సమావేశంలో సంస్థ బలోపేతం, విస్తరణ, కళాకారుల సంక్షేమం, హక్కుల సాధనపై సభ్యులు విలువైన సూచనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జానపద పరిశ్రమను ఒకే వేదికపైకి తీసుకురావాలనే లక్ష్యంతో సంస్థ కమిటీని విస్తరిస్తూ తొలి తీర్మానాన్ని ఆమోదించారు. రాష్ట్ర అధ్యక్షులుగా పత్తిపాటి రమణాకర్, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ సత్తార్, కోశాధికారిగా ఎర్రం వేణు, ఉపాధ్యక్షులుగా కళాంజలి రాజేష్, ఏదుల జంగి రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోదారి శ్రీనివాస్, స్టేట్ కోఆర్డినేటర్‌గా దరువు అంజన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా గడ్డం సంతోష్, మానుకోట ప్రసాద్, ప్రచార కార్యదర్శిగా ఆకునూరు దేవయ్య, అధికార ప్రతినిధిగా ఎడమల శ్రీధర్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా మంకాల ప్రసాద్, చీకోడు నరసింహులు, మహిళా ప్రతినిధులుగా తేలు విజయ, ఒల్లాల వాణి నియమితులయ్యారు. వీరితో పాటు రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా కాపర్తి మల్లికార్జున్, జడల రమేష్, వడ్లకొండ అనిల్ కుమార్, కందుకూరి శంకర్ బాబు, కాదూరి గణేష్, వస్పరి విష్ణు, మాట్ల తిరుపతి, కోడం సంతోష్, మల్లిక్ తేజ, బైరాగి మోహన్, అభినయ శ్రీనివాస్, బుర్ర సతీష్, నక్క శ్రీకాంత్, వీణ మేధ్చల్‌లను నియమిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు.రెండో తీర్మానంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పనిచేస్తున్న జానపద పరిశ్రమ కళాకారులు, సాంకేతిక నిపుణులు, సృజనాత్మక రంగ ప్రతిభావంతులకు నూతన సభ్యత్వాలు కల్పించాలని నిర్ణయించారు. జానపద, భక్తి, సామాజిక గేయ రచయితలు, గాయకులు, గాయనీమణులు, సంగీత దర్శకులు, కీబోర్డ్ ప్లేయర్లు, సంగీత కళాకారులు, స్టూడియో ఇంజినీర్లు, కెమెరామెన్లు, వీడియో ఎడిటర్లు, కొరియోగ్రాఫర్లు, ప్రధాన నటీనటులు, దర్శకులు, నిర్మాతలకు సభ్యత్వం అందించనున్నారు. ఇందుకోసం జిల్లా వారీగా ఇన్‌చార్జిలను నియమించి, రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా, క్రమబద్ధంగా సభ్యత్వ ప్రక్రియ చేపట్టి ప్రతి జిల్లాలో సంస్థను పటిష్టంగా నిర్మించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

ఉద్యమ కళాకారుడి కుటుంబానికి అండగా ఉద్యమకారుల జేఏసీ.. కలెక్టర్ స్పందించాలని విజ్ఞప్తి

-దివంగత చిందు కళాకారుడు రాయల చంద్రమౌళి కుమార్తె వివాహానికి ఐదు వేల రూపాయల ఆర్థిక సాయం అందించిన జేఏసీ జిల్లా చైర్మన్ గజ్జెల దేవరాజు

తెలంగాణ పత్రిక ప్రతినిధి సిరిసిల్ల



తెలంగాణ మలిదశ ఉద్యమంలో తన ఆటపాటలతో ప్రజలను చైతన్యపరిచిన దివంగత చిందు కళాకారుడు రాయల చంద్రమౌళి కుటుంబానికి తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ అండగా నిలిచింది. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లి గ్రామానికి చెందిన రాయల చంద్రమౌళి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అత్యంత చురుకైన పాత్ర పోషించారు. అయితే అనారోగ్య కారణాలతో ఆయన అకాల మరణం చెందడంతో కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో శనివారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. త్వరలో చంద్రమౌళి కుమార్తె వివాహం జరగనున్నందున, ఆయన కుటుంబానికి తన వంతు బాధ్యతగా ఉద్యమకారుల జేఏసీ జిల్లా చైర్మన్ గజ్జెల దేవరాజు ఐదు వేల రూపాయల నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, స్వరాష్ట్ర సాధన కోసం అహర్నిశలు శ్రమించిన కళాకారుడి కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. దివంగత చంద్రమౌళి కుటుంబ దీనస్థితిపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి, ప్రభుత్వ పరంగా తగిన ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బండి దేవదాసు, బుస్స వేణు, మాజీ కౌన్సిలర్ పత్తిపాక పద్మ, మాజీ ఎంపీపీ గజభింకర రాజన్న, కుసుమ విష్ణు, అర్బన్ బ్యాంకు మాజీ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్, రిక్కమల్లె మనోజ్ కుమార్, న్యాయవాది పసుల బాబు తదితరులు పాల్గొన్నారు..

గుండెపోటు సంకేతాలను నిర్లక్ష్యం చేయొద్దు





-ఛాతినొప్పి వస్తే గ్యాస్ అనుకుని తేలిగ్గా తీసుకోవద్దు సకాలంలో వైద్యం అందితే ప్రాణరక్షణ సిరిసిల్ల పోలీసు సిబ్బందికి మెగా హెల్త్‌టాక్

రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల

సిరిసిల్ల గుండెపోటు లక్షణాలను ముందుగానే గుర్తించి అప్రమత్తమైతే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆర్.సతీశ్‌కుమార్ సూచించారు. ఛాతినొప్పి వచ్చినప్పుడు గ్యాస్ సమస్యగా భావించి నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరమని, గుండెపోటు అనుమానం కలిగితే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వైద్య సహాయం పొందాలని తెలిపారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ కార్యాలయ ఆవరణలో మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందికి మెగా హెల్త్‌టాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీశ్‌కుమార్ మాట్లాడుతూ... గుండెపోటు రావడానికి ప్రధాన కారణాలు, ముప్పు ఎక్కువగా ఉండే పరిస్థితులు, ముందుగా కనిపించే హెచ్చరిక సంకేతాలను వివరించారు. ఛాతిలో నొప్పి, బిగుతుగా అనిపించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అధిక చెమటలు, ఎడమ చేయి లేదా దవడకు నొప్పి వ్యాపించడం వంటి లక్షణాలను గుర్తించాలని సూచించారు. ప్రతి ఛాతినొప్పిని గ్యాస్ సమస్యగా భావించకూడదని స్పష్టం చేశారు. ముఖ్యంగా బీపీ, మధుమేహం, కొలెస్ట్రాల్ ఉన్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. గుండెపోటు వచ్చినప్పుడు ఇంటి చిట్కాలు పాటిస్తూ, తెలిసినవారికి ఫోన్లు చేస్తూ సమయాన్ని వృథా చేయకుండా వెంటనే అత్యవసర వైద్యం అందించాలని సూచించారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, సమతుల ఆహారం తీసుకోవడం, ఆహార నియమాలు పాటించడం, వ్యాయామం చేయడం, పొగతాగడం మానేయడం ద్వారా గుండెజబ్బుల ముప్పును తగ్గించుకోవచ్చని వివరించారు. పోలీసు విధుల్లో నిరంతరం ఒత్తిడికి గురయ్యే సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గీతే, ఆర్ఐ సురేష్ మోడెం, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, కొత్తపల్లి శ్రీనివాస్, విద్యాసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎముకల మజ్జా లోని ప్లాస్మా కణాలకు వచ్చే రక్త క్యాన్సరే 'మల్టిపుల్ మైలోమా

-లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయొద్దు

ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ రోహిత్ రెడ్డి

-73 ఏళ్ల మహిళకు అధునాతన చికిత్సతో ప్రాణం నిలిపిన యశోద వైద్యులు

మిర్యాలగూడ ప్రతినిధి//నవంబర్ 21:(తెలంగాణ పత్రిక):-



ఎముకల మజ్జలోని ప్లాస్మా కణాలకు వచ్చే ఒక రకమైన రక్త క్యాన్సరే మల్టీపుల్ మైలోమా అని ఇది ఎముకలను దెబ్బతీయడంతో పాటు రక్త కణాల సంఖ్యను తగ్గిస్తుందని ప్రముఖ అంకాలజిస్ట్, మలక్పేట్ యశోద ఆస్పత్రి కన్సల్టెన్సీ డాక్టర్ రోహిత్ రెడ్డి అన్నారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఇటీవల నల్లగొండ జిల్లాలోని వాడపల్లికి చెందిన 73 ఏళ్ల మహిళలకు అత్యధిక వైద్య చికిత్స అందించి మల్టిపుల్ మైలోమా నుండి సురక్షితంగా కాపాడినట్లు తెలిపారు. ఈ వ్యాధి మూత్రపిండాలపై, శరీరంలోని క్యాల్షియం స్థాయిపై ప్రభావం చూపుతుంది. వృద్ధులకు షుగర్, బీపీ వంటి ఇతర వ్యాధులు ఉండటం, చికిత్స మధ్యలో ఇన్ఫెక్షన్ రావడం వంటి సందర్భాల్లో చికిత్స మరింత క్లిష్టమవుతుందన్నారు. ఇలాంటి పరిస్థితిలోకూడా సదరు మహిళకు హైదరాబాద్ మలక్పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు జాగ్రత్తగా పరీక్షించి, ప్రణాళిక ప్రకారం కీమోథెరపీ అందించి ఆమె ప్రాణాలు రక్షించినట్లు తెలిపారు. వృద్ధుల్లో ఎముకల నొప్పి, రక్తహీనత వల్ల నిరంతర నీరసం, మూత్రపిండాల సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదు. కొన్నిసార్లు ఇవి మల్టిపుల్ మైలోమా లక్షణాలు కావచ్చుఅని సకాలంలో వైద్య చికిత్సలు అందించాలని ఆయన తెలిపారు. హైదరాబాద్ మలక్పేట్ యశోదా ఆసుపత్రిలో మాత్రమే కాక యశోదా ఆసుపత్రి అన్ని శాఖల్లోనూ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, నిపుణులైన యశోదా వైద్య బృందం ద్వారా అత్యంత క్లిష్టతరమైన జబ్బులు, వ్యాధులకు కూడా చికిత్స జరుగుతోందని మలక్పేట్ యశోదా హాస్పిటల్స్ డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర తెలిపారు. వృద్ధుల్లో ఎముకల నొప్పి, నిరంతర నీరసం, మూత్రపిండాల సమస్యలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం, శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి





- ప్రొఫెసర్ కాశీనాథ్

ఆత్మకూరు: నవంబర్ 21 తెలంగాణ పత్రిక

.జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ మండల స్థాయి పరీక్ష శనివారం నాడు ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల కన్వీనర్ బమ్మెర సోమయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుల్ల నిర్మల కుమారి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన నిట్ ఆచార్యులు ప్రొఫెసర్ కాశీనాథ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే ప్రశ్నించే తత్వం, హేతుబద్ధ ఆలోచన, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని అన్నారు. విద్యార్థులు ప్రతి విషయాన్ని ప్రశ్నిస్తూ, ఆధారాలతో ఆలోచించే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. జాతీయ అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణు మాట్లాడుతూ సమాజంలో నెలకొని ఉన్న మూఢనమ్మకాలను తొలగించడంలో జన విజ్ఞాన వేదిక నిబద్ధతతో పనిచేస్తోందని, సైన్స్ టాలెంట్ టెస్ట్‌తో పాటు విద్యార్థుల్లో సృజనాత్మకత, ప్రయోగాత్మక నైపుణ్యాలు, శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించే వివిధ కార్యక్రమాలను చెకుముకి సైన్స్ సంబురాల్లో నిర్వహిస్తామని తెలిపారు. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన పాఠశాలల విద్యార్థులకు సర్టిఫికెట్స్, బహుమతుల పుస్తకాలు ప్రధానం చేయడం జరిగినది. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అక్కంపేట, రెసిడెన్షియల్ పాఠశాలల విభాగంలో మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాల, ప్రైవేట్ పాఠశాల విభాగంలో సెయింట్ థెరిసా ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి ఈనెల 28న జిల్లాస్థాయిలో జరిగే పరీక్షకు ఎంపిక య్యారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు బమ్మెర సోమయ్య, ఐతరాజు, శేఖర్, రవి, రమేష్, లావణ్య, పుష్ప, స్వప్న మాధురి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాఫెడ్ ఆధ్వర్యంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమం

వెంకటాపురం (నుగురు) నవంబర్ 21: తెలంగాణ పత్రిక





వెంకటాపురం: కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వెంకటాపురం మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాన్ని కాపెడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం కేజీబీవీ. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్ పి ఎస్ హెచ్), నాయకులగూడెం ప్రాథమిక పాఠశాల, పాత్రపురం పాఠశాల, మంగవాయి పాఠశాల, అంకన్నగూడెం ఎంపీపీఎస్, రామచంద్రపురం ఎంపీయూపీఎస్, లిటిల్ ఫ్లవర్ స్కూల్, బోదాపురం ఎంపీపీఎస్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, కళా నైపుణ్యాలను వెలికితీయడంతో పాటు వారిలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు మరియు సామాజిక ఐక్యతను పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు మరియు ఇతర కళారూపాల ద్వారా తమ ప్రతిభను చాటుకున్నారు. విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. సుమారు 200 మంది విద్యార్థులు మరియు యువత ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శిరీష, వెంకటాపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, రామచంద్రపురం పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయశ్రీ, పాత్రపురం పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగమణి, అంకన్నగూడెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీలత, కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ బ్రదర్ కె. లూర్దు రాజు పాల్గొన్నారు. నాయకులగూడెం ప్రధానోపాధ్యాయులు సూర్యనారాయణ కూడా పాల్గొన్నారు. అలాగే వెంకటాపురం మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, కాఫెడ్ వెంకటాపురం మండల కోఆర్డినేటర్ జి. హనుమంతు, వాజేడు మండల కోఆర్డినేటర్ జి. కామేష్, యానిమేటర్లు మరియు కాఫెడ్ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఎంతో అవసరమని, ఇటువంటి కార్యక్రమాలు వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమం ముగిసిన అనంతరం పాల్గొన్న విద్యార్థులందరికీ కాఫెడ్ సంస్థ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. బహుమతులు అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంత విద్యార్థులకు విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, సాంస్కృతిక అభివృద్ధి మరియు సమాన అవకాశాలు కల్పించేందుకు కాఫెడ్ సంస్థ నిరంతరం కృషి చేస్తోందని సంస్థ డైరెక్టర్ బ్రదర్ కె. లూర్దు రాజు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు నిర్వాహకుల సమిష్టి సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి, నవంబర్ 21,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లాదోమకొండ మండల కేంద్రంలోని పీపీసీ మరియు పీఎస్ఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సందర్శించి, కేంద్రాల నిర్వహణ తీరును క్షేత్రస్థాయి లో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించా రు. కొనుగోలు ప్రక్రియను పూర్తి పారదర్శకతతో, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, ధాన్యం సేకరణలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, నాణ్యతా ప్రమాణాల ను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. రైతులు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని నాణ్యతా ప్రమాణాల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రైతులకు సకాలంలో సేవలు అందిస్తూ, ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో డీసీఎస్ఓ వెంకటేశ్వర్లు, డీఎం శ్రీకాంత్, తహసీల్దార్ ఆర్. సప్న, సివిల్ సప్లైస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం కార్మికులు చేనేత కార్మికుల పెన్షన్ ల మంజూరు కోసం హైద్రాబాద్ తరలి రావాలి

-చేనేత సహకార సంఘం అధ్యక్షుడు కొడపాక విట్టల్

పాపన్నపేట,నవంబర్ 21:(తెలంగాణ పత్రిక)

మెదక్ జిల్లాలోని ఉన్న చేనేత కార్మికులకు పింఛన్లను,బీమా తదితర అంశాలపై చర్చించేందుకు సోమవారం (23.11.2026) నాడు ఉదయం 10.30 గంటలకు నాంపల్లి చేనేత భవన్ కు తరలి రావాలని పాపన్నపేట మండల చేనేత సహకార సంఘం చైర్మన్ కొడపాక విట్టల్ తెలిపారు.ఈ కార్యక్రమానికి పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్ కుమార్ హాజరవుతున్నట్లు ఆయన వెల్లడించారు. వివిధ అంశాలపై హైదరాబాదులోని నాంపల్లి చేనేత భవన్ లో ఉన్నతాధికారులను కలవనున్న తెలంగాణ ట్యాంక్‌బండ్ జలదృశ్యం వద్ద ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నాంపల్లి చేనేత భవన్ కు బయలు దేరనున్నామనీ చెప్పారు.మెదక్ జిల్లాలోచేనేత కార్మికులు స్వతహాగా హైద్రాబాద్ కార్యక్రమానికి బయలు దేరి రావాలని ఆయన కోరారు.

వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

-మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాల కట్టడిపై ప్రత్యేక దృష్టి సారించాలి.



వేములవాడ, నవంబర్, 21, తెలంగాణ పత్రిక.

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, సిబ్బంది పనితీరు , శాంతి భద్రతలకి తీసుకున్నా చర్యలపై అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా స్టేషన్‌లో నిర్వహిస్తున్న సీసీటీఎన్ఎస్ వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, రహదారి భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని,ప్రతి కేసు దర్యాప్తు పురోగతిని నిరంతరం సమీక్షించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ సూచించారు.వివిధ ప్రాంతాల నుంచి వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ నియంత్రణకు పటిష్టమైన ప్రణాళికతో విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ఎస్పీ వెంట డిఎస్పీ శ్రీనివాసులు, సి.ఐ వీరప్రసాద్ సిబ్బంది ఉన్నారు.

శాతవాహన యూనివర్సిటీ అభివృద్ధికి నిరంతర కృషి : వైస్ ఛాన్సలర్



కరీంనగర్ జిల్లా నవంబర్21 (తెలంగాణ పత్రికా ప్రతినిధి)

కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ కామర్స్ కళాశాలలో నూతన ఆక్టోరియం మొదటి అంతస్తు నిర్మాణ పనులకు వైస్ ఛాన్సలర్ యు ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ పి సతీష్ కుమార్ తో కలిసి భూమి పూజ చేశారు యూనివర్సిటీ పరిధిలో మొత్తం 14 రకాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు ముఖ్యంగా విద్యార్థులకు మెరుగైన వసతులతో పాటు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనే, లక్ష్యంగా ఎంతో కృషి చేస్తున్నామని వైస్ ఛాన్సలర్ పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ యూనివర్సిటీ లెక్చరర్స్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధులకు అల్పాహారం పంపిణీ

రెబ్బెన, నవంబర్ 21,(తెలంగాణ పత్రిక)



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం ఇందిరా నగర్ లో శనివారం సంజీవని స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులకు అల్పాహారం పంపిణీ చేశారు ఈ సందర్భంగా సేవా సంస్థ అధ్యక్షుడు సంజీవ్ కుమార్ నాయకులు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని సాటి మానవులకు సేవ చేయడంలో ఆత్మ సంతృప్తి ఉంటుందని అన్నారు

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA
TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా బిజినెస్

సాయి మందిరంలో కార్తీకమాస పూజ లు



కామారెడ్డి ,నవంబర్ 21, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామ శివారులో గల శ్రీశిరిడి సాయి ప్రేమ మందిరంలో వేద పండితులు బ్రహ్మశ్రీ గంగవరం ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో కార్తీక మాస చిలుకు ద్వాదశిని పురస్కరించుకొని శ్రీ తులసి బృంద సహిత ధాత్రి నారాయణ కళ్యాణం మహోత్సవం ఎంతో అత్యంత వైభవంగా కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు బ్రహ్మశ్రీ గంగవరం ఆంజనేయ శర్మ మాట్లాడుతూ కార్తీక మాసంలో ముఖ్యంగా చిలుకు ద్వాదశి రోజు తులసి బృందా సహిత నారాయణ తులసి కళ్యాణం నిర్వహించడం జరిగిందని తెలిపారు. తులసి కళ్యాణం రోజు తులసి వనంలో భోజనం చేసిన వారికి తులసి నారాయణ ఆశీస్సులు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ షిరిడి సాయి ప్రేమ మందిరం వ్యవస్థాపకులు మంజుల విజయ్ కుమార్, ఆలయ అర్చకులు చండీ ప్రసాద్ శర్మ, డాక్టర్ విట్టల్ సావిత్రి దంపతులు, డాక్టర్ రాజేశ్వరరావు దంపతులు మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పౌల్ట్రీ ఫామ్ దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న క్యాతంపెల్లి గ్రామస్తులు

-ఈగలు, దోమలు, కుక్కల బెడదతో అవస్థలు
-పౌల్ట్రీ ఫామ్‌ను తొలగించాలని గ్రామస్తుల డిమాండ్



ధర్మసాగర్, నవంబర్ 21 (తెలంగాణ పత్రిక):

హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం క్యాతంపెల్లి గ్రామ శివారులోని ఒక పౌల్ట్రీ ఫామ్ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గత కొద్ది సంవత్సరాల క్రితం ప్రారంభమైన పౌల్ట్రీ ఫామ్ నుంచి వెలువడుతున్న దుర్వాసన, కోళ్ల వ్యర్థాల వల్ల ఈగలు భారీగా గ్రామంలోకి వస్తున్నాయని, ఆహార పదార్థాలపై వాలడంతో చిన్నారులకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పౌల్ట్రీ ఫామ్ వద్దకు చేరుతున్న కుక్కలు గ్రామంలోకి వచ్చి చిన్నారులపై దాడి చేస్తున్నాయని తెలిపారు. శుభకార్యాలు నిర్వహించుకునే సమయంలోనూ ఈగల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఈ సమస్యపై ఇప్పటికే ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి ఫిర్యాదు చేసినప్పటికీ పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. ఉదయం ఈగలు, కుక్కల బెడద.. రాత్రివేళ దోమల బాధతో జీవనం సాగించడం కష్టంగా మారిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పౌల్ట్రీ ఫామ్ నిర్వహణపై విచారణ చేపట్టి, ప్రజారోగ్యానికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పౌల్ట్రీ ఫామ్‌ను గ్రామానికి దూరంగా తరలించి తమను సమస్యల నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మార్కెట్ చేర్మెన్ హనుమాండ్ల తిరుపతి రెడ్డి



పెద్దవంగర, నవంబర్ 20:తెలంగాణ పత్రిక

మండలంలోని బొమ్మకల్ గ్రామానికి చెందిన బీరగని మల్లయ్య కుమార్తె వివాహ వేడుక శుక్రవారం రామ ఉపేందర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ూవీ= చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మాజీ ూవీజ చైర్మన్ అనుమాండ్ల తిరుపతి రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. దంపతులు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా వధూవరుల కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బొమ్మకల్ గ్రామ సర్పంచ్ కొడకంటి యాకయ్య, కేతిరెడ్డి విక్రమ్‌రెడ్డి, రమేష్, గిరగని రామస్వామి, యాదగిరి, తొర్రూరు మండల సీనియర్ నాయకులు అనుమాండ్ల నరేందర్‌రెడ్డి, అనుమాండ్ల ప్రవీణ్‌రెడ్డి, ధర్మారపు వంశీకృష్ణ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల వారోత్సవాల ముగింపు డీఎంహెచ్ఓ



కరీంనగర్ జిల్లా నవంబర్ 21 (తెలంగాణ పత్రిక ప్రతినిధి)

కరీంనగర్ జిల్లాలో బాలల హక్కుల వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది వారోత్సవాల సందర్భంగా బాల బాలికలకు వివిధ పోటీలు నిర్వహించడం జరిగింది ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ప్రోగ్రాంకు ముఖ్య అతిథులుగా వచ్చిన వారు పిల్లలకు ప్రశంస పత్రాలు, ధ్రువపత్రాలు, అందజేశారు బాలల హక్కుల పరిరక్షణ, భద్రత, విద్య, ఆరోగ్యం, సమగ్ర అభివృద్ధిపై ఈ సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ణవీనూ, ణజూఖ, సి డబ్ల్యూ సి చైర్ పర్సన్, కమిటీ సభ్యులు మరియు చైల్డ్ హెల్ప్ లైన్ వారు పాల్గొన్నారు.

ఎస్.జి.ఎఫ్. అండర్-19 జూనియర్ కళాశాలలు



కరీంనగర్ నవంబర్ 21 తెలంగాణ పత్రిక

ఉమ్మడి కరీంనగర్ ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలల జిల్లా స్థాయి స్విమ్మింగ్, జూడో మరియు యోగ బాల బాలికలకు టోర్నమెంట్ కమ్ సెలెక్షన్స్ -- 2026-27 ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎస్.జి.ఎఫ్. అండర్-19 జూనియర్ కళాశాలల బాలురు మరియు బాలికలకు సంబంధించి జిల్లా స్థాయి స్విమ్మింగ్, జూడో మరియు యోగ టోర్నమెంట్ కమ్ సెలెక్షన్ పోటీలను క్రింది షెడ్యూల్ ప్రకారం నిర్వహించనున్నట్లు తెలియజేయడమైనది.

స్విమ్మింగ్ బాలురు మరియు బాలికలు

తేదీ: 23-11-2026 సోమవారం వేదిక: సెయింట్ ఆల్ఫోన్స్ స్కూల్, జ్యోతినగర్, కరీంనగర్. జూడో -- బాలురు మరియు బాలికలు, యోగా బాలురు మరియు బాలికలకు తేదీ: 25-11-2026 బుధవారం వేదిక: వివేకానంద సి బి ఎస్ సి స్కూల్, ఎస్.ఆర్.ఆర్. కళాశాల సమీపంలో, కరీంనగర్.

ముఖ్యమైన సూచనలు:

ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా సంబంధిత అర్హత ఫారాల మరియు అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో నిర్ణీత తేదీలలో ఉదయం 8:30 గంటలకు సంబంధిత పోటీ వేదికలకు హాజరుకావాలి. కావున ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సంబంధిత జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ మరియు ఫిజికల్ డైరెక్టర్లు ఈ ప్రకటనను గమనించి, అర్హత కలిగిన క్రీడాకారులు నిర్ణీత సమయానికి హాజరయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరడమైనది. ఈ అవకాశాన్ని సంబంధిత క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్.జి.ఎఫ్. అండర్-19 కార్యదర్శి ఎల్. బన్సీలాల్ గారు ప్రత్యేక ప్రకటన ద్వారా తెలియజేశారు..

ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించిన టీజీఎమ్ఎస్ దమ్మన్నపేట విద్యార్థులు

గంభీరావుపేట తెలంగాణ పత్రిక నంబర్ 21



రాజన్న సిరిసిల్ల జిల్లా, గంభీరావుపేట మండలం దమ్మన్నపేట టీజీఎమ్ఎస్ పాఠశాలలో శనివారం బ్యాగ్‌లెస్ డే కార్యక్రమంలో భాగంగా 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు విద్యార్థులకు క్షేత్రస్థాయి విజ్ఞానాన్ని అందించేందుకు ప్రత్యేక సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈకార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మండలంలోని ఎంపీడీవో కార్యాలయం తహసీల్దార్ కార్యాలయం పోలీస్ స్టేషన్లను సందర్శించారు ఈ సందర్భంగా ఆయా కార్యాలయాల్లో నిర్వహించే విధులు, ప్రజలకు అందించే సేవలు, ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థ పనితీరు, పోలీసుల బాధ్యతలు శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలను విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకున్నారు ఆయా రంగాల్లో భవిష్యత్తులో ఉద్యోగాలు సాధించాలంటే ఎలాంటి విద్యను అభ్యసించాలి, ఏ విధమైన నైపుణ్యాలు పెంపొందించుకోవాలి అనే విషయాలపై అవగాహన పొందారు పుస్తకాల ద్వారా పొందే జ్ఞానంతో పాటు క్షేత్రస్థాయి సందర్శనల ద్వారా ప్రత్యక్ష అనుభవం పొందడం విద్యార్థుల్లో సామాజిక అవగాహన, బాధ్యత, నాయకత్వ లక్షణాలు భవిష్యత్తు లక్ష్యాల పట్ల స్పష్టతను పెంపొందిస్తుందని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ప్రభుత్వ కార్యాలయాల పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకొని విద్యార్థులు ఎంతో విజ్ఞానాన్ని తెలుసుకొనున్నారు

చిన్నారికి ఆపరేషన్ నిమిత్తమై ఏ పాజిటివ్ రక్తం అందజేత

-రక్త దానంతో ఆదర్శంగా ప్రసాద్

కామారెడ్డి ,నవంబర్ 21, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన చిన్నారి హన్విక (7) కు బ్రెయిన్ ఆపరేషన్ నిమిత్తమై హైదరాబాదులోని ప్రైవేట్ వైద్యశాలలో ఏ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో రక్తదాత ప్రసాద్ మానవతా దృక్పథంతో స్పందించి సకాలంలో రక్తాన్ని అందజేయడం జరిగిందని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయ సభ్యులు డాక్టర్ బాలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ గతంలో ఎన్నో సందర్భాల్లో వివిధ రకాల ఆపరేషన్ల నిమిత్తమై,రోడ్డు ప్రమాద బాధితులకు,డెంగ్యూ బాధితులకు రక్తదాత ప్రసాద్ రక్తాన్ని అందజేయడం జరిగిందని అన్నారు,సకాలంలో రక్తం దొరకక ఎవరు ప్రాణాలను కోల్పోవద్దనే ఉద్దేశంతో 2007 లో కామారెడ్డి రక్తదాతల సమూహాన్ని ఏర్పాటుచేసి రాష్ట్రవ్యాప్తంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో రక్తాన్ని అందజేస్తున్నామని అన్నారు.రక్తదానానికి ముందుకు వచ్చిన రక్తదాత ప్రసాద్ కు కృతజ్ఞతలను తెలియజేశారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

పెద్దవంగర, నవంబర్ 21:తెలంగాణ పత్రిక



కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పెద్దవంగర మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రమోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొండ్ర జైపాల్ (35)కు విజయవాడకు చెందిన లక్ష్మితో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గత ఐదేళ్లుగా భార్యాభర్తల మధ్య కుటుంబ విషయాల్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పది రోజుల క్రితం లక్ష్మి తన పుట్టింటికి విజయవాడ వెళ్లిపోయింది. అప్పటి నుంచి జైపాల్ తీవ్ర మనస్తాపానికి గురై సరిగా ఆహారం తీసుకోకుండా ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి భోజనం అనంతరం నిద్రపోయాడు. శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో కుటుంబ సభ్యులు లేచి చూడగా ఇంట్లో ఫ్యాన్ ఇనుప కొండికి లుంగీతో ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే కిందకు దించి పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు.కుటుంబ సమస్యలతో తీవ్ర మనస్తాపానికి గురై జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి తల్లి కొండ్ర ధనమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన కుమారుడి మృతిపై ఎవరిపైనా అనుమానం లేదని పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రమోద్‌కుమార్ తెలిపారు.

కోడూరి లీలావతి దేవి బాల ప్రతిభా పురస్కారం అందుకున్న రిషిక



గంభీరావుపేట తెలంగాణ పత్రిక నవంబర్ 21



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని పర్స కుర్మ రిషిక శనివారం హైదరాబాద్ లో కోడూరి లీలావతి దేవి బాల ప్రతిభా పురస్కారం అందుకున్నారు బహుముఖ ప్రజ్ఞావంతురాలు కోడూరి లీలావతి దేవి శతజయంతి ఉత్సవాల సందర్భంగా అక్షరయాన్ అభిజ్ఞ భారత్ కోడూరి లీలావతి దేవి, పద్మిని మెమారియల్ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో వివిధ రంగాలలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన వారికి ఈ పురస్కారం అందిస్తుండగా, సాహిత్య విభాగంలో పాఠశాల స్థాయిలోనే అందమైన ఆటవెలది పద్యాలతో కృషి శతకం రాసినందుకు గాను ఈ పురస్కారం ప్రముఖులు సుద్దాల అశోక్ తేజ, డాక్టర్ వెలుదండి నిత్యానంద రావు,బైస దేవదాసు, విమలక్క డాక్టర్ మామిడి హరికృష్ణ చేతుల మీదుగా సంస్థ నిర్వాహకులు అందిస్తూ చిన్ననాడె (పద్య)కృషి శతకం రాసి బాలకవయిత్రిగా ఎదగడం చాలా గొప్పదనం అంటు ప్రశంసించారు.బాల ప్రతిభా పురస్కారం అందుకున్న రిషికను ప్రశంసి స్తూ, ఆమెను అలా తీర్చిదిద్దిన తెలుగు ఉపాధ్యాయులు కాల్వ రాజయ్య, నరేందర్ లను ప్రధానోపాధ్యాయులు సంటి గంగారాంను అభినం దించారు పురస్కారం అందుకున్న రిషికకు పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు

ఎండిపోయిన వరి పంటను పరిశీలించిన వ్యవసాయ అధికారి



తెలంగాణ పత్రిక చారకొండ, నవంబర్ 21:

చారకొండ మండలంలోని మర్రిపల్లి తండాలో రైతులు ఆంబోతు రవి, ఆంబోతు సూర్య సాగు చేసిన రెండు ఎకరాల వరి పంట పూర్తిగా ఎండిపోయింది. ఈ విషయం తెలుసుకున్న వ్యవసాయ శాఖ అధికారులు శనివారం క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించారు. మర్రిపల్లి సర్పంచ్ బిట్ల తేజశ్రీ సుధాకర్ రెడ్డితో కలిసి మండల వ్యవసాయ అధికారి తనుజ రాజ్ ఎండిపోయిన వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించి, పూర్తి వివరాలతో ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు. రైతులు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రేణుక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఇంగ్లీష్ ఒలింపియాడ్, స్టూడెంట్ టాక్ పోటీల్లో నాగునూరు, చామనపెల్లి, మొగ్డుంపూర్ విద్యార్థుల ప్రతిభ

-మొదటి బహుమతులు సాధించిన విద్యార్థులు ఐ
-జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక



కరీంనగర్, నవంబర్ 21 తెలంగాణ పత్రిక

ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్, కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో తెలంగాణ ఇంగ్లీష్ ఒలింపియాడ్ (TEO) మరియు స్టూడెంట్ టాక్ మండల స్థాయి పోటీలను 21.11.2026న కరీంనగర్ రూరల్ మండల విద్యా వనరుల కేంద్రం (వీ=జ)లో నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతులు సాధించారు.

స్టూడెంట్ టాక్ విభాగంలో:

1. పి. శ్రీవిద్య -- ZPHS నాగునూరు
2. వి. రితిక -- ZPHS చామనపెల్లి

తెలంగాణ ఇంగ్లీష్ ఒలింపియాడ్ (TEO) విభాగంలో

1. డి. శ్రీవర్ష -- ZPHS మొగ్డుంపూర్.
2. ఎస్. శ్రీనందన్ ZPHS నాగునూరు

ఈ విద్యార్థులందరూ ప్రథమ బహుమతులు సాధించి విజేతలుగా నిలిచారు. వీరు డిసెంబర్ 19, 2026న నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి శ్రీమతి వాసవి విజేతలను అభినందించి, జిల్లా స్థాయి పోటీల్లో కూడా మరింత ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు కందుకూరి శ్రీనివాస్, పి. వెంకటరమణ, శ్రీనివాస్, ఎస్. రాజు, స్రవంతి తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్థాయిలో ప్రతిభ చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, విద్యా శాఖ అధికారులు అభినందించారు.

రాష్ట్ర ఖో ఖో జూనియర్ జట్టుకు దీక్షిత్ ఎంపిక

తెలంగాణ పత్రిక నవంబర్ 21అశ్వాపురం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా



అమెర్ద విద్యార్థి ఘనత గ్రామంలో హర్షం అశ్వాపురం మండలం అమెర్ద గ్రామ పంచాయతీ పరిధిలోని తెల్లవారి గుంపుకు చెందిన కల్లూరి నరసిం హారావు – వెంకటలక్ష్మి దంపతుల కుమారుడు దీక్షిత్ రాష్ట్ర స్థాయి ఘనత సాధించాడు. ఈ నెల 27న జరగబోయే స్టేట్ మీట్ జూనియర్ ఖో ఖో జట్టుకు దీక్షిత్ ఎంపిక య్యాడు. ప్రస్తుతం దీక్షిత్ కిన్నెరసాని (పాల్వంచ) గురుకులంలో 9వ తరగతి చదువుతున్నాడు. దీక్షిత్ ఎంపిక పట్ల అమెర్ద గ్రామస్తులు, పాఠశాల అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయిలో రాణించి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కేంద్రాలను జిల్లా కలెక్టర్‌తో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

తెలంగాణ పత్రిక నవంబర్ 21 మాడుగులపల్లి :



మాడుగులపల్లి మండలం కేంద్రంలోని కుక్కడం , గంద్రవాణిగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకంనమోదు కేంద్రాలను జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ IAS తో కలిసి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సందర్శించి, నమోదు ప్రక్రియను పరిశీలించారు. నమోదు కేంద్రాలను సందర్శించి, పథకం నమోదు విధానం, ప్రజలకు అందుతున్న సేవలు, నమోదు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యల పై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకం ప్రాధాన్యతను ప్రజల కు వివరించారు... అర్హులైన కుటుంబాలన్నీ ఈ పథకంలో నమోదు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపె డుతున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయ డమే ప్రభుత్వ ధ్యేయమని, ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా ప్రతి కుటుంబానికి భద్రత కల్పించడమే లక్ష్యమని తెలిపారు. అర్హులైన వారం దరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నమో దు చేసుకోవాలని కోరారు. నమోదు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమ స్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో RDO రమణారెడ్డి సంబంధిత అధికా రులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు కేంద్రం ఏర్పాటు

-అర్హులైన ప్రతి ఒక్కరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి -- కౌన్సిలర్ మంద గౌతమీ రఘువీర్ బిన్నీ

తెలంగాణ పత్రిక , నవంబర్ 21, నాగార్జునసాగర్ టౌన్:



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించి నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్ కాలనీ 4వ వార్డులో ప్రత్యేక నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వార్డు కౌన్సిలర్ మంద గౌతమీ రఘువీర్ బిన్నీ తెలిపారు. బాలవిహార్ ఎదురుగా ఉన్న రేకుల బడిలో ఈ నమోదు కౌంటర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బీమా పథకంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ పథకానికి 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు అర్హులని తెలిపారు. 1967 నవంబర్ 19 నుంచి 2008 నవంబర్ 18 మధ్య జన్మించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వయస్సు నిర్ధారణకు ఆధార్ కార్డులో నమోదైన పుట్టిన తేదీనే ప్రామా ణికంగా తీసుకుంటారని వివరించారు. దరఖాస్తు చేసు కునే వారు ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డు నంబర్, మొబైల్ నంబర్, నామినీ వివరాలను సమర్పించాల్సి ఉంటుంది. లబ్ధిదారులు ఒకరిని లేదా అంతకంటే ఎక్కువ మందిని నామినీలుగా ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. భార్యకు 50 శాతం, కుమారుడికి 25 శాతం, కుమార్తెకు 25 శాతం వాటా కేటాయించే విధంగా నామినీ వివరాలను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. నామినీ మైనర్ అయితే వారి సంరక్షకుడి వివరాలను కూడా అందించాల్సి ఉంటుందని వివరించారు. 2026 నవంబర్ 19 నుంచి డిసెంబర్ 18 వరకు గ్రామాలు, వార్డుల్లో ప్రత్యేక శిబిరాల ద్వారా నమోదు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఈ పథకంలో నమోదు చేసుకోవడానికి ఇలాంటి రుసుము చెల్లించవలసిన అవసరం లేదని, భీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ అవసరమైన పత్రాలతో నమోదు చేసుకోవాలని కోరారు.

శబరిమలకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు

-కామారెడ్డి డిపో నుంచి ప్రత్యేక సౌకర్యం
-డిపో మేనేజర్ దినేష్ కుమార్ వెల్లడి

తెలంగాణ పత్రిక నవంబర్ 21 కామారెడ్డి ప్రతినిధి:



అయ్యప్ప దీక్షలో ఉన్న స్వాములు, శబరిమల వెళ్లే భక్తుల సౌకర్యార్థం కామారెడ్డి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సౌకర్యాన్ని కల్పించినట్లు డిపో మేనేజర్ పి. దినేష్ కుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని అయ్యప్ప స్వాములు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సంద ర్భంగా డిపో మేనేజర్ మాట్లా డుతూ.. గురుస్వాములు బస్సును ప్రత్యేకంగా బుక్ చేసుకుంటే ప్రయాణ చార్జీల్లో రాయితీ కల్పించనున్నట్లు తెలిపారు. బస్సు సీటింగ్ సామర్థ్యానికి అదనంగా ఇద్దరు వంట మనుషులు, ఇద్దరు మణికంఠ స్వాములకు అనుమతి ఉంటుం దని వెల్లడించారు. శబరిమల వెళ్లే బస్సులకు టోల్‌గేట్ రుసుములు, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దు పన్నులు భక్తులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. తెలంగాణ ఆర్టీసీ బస్సులకు కేరళ రాష్ట్రంలోనూ సరిహద్దు పన్నుల మినహా యింపు ఉందని తెలిపారు. అయితే బస్సుల పార్కింగ్ చార్జీలను భక్తులే భరించాల్సి ఉంటుం దని స్పష్టం చేశారు. ప్రతి బస్సుకు మార్గాలపై పూర్తి అవగాహన, అనుభవం కలిగిన ఇద్దరు నైపుణ్యం గల డ్రైవర్లను కేటాయిం చనున్నట్లు పేర్కొన్నారు. అలాగే కార్తీక మాసాన్ని పురస్కరిం చుకుని భక్తుల కోసం శ్రీశైలం, కాణి పాకం, స్వర్ణ దేవాలయం, జోగులాంబ, కంచి కామాక్షి, అరుణాచలం వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల దర్శనానికి కూడా కామారెడ్డి డిపో నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు డిపో మేనేజర్ పి. దినేష్ కుమార్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట



-9వ వార్డులో పింఛన్లు పంపిణీ
-కౌన్సిలర్ బండారు మంగమ్మ వెంకన్న

తెలంగాణ పత్రిక నవంబర్ 21,సూర్యాపేట:



పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తుంది అని 9వ వార్డు కౌన్సిలర్ బండారు మంగమ్మ వెంకన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని 9 వ వార్డులో శనివారం ఒంటరి మహిళ, వితంతు, వృద్ధులు, వికలాంగులకు మంజూ రైన చేయూత పింఛన్లను అందజేసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను చేపడుతుందని తెలిపారు. అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో పేద ప్రజలకి ఇందిరమ్మ ఇండ్లు, సంక్షేమ పథకాలు 200 యూనిట్ల వరకు గృహాలకు ఉచిత విద్యుత్తు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం పేదవాళ్ళకి సన్న బియ్యం లాంటి మరెన్నో పథకాలను అందిస్తున్నని వారు అన్నారు. 2029 న రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని మరో పర్యాయం గెలిపించాలని వారు కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేస్తుందని ఆయన అన్నారు. ఈ



కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ సైదా, నాయకులు ఈదుల జానయ్య,జిన్నా రఘు, రమేష్ వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.